
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 101
మంగళవారం 26-12-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'


సఫారీ టెస్ట్ సవాల్
నేటి నుంచి భారత్, సౌతాఫ్రికా తొలి టెస్టు సిరీస్ వేటలో టీమిండియా - 12లో



ఐపీవోలకు కంపెనీల క్యూ
2024లోనూ మరిన్ని ఇష్యూలు స్టాక్ నిపుణుల అంచనాలు - 13లో


ఉత్తరాదిని 'కమ్ముకున్న పొగమంచు'
చలికి ఉత్తరాది రాష్ట్రాలు గజగజ వణుకుతున్నాయి. ఉష్ణోగ్రతలు తగ్గడంతో ఆయా రాష్ట్రాల్లో పొగమంచు కమ్ముకుంటోంది.
వివరాలు 6లో ▸


సాధికారతే ధ్యేయం
సమాజంలో నిరుపేద, అణగారిన వర్గాల సాధికారతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రధాని మోదీ చెప్పారు.
వివరాలు 6లో ▸

కాషాయ 'ప్ర'దక్షిణం'..!
2024 ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ తన దృష్టినంతా దక్షిణాదిపై కేంద్రీకరించింది.
వివరాలు 6లో ▸


పెద్ద పదవులు కోరుకోవడం లేదు
తనకు పెద్ద కోరికలేవీ లేవని, పెద్ద పదవులను తాను ఆశించడం లేదని బిహార్ సీఎం, జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ అన్నారు.
వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్
నమ్మక ద్రోహం నారా బాబుదే!
- చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.715.84 కోట్ల బీమా పరిహారాన్ని రైతన్నలకు చెల్లించింది సీఎం జగన్ ప్రభుత్వమే
- అన్నదాతపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా
- 2022–23 నుంచి పీఎంఎఫ్‌బీవైతో అనుసంధానం
- మెజార్టీ రాష్ట్రాల్లో ఇదే విధానం

5 లో

రైతుబజార్లపై 'కుళ్లు' కథ
- రాష్ట్రంలో రైతుబజార్లు బాగున్నా, చెత్త రాతలు రాసిన 'ఈనాడు'
- చంద్రబాబు హయాంలో ఒక్క రైతు బజారూ బాగుపడలేదు
- అప్పట్లో అన్నీ దళారులు, దోపిడీకి నిలయాలు.. ఇవన్నీ పోయాయనే రామోజీ బాధ
- ఈ నాలుగున్నరేళ్లలో రూ.40 కోట్లతో కొత్తగా 54 రైతుబజార్లు
- 4.50 కోట్లతో రైతుబజార్ల ఆధునీకరణ.. ప్రతీ రైతుబజార్లో ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం
- ప్రభుత్వ చర్యలతో ఆర్థిక సమృద్ధి సాధిస్తున్న రైతుబజార్లు

10 లో

ఆడేద్దాం అదిరేలా
నేడు గుంటూరులో 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను ప్రారంభించనున్న సీఎం జగన్

- నల్లపాడు లయోలాలో క్రీడా వేడుకలు లాంఛనంగా ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ/వార్డు సచివాలయాల స్థాయిలో పోటీలు
- 5.09 లక్షల స్పోర్ట్స్ కిట్ల పంపిణీ
- 47 రోజులు.. 5 దశల్లో నిర్వహణ
- 1.22 కోట్ల మంది క్రీడాకారులు, వీక్షకుల రిజిస్ట్రేషన్లు
- ఐదు క్రీడాంశాల్లో 34.19 లక్షల మంది క్రీడాకారుల నమోదు
- అత్యధికంగా క్రికెట్‌లో 13 లక్షల మంది.. యోగ, మారథాన్, టెన్నీకాయిట్‌లో 16 లక్షల మంది నమోదు
- గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ప్రత్యేక ప్రణాళిక



సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. దేశంలోనే అతిపెద్ద మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్ర'తో క్రీడోత్సాహం ఉప్పొంగనుంది. 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం గుంటూరు జిల్లా నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో లాంఛనంగా ప్రారంభించనున్నారు. అనంతరం 15,004 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యేలు, మంత్రులు, కలెక్టర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఆటల పోటీలు మొదలవుతాయి. ప్రతి జిల్లాకు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించి ప్రభుత్వం క్రీడాకారుల్లో స్ఫూర్తిని పెంపొందిస్తోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి గ్రామ స్థాయిలోని వలంటీర్ల వరకు ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో భాగస్వాములను చేసింది. 3.33 లక్షల జట్లు పోటీ పడేందుకు అనువుగా

మిగతా 2వ పేజీలో ▶


వైఎస్సార్ జిల్లా పులివెందుల సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో సీఎం మాతృమూర్తి వైఎస్ విజయమ్మ 2 లో

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ సంబరాలు
భక్తులతో కిటకిటలాడిన చర్చిలు - వివరాలు 2లో

ప్రభుత్వ చదువులకు సలాం
- పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చూపు ఏపీ వైపే
- ఏపీ విద్యా విధానాలకు ఫిదా.. తమ ప్రాంతాల్లోనూ అమలు చేస్తామంటున్న వైనం.. ఫలించిన సర్కారు చదువుల యజ్ఞం
- 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు
- సత్ఫలితాలనిస్తున్న విద్యా పథకాలు.. చదువులో ప్రతిభ చాటిన వారికి 'జగనన్న ఆణిముత్యాలు'గా ఎంపిక చేసి సత్కారం

3 లో




దేవదాయ శాఖలో 70 ఇంజనీరింగ్ పోస్టులకు నోటిఫికేషన్
- 35 ఏఈఈ (సివిల్), 5 ఏఈఈ (ఎలక్ట్రికల్), 30 టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్) పోస్టుల భర్తీ
- కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకం.. 30 వరకు దరఖాస్తుల స్వీకరణ
- రాతపరీక్ష ద్వారా ఎంపిక

3 లో

యూపీఐ పేమెంట్లే మోసగాళ్ల టార్గెట్

- దేశంలో రోజుకు సగటున 23 వేల సైబర్ నేరాలు
- వాటిలో 55% యూపీఐ మోసాలే
- తరువాత స్థానాల్లో కార్డు, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ నేరాలు
- 'అనాటమీ ఆఫ్ ఫ్రాడ్స్–2023' నివేదిక వెల్లడి

10 లో

సూక్ష్మ సేద్యం.. సిఫార్సుల్లేకుండా సాధ్యం

- సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ
- అర్హతే కొలమానం.. అడిగిన వెంటనే పరికరాల అమరిక
- 2023–24లో 902.56 కోట్లతో 2.50 లక్షల ఎకరాల్లో విస్తరణ లక్ష్యం
- జనవరి నాటికి లక్ష్యాన్ని అధిగమించేలా అడుగులు

- వివరాలు 10లో ▸

ఇదండీ సంగతి





'తమ్మిలేరు' పనులు ఆలస్యం
- ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు
- మిచాంగ్ తుపానుతో 344 అడుగులకు నీటిమట్టం
- ఆధునికీకరణపై ప్రభావం
- నీరు తగ్గిన తర్వాత పనులు

చింతలపూడి: ఏలూరు జిల్లాలో మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల్లో ఒకటైన తమ్మిలేరు జలాశయం ఎడమ కాలువ మరమ్మతు పనులు ఆలస్యం కానున్నట్టు నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. మిచాంగ్ తుపాను కారణంగా భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో పనులకు ఆటంకం ఏర్పడింది. ప్రాజెక్టు ఆధునీకరణ నిమిత్తం జపాన్ ఆర్థిక బ్యాంక్ నుంచి 2018లో రూ.16.91 కోట్ల రుణం మంజూరైంది. అయితే అప్పటి టీడీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే విషయంలో నిర్లక్ష్యం చూపడంతో పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమ్మిలేరు ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రాజెక్ట్ కింద పంట కాలువల మరమ్మతుల కోసం ఈ ఏడాదిలోనే రూ.13 కోట్లకు టెండర్లు ఖరారు చేసి ఫిబ్రవరిలో ఎడమ కాలువ మరమ్మతు పనులను అధికారులు ప్రారంభించారు. ఇవి పూర్తయితే జలాశయం నుంచి సాగునీటి సరఫరాకు అడ్డంకులు తొలగిపోతాయి. 40 ఏళ్లుగా పనులకు నోచుకోని ప్రాజెక్ట్‌కు శాశ్వత మరమ్మత్తులు చేపట్టడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆయకట్టు
తమ్మిలేరు ప్రాజెక్ట్ కింద రిజర్వాయర్ ఎగువ భాగంలో 20,230 ఎకరాలు, దిగువ భాగంలో ఏలూరు వెళ్లే ఇరుపక్కలా 15 ఏటి కాలువల ద్వారా 14,200 ఎకరాలు సాగవుతున్నాయి. ఏలూరు జిల్లాలోని తలార్లపల్లి, యర్రంపల్లి, యడవల్లి, కళ్యాణంపాడు, తువ్వచెలక రాయుడుపాలెం గ్రామాలకు చెందిన 475 ఎకరాల పల్లం భూములకు, 3,769 ఎకరాల మెరక భూములకు నీరు సరఫరా చేస్తున్నారు. అలాగే ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లాలో పోలవరం, చాత్రాయి, తుమ్మగూడెం, మంకొల్లు, సోమవరం గ్రామాల్లో 1,855 ఎకరాల పల్లం భూములకు, 3,070 ఎకరాల మెరక భూములకు సాగునీరు లభిస్తుంది.

నీటిమట్టం తగ్గిన వెంటనే..

తమ్మిలేరు ప్రాజెక్ట్‌లో మిచాంగ్ తుపాను వల్ల ఇటీవల గరిష్ట స్థాయిలో నీరు చేరింది. దీంతో పంట కాలువల మరమ్మతుల పనులు చేయడం సాధ్యం కాదు. జలాశయంలో నీటిమట్టం తగ్గిన తర్వాత జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేసవిలో కాలువల పటిష్టతకు చర్యలు తీసుకుంటాం.
–బి.శ్రీనివాసరావు, డీఈ, తమ్మిలేరు ప్రాజెక్టు

ఏఏ పనులంటే..
- ప్రాజెక్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువలతో పాటు మంకొల్లు కాలువకు సంబంధించి 70 కిలోమీటర్ల మేర 765 పనులను అధికారులు గుర్తించారు. వాటిలో అవసరమైన పనులను తొలుత ప్రారంభించారు.
- పంట కాలువల్లో పూడికతీతతో పాటు స్లూయిజ్‌ల మరమ్మతులు, కాలువల గేట్లు అవసరమైతే పునర్నిర్మాణం చేపట్టనున్నారు.
- జలాశయం ప్రధాన కట్టకు రూ.కోటి వ్యయంతో మరమ్మతులు చేపట్టనున్నారు.
- ప్రాజెక్టు ప్రాంతంలో ఇన్‌స్పెక్షన్, జనరేటర్ గదులను నిర్మించనున్నారు.
- ఈ ఏడాది తొలకరి నాటికి పంట కాలువల పనులు పూర్తి చేయాలని భావించినా వర్షాల వల్ల పనులు నిలిచిపోయాయి.
- ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు తగ్గి పనులు ప్రారంభించాలని అనుకుంటున్న తరుణంలో మిచాంగ్ తుపాను అడ్డంకిగా మారింది.
- వచ్చే వేసవిలోనే మళ్లీ పనులు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.



ధనుర్మాసం రానే వచ్చింది.. తెలుగువారి పండగలకు ఆహ్వానం పలికింది.. దీనికి ప్రతీకగా గ్రామాల్లో హరిదాసుల సందడి మొదలైంది.. గలగల గజ్జెల చప్పుడు, అలరించే హరినామ సంకీర్తనలతో గ్రామాలకు సంక్రాంతి శోభ సంతరించుకుంది.. శిరస్సుపై అక్షయపాత్ర ధరించి ఒక చేత్తో వీణ, మరో చేత్తో చిడతలు వాయిస్తూ హరినామ సంకీర్తనలను ఆలపిస్తూ సంచరించే హరిదాసులు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు. వారి గానం వినిపిస్తే చాలు ప్రతి ఇంటి ముందు అతివలు బియ్యం, పండ్లు, పూలతో వేచి ఉంటారు. వారి దగ్గరకు రాగానే హరిదాసు కూర్చుంటే ఆయన శిరస్సుపై ధరించిన అక్షయపాత్రలో ఆ బియ్యం వేసి సాక్షాత్తు ఆ నారాయణుడే తమ ఇంటికి వచ్చినట్లుగా భావించి చేతులు జోడించి నమస్కరిస్తారు. ఇదంతా ధనుర్మాసం ప్రారంభం నుంచి ప్రతి గ్రామంలో 33 రోజుల పాటు కొనసాగుతుంది.

హరికి దాసులై.. సంస్కృతికి సారథులై
పల్లెల్లో హరిదాసుల సందడి.. సంక్రాంతిలో వీరి 'పాత్రే' ప్రాధాన్యం

ఓపిక ఉన్నంత కాలం..

నేను 35 ఏళ్లుగా హరిదాసుగా గ్రామాల్లో తిరుగుతున్నా. ఇది తాతల కాలం నుంచి వారసత్వంగా వస్తోంది. శ్రీమద్మారమణ గోవిందా హరి అనే హరి నామమే మాకు ప్రాణం. విష్ణుమూర్తి స్వరూపమైన హరికి దాసులుగా కొనసాగడం వల్లే మేము హరిదాసులుగా పేరొందాం. హరికి ప్రీతిపాత్రమైన ధనుర్మాసం, మాఘమాసంలో హరినామ సంకీర్తనలను గ్రామాల్లో ప్రసరింపజేస్తున్నాం. ప్రతి రోజూ ఉదయం నాలుగు గంటల నుంచి మా సంకీర్తన ప్రారంభమవుతుంది. రోజుకు సుమారు 20 నుంచి 25 కిలోమీటర్లు తిరుగుతాం. ఇలా 33 రోజులు హరికి దాసులుగానే జీవిస్తాం. గ్రామాల్లో కొంత మార్పు వచ్చినా ఆదరణ బాగుంది. కాకినాడ జిల్లాలో సుమారు 250 మంది వరకూ తిరుగుతున్నాం. పిఠాపురం నియోజకవర్గంలో 12 మంది ఇంటింటికీ వెళ్తున్నాం.
–చల్లా చక్రపాణి, గరివిడి గ్రామం, విజయనగరం జిల్లా

పిఠాపురం: సంస్కృతీ సంప్రదాయాలను ఇనుమడింపజేసే హరిదాసుల నామసంకీర్తన వెనుక వారు పడే కష్టం పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూస్తాయి. కేవలం 33 రోజులు ఇలా హరిదాసులుగా తిరిగే వీరు మిగిలిన 11 నెలల పాటు సామాన్యుల్లా కాయకష్టం చేసి కడుపు నింపుకొనే వారే. మోయలేని భారమైనా తరతరాల నుంచి వస్తున్న సంప్రదాయాలను కొనసాగించాలనే పట్టుదలే వీరిని హరిదాసులుగా కొనసాగిస్తుందనడంలో సందేహం లేదు. దీక్షా.. పట్టుదలే వీరికి ఆయుధాలు. అలుపెరుగని కాలినడకే వీరి దైనందిన జీవితం. కాకినాడ జిల్లాలో సుమారు 250 మంది విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి వచ్చిన హరిదాసులు గ్రామాల్లో తిరుగుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అక్కడి వారే హరిదాసులుగా కొనసాగుతున్నారు. వీరు సాగే పయనంలో ఆకలి దప్పికలు వారికి అసలు గుర్తుకురావు. ఎవరేమనుకున్నా వారి హరినామ సంకీర్తన ఆగదు.

అక్షయ పాత్రదే ప్రథమ స్థానం
కలశం లేదా అక్షయపాత్రగా పిలిచే ఆ పాత్రకు ప్రజలు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ పాత్రలో బిక్ష వేయడం ద్వారా నారాయణుడికి నైవేద్యం సమర్పించినట్లు భక్తులు భావిస్తారు. అదీ ధనుర్మాసంలో హరికి కొత్తగా పండిన ధాన్యాలు సమర్పించడం ద్వారా పాడి పంటలు అభివృద్ధి చెందాలని భక్తులు కోరుకుంటారు. ఈ అక్షయపాత్ర హరిదాసు శిరస్సుపై ఉన్నంత సేపు కాలకృత్యాలు తీర్చుకోవడం గాని, అన్న పానీయాలు తీసుకోవడం గాని, కనీసం వేరొకరితో మాట్లాడడం గాని చేయడం నిషేధం. అకుంటిత దీక్షతో సాక్షాత్తు ఆ నారాయణుడే గ్రామాల్లో తిరుగుతున్నాడని పించేలా పవిత్రంగా తిరగాల్సి ఉంటుంది. అలాగే ఆ పాత్ర శిరస్సుపై ఉన్నంత సేపు పాదరక్షలు కూడా వేసుకోకుండా ఎక్కడా ఆగకుండా (బిక్ష వేసేటప్పుడు తప్ప) గ్రామ సంచారం కొనసాగించాలి. ఎక్కడైనా అక్షయపాత్ర నిండితే ఆ ప్రాంతంలోని ఒకచోట దానిలో బిక్షను భద్రపరిచి తిరిగి సంకీర్తనను ప్రారంభిస్తారు. పాత్ర ధరించే ముందు తలస్నానం చేసి హరిదాసు వేషధారణలో భాగంగా పంచె, కండువా ధరించి పూలతో అలంకరించిన అక్షయపాత్రను శిరస్సున పెట్టుకునిబయలు దేరుతారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి గ్రామ సంచారం పూర్తయ్యాక అల్పాహారం తీసుకుని సాయంత్రం భోజనం చేసి పాలు తీసుకుంటారు. హరిదాసులు మాంసాహారానికి దూరంగా ఉంటారు.


అక్షయపాత్ర, చిడతలు, వీణ



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

అమ్మ ఒడితో చదువు సాగుతోంది

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మా పాప రామిశెట్టి నాగ గంగా భవాని ఎనిమిదో తరగతి చదువుతోంది. మాది వ్యవసాయ కుటుంబం. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. చదివించాలన్న ఆశ ఉన్నా పుస్తకాలకు, దుస్తులకు ఖర్చు అవుతుండడంతో కనీసం పదో తరగతి అయినా చదివించగలనా అనే అనుమానం కలిగేది. ఈ సమయంలో అమ్మ ఒడి పథకం రావడంతో చదివించడానికి ఆధారం దొరికింది. ఈ పథకం కింద ఏటా రూ.15,000 నా ఖాతాలో జమవుతోంది. జగనన్న కిట్‌లో భాగంగా మా పాపకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ, రెండు జతల సాక్స్, బ్యాగ్ ఇచ్చారు. ఈ ఏడాది ట్యాబ్ ఇస్తామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో చదువుకు ఇబ్బంది లేకుండా సాగుతోంది. జగనన్న ప్రభుత్వంలో ప్రైవేట్ పాఠశాలల తరహాలో ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతోపాటు విద్యకు కావలసిన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. చదువుకు పైసా ఖర్చు లేకుండా ఉండడంతో ఈ చదువులతోపాటు ఉన్నత



చదువులు చదివించగలనన్న నమ్మకం ఏర్పడింది. మాది కాకినాడ జిల్లా సామర్లకోట మండలం చంద్రంపాలెం గ్రామం. నా బ్యాంకు ఖాతాలో డ్వాక్రా రుణ మాఫీ మూడు దఫాలుగా రూ.18,000 చొప్పున వచ్చింది. వచ్చే ఏడాది జనవరిలో ఇంకో విడత మాఫీ సొమ్ము వస్తుందని సచివాలయ అధికారులు చెబుతున్నారు. సర్కారు సాయంతో మా కుటుంబం హాయిగా జీవిస్తోంది.

– రామిశెట్టి లోవలక్ష్మి, చంద్రంపాలెం
(అడపా వెంకటరావు, విలేకరి, సామర్లకోట)

భరోసా విలువేంటో తెలిసింది..

నేను సన్నకారు రైతును. నాలుగు ఎకరాల భూమి ఉంది. నా భార్య హసీనాబీ. దినసరి కూలీ. ఇద్దరు కుమారులు జుబేర్ బాష, నిస్సార్ బాష, కుమార్తె చాంద్ బీ సంతానం. పెద్దబ్బాయి ఇంటర్ వరకు చదివి, కర్మాగారంలో పని చేస్తున్నాడు. చిన్న కుమారుడు 10వ తరగతి చదువుతున్నాడు. అమ్మ ఒడి సాయం అందుతుండడంతో వీడి చదువుకు బెంగ లేదు. నంద్యాల జిల్లా గడివేముల మండలం బూజునూరు గ్రామం. గతంలో సాగు పెట్టుబడి, కుటుంబ పోషణ కోసం నేను అప్పు చేయని సంవత్సరం లేదు. ఈ ప్రభుత్వం వచ్చాక నాలుగేళ్లుగా వివిధ పథకాల ద్వారా ఆర్థిక తోడ్పాటు నా కుటుంబానికి గొప్ప ఊరటనిచ్చింది. ముఖ్యంగా రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 సాయం ఠంఛనుగా అందుతోంది. అది కూడా ఖరీఫ్, రబీ ప్రారంభంలో అందుతుండటంతో సేద్యం, విత్తన ఖర్చుల కోసం వడ్డీ వ్యాపారస్తుల్ని ఆశ్రయించాల్సిన అగత్యం తప్పింది. ఇక సున్నా వడ్డీ కింద రూ.లక్ష వ్యవసాయ రుణం తీసుకుని పెట్టుబడికి అయ్యే అదనపు ఖర్చులకు వాడుకుంటున్నాను. ఇదే లక్ష బయట తెచ్చుకుంటే భారీగా వడ్డీ భరించాల్సి వచ్చేది. సోయాబీన్, మినుము, మొక్కజొన్న,



కంది పంటల్ని సాగు చేస్తున్నా. నాణ్యమైన ఎరువుల కోసం రవాణా ఖర్చులు పెట్టుకుని నంద్యాలకు వెళ్లాల్సి వచ్చేది. అయితే, ఇప్పుడు రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు ఊళ్లోనే దొరుకుతున్నాయి. గతంలో కరవుతో కష్టాలు ఎదుర్కొన్న మాలాంటి రైతులకు ఈ ప్రభుత్వం ఏర్పడ్డాకే అసలైన న్యాయం జరిగింది. నా భార్య డ్వాక్రా సంఘంలో సభ్యురాలు. వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.40 వేల రుణం పొందింది. ఇప్పుడు మా కుటుంబం సంతోషంగా ఉంది.

– షేక్ చిన్న షాలుమియ్య, బూజునూరు
(పి.మోహన్‌రెడ్డి, విలేకరి, నంద్యాల)

ప్రతినెలా రూ.10 వేల పింఛన్ వస్తోంది

నా పేరు వెలుగు గోపాల్. మాది అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని కురాకుల తోట గ్రామం. ఏడాదిన్నర క్రితం నా రెండు కిడ్నీలు పాడయ్యాయి. దీంతో మంచానికే పరిమితమయ్యాను. ఉన్నఫళంగా మంచాన పడటంతో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. వారానికి మూడు రోజులు అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్‌కు వెళ్తున్నా. ఇలాంటి సమయంలో మా వార్డు వలంటీర్ శివ ఇంటి వద్దకు వచ్చి మీకు నెలకు రూ.10 వేల పింఛన్ వస్తుందని దరఖాస్తు చేయించారు. దరఖాస్తు చేసిన రెండు నెలల్లోపే పింఛన్ మంజూరైంది. ఇప్పుడు ప్రతినెలా ఒకటో తేదీ మా ఇంటి వద్దకు వచ్చి రూ.10 వేలు నా చేతికి ఇస్తున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న ఆర్థిక సహాయం నాకు, నా కుటుం



బానికి బాసటగా నిలిచింది. నాకు భార్య పార్వతి, ఒక కుమార్తె ఉన్నారు. నా కూతురు నందిని విద్యా దీవెన పథకం ద్వారా చదువుకుంది. ఇటీవలే ఆమెకు వివాహం చేశాం. నా భార్య కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది.

– గోపాల్, కళ్యాణదుర్గం
(ఈడుల శ్రీనివాసులు, విలేకరి, కళ్యాణదుర్గం)

మాతో కలిసి వస్తే పవనే సీఎం అభ్యర్థి: కేఏ పాల్



సీతమ్మధార (విశాఖ ఉత్తర): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనవరి 1వ తేదీలోగా తమతో పొత్తుకు వస్తే సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తామని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డా.కేఏ పాల్ చెప్పారు. విశాఖ ఆశీలమెట్టలోని కేఏ పాల్ ఫంక్షన్ హాల్‌లో, తగరపువలసలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ నుంచి జనసేను తరిమేశారని ఎద్దేవా చేశారు. టీడీపీతో పవన్‌ది అపవిత్రమైన బంధమని అన్నారు. తెలంగాణలో బీజేపీతో కలిసి పవన్ పోటీ చేస్తే నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయన్నారు. జనవరి 30న హైదరాబాద్‌లో గ్లోబల్ పీస్ సమ్మిట్ జరుగుతుందన్నారు. లోకమంతా స్వార్థం, పాపం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పులివెందులలో సీఎం క్రిస్మస్ వేడుకలు

- కేక్ కట్‌చేసి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సీఎం వైఎస్ జగన్
- ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు



పులివెందుల సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు



సీఎం వైఎస్ జగన్‌ను ఆప్యాయంగా ముద్దాడుతున్న మాతృమూర్తి వైఎస్ విజయమ్మ

పులివెందుల: క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం వైఎస్సార్ జిల్లా పులివెందులలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ జిల్లాలో మూడ్రోజుల పర్యటనలో భాగంగా మూడో రోజైన సోమవారం ఉదయం సీఎం ఇడుపులపాయ ఎస్టేట్ నుంచి హెలికాప్టర్ ద్వారా భాకరాపురం హెలిప్యాడ్, అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా పులివెందుల పట్టణానికి చేరుకున్నారు. ఉ.9.30 గంటలకు సీఎస్ఐ చర్చి ప్రాంగణానికి చేరుకుని అక్కడ హాజరైన వారిని ఆప్యాయంగా, చిరునవ్వుతో పలకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం తన బంధువర్గానికి, స్నేహితులు, ఆప్తులు, అభిమానులకు క్రిస్మస్.. ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏటా క్రిస్మస్ రోజున తన సొంత గడ్డపై కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్నిస్తుందన్నారు. అందరి అభిమానం, ఆశీస్సులు, దేవుని చల్లని దీవెనలు తనకు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నానని ఆయన ప్రార్థించారు. రాష్ట్ర ప్రజల రుణం తీర్చుకునేందుకు ముఖ్యమంత్రిగా ప్రజాసేవలో తరిస్తున్నానని.. ఎప్పటికీ మీ హృదయాల్లో ప్రియమైన నాయకుడిగా సుస్థిర స్థానాన్ని పొందుతానన్నారు. అనంతరం.. ముఖ్యమంత్రి జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. 2024 నూతన సంవత్సర చర్చి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆ తర్వాత చర్చి నుంచి రోడ్డు మార్గాన సీఎం బయల్దేరి వైఎస్సార్‌సీపీ నేత నల్లచెరువుపల్లె రవి ఇంటికెళ్లి నూతన దంపతులు మంజ్రేకర్‌రెడ్డి, రేణుకారెడ్డిలను ఆశీర్వదించారు. ఇక ఉ.11.07 గంటలకు సీఎం జగన్ అక్కడ నుంచి బయల్దేరి 11.15 గంటలకు భాకరాపురం హెలిప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడ స్థానిక నాయకులతో మాట్లాడారు. ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. మ.12.19 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి మైదుకూరులోని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ దస్తగిరి నివాసంలో ఆయన కుమారుడు, ఇద్దరు కుమార్తెల వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో కుటుంబ సభ్యులు..

ఇక క్రిస్మస్ వేడుకల్లో సీఎం జగన్ తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతీరెడ్డి, కుటుంబ సభ్యులు వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, ఆత్మీయులు, మిత్రులు, పుర ప్రజలు పాల్గొన్నారు. సీఎం వెంట ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ డి. సుధ, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఆర్డీఓ వెంకటేశులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలపై ఉండాలి

సీఎం వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: నిస్సహాయులపై కరుణ, సాటి వారిపై ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం .. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని సీఎం జగన్ పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఆ కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలపై ఉండాలని కోరుకుంటూ క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అని సోమవారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



వైఎస్సార్ జిల్లా మైదుకూరులో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ దస్తగిరి కుమారుడి వివాహ వేడుకలో నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



పులివెందులలో రామిరెడ్డి రవీంద్రారెడ్డి, రాణిల కుమారుడు జయ మంజ్రేకర్‌రెడ్డి, రేణుకారెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు

గుణదల (విజయవాడ తూర్పు)/కర్నూలు కల్చరల్/దాబాగార్డెన్స్ (విశాఖ)/ : ప్రపంచశాంతిని కాంక్షించిన శాంతిదూత.. కరుణామయుడు.. ఏసుక్రీస్తు జన్మించిన పర్వదినం పురస్కరించుకుని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా చర్చిలన్నీ జనసంద్రంగా మారాయి. లక్షలాది మంది భక్తులు ప్రార్థనలతో పరవశించిపోయారు. ప్రభువు చూపిన మార్గంలో పయనించాలంటూ బిషప్‌లు, పాస్టర్లు సందేశాన్నిచ్చారు. ప్రసిద్ధ క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రం విజయవాడలోని గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో బాలయేసును దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. పశువుల పాకలో పడుకోబెట్టిన బాలయేసు స్వరూపానికి సాగిలపడి మొక్కులు చెల్లించుకున్నారు. పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు భక్తులనుద్దేశించి మాట్లాడారు. సమిష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఆలయానికి వచ్చిన భక్తుల కోసం గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అంబరాన్నింటిన సంబరాలు..

మరోవైపు.. విజయవాడ నగర వ్యాప్తంగా కూడా క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. పలు ప్రముఖ చర్చిల్లో సోమవారం ఉదయం సర్వమానవాళి సుఖ శాంతులతో ఉండేలా చూడాలని దైవకుమారునికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పటమట సెయింట్ పాల్ కథెడ్రల్ చర్చి, సెయింట్ పాల్స్ బసిలికా చర్చి, గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా ఉన్న సెయింట్ పాల్ సెంటినరీ చర్చిలో తెల్లవారుజాము నుంచి ఆరాధనా కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో విశ్వాసులు హాజరయ్యారు. వన్‌టౌన్ తారాపేటలోని పురాతన సెయింట్ పీటర్స్ చర్చి, సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చిలో ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించారు. ఇక విశాఖ నగరంలోని సెయింట్ ఆంథోనీ చర్చి, ట్రినిటీ లూథరన్ చర్చి, జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ రక్షణగిరి పునీత పేతురు చర్చి, బాప్టిస్ట్ చర్చిల్లో క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. క్రీస్తు స్తుతి గీతాలు భక్తుల హృదయాలను పరవశింపజేశాయి. నగరంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న చర్చిల్లోనూ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కర్నూలులోని బిషప్ చర్చిలో రెవరెండ్ చౌరప్ప, సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ వరప్రసాద్, కోల్స్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ అనిల్‌కుమార్ సామ్యేల్, రెవరెండ్ జీవన్‌రావు సందేశం వినిపించారు. యేసును గుండెల్లో నింపుకుని పొరుగు వారిని ప్రేమిస్తూ ఆపన్న సమయంలో చేతనైన సహాయ, సహకారాలందించడమే నిజమైన క్రిస్మస్ అన్నారు. నంద్యాలలోని హోలీక్రాస్ కెథడ్రల్ చర్చిలో బిషప్ రైట్ రెవరెండ్ ఐజక్ వరప్రసాద్, జోసెఫ్ బాబు, హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్–2 (ఆల్‌సెయింట్ చర్చి)లో రెవరెండ్ విజయ్‌కుమార్, డీనరీ చైర్మన్ ఇమ్మానియేల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



కర్నూలులోని హోసన్న మందిరంలో ప్రార్థన చేస్తున్న భక్తులు



విశాఖ సీతమ్మధార చర్చిలో క్రిస్మస్ వేడుకలు



విజయవాడ గుణదల మేరీమాత ఆలయంలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



రాజమహేంద్రవరంలోని సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో ప్రార్థనలు

ఆడేద్దాం అదిరేలా

▶ మొదటి పేజీ తరువాయి

9,478 క్రీడా మైదానాలను తీర్చిదిద్దింది.

ప్రతి రోజు క్రీడోదయమే..

డిసెంబర్ 26 నుంచి ఫిబ్రవరి 10వతేదీ వరకు 47 రోజుల పాటు నిర్విరామంగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. తొలి దశలో జనవరి 9వతేదీ నాటికి గ్రామ/వార్డు సచివాలయాల స్థాయిలో పోటీలను పూర్తి చేయనున్నారు. షెడ్యూల్ ప్రకారం జనవరి 10 నుంచి 23 వరకు మండల స్థాయిలో, జనవరి 24 నుంచి 30 వరకు నియోజకవర్గ స్థాయిలో, జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 6వతేదీ నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పోటీలు నిర్వహించేలా షెడ్యూల్ ఖరారు చేశారు. పాఠశాల విద్యాశాఖ పీఈటీలు, పీడీలతో పాటు శాప్ కోచ్‌లు, క్రీడా సంఘాలను పోటీలు సమర్థంగా నిర్వహించేలా సమాయత్తం చేశారు. ఇప్పటికే రిఫరీలుగా 1.50 లక్షల మంది వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ అందించారు. క్రీడాకారుల మొబైల్ ఫోన్లకు మ్యాచ్‌ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంపించనున్నారు.

1.22 కోట్ల రిజిస్ట్రేషన్లు

ఉరుకుల పరుగుల దైనందిన జీవితంలో దేహ దారుఢ్యం, శారీరక వ్యాయామం విలువను చాటిచెప్పడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలను నిర్వహిస్తోంది. 15 ఏళ్ల పైబడిన పురుషులు, మహిళలను క్రీడల వైపు ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే దాదాపు 1.22 కోట్ల మంది క్రీడాకారులు, వీక్షకుల రిజిస్ట్రేషన్లతో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం చరిత్ర సృష్టిస్తోంది. ఇందులో 34.19 లక్షల మంది క్రీడాకారులు పోటీపడనున్నారు. వీరిలో పది లక్షల మందికిపైగా మహిళలు రిజిస్ట్రేషన్ చేసుకోవడం విశేషం. కాంపిటీటివ్ విభాగంలోని ఐదు ప్రధాన క్రీడాంశాల్లో క్రికెట్‌లో అత్యధికంగా 13 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. నాన్ కాంపిటీటివ్ విభాగంలోని మారథాన్, యోగ, టెన్నీ కాయిట్‌లో 16 లక్షల మంది (కాంపిటీటివ్ విభాగంలో ఉన్నవారితో కలిపి) ఆసక్తి చూపించారు.

5.09 లక్షల కిట్ల పంపిణీ

గ్రామీణ స్థాయిలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో రూ.119.19 కోట్ల బడ్జెట్‌తో ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహిస్తున్నారు. సుమారు రూ.12.21 కోట్ల మేర నగదు బహుమతులు ప్రదానం చేయనున్నారు. దాదాపు రూ.42 కోట్లతో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ క్రీడాకారులకు అవసరమైన 5.09 లక్షల స్పోర్ట్స్ కిట్లను ప్రతి సచివాలయానికి సరఫరా చేశారు. ప్రొఫెషనల్ టోర్నీ తరహాలో మండల స్థాయిలో 17.10 లక్షల టీ షర్టులు, టోపీలతో కూడిన కిట్లను ఇస్తున్నారు.

ప్రొఫెషనల్స్ గుర్తింపు..

నియోజకవర్గ స్థాయిలో ఐదు రకాల క్రీడాంశాల్లో ప్రొఫెషనల్స్‌ను గుర్తించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. క్రికెట్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, బ్యాడ్మింటన్‌లో సింధు, శ్రీకాంత్ బృందాలు, వాలీబాల్‌లో ప్రైమ్ వాలీబాల్, కబడ్డీలో ప్రోకబడ్డీ ఆర్గనైజర్లు, ఖోఖోలో రాష్ట్ర క్రీడా సంఘ ప్రతినిధులు టాలెంట్ హంట్ చేయనున్నాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ప్రతిభగల క్రీడాకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అనంతరం వారికి వివిధ స్థాయిల్లో అంతర్జాతీయ శిక్షణ అందించడం, ఐపీఎల్ లాంటి ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో అవకాశం కల్పించే దృక్పథంతో పోటీలను నిర్వహిస్తోంది.

ఏర్పాట్లను పరిశీలించిన యంత్రాంగం

క్రీడోత్సవాలను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి జగన్ నేడు గుంటూరు జిల్లా నల్లపాడు వస్తున్న నేపథ్యంలో సీఎం కార్యక్రమాల సమన్వయకర్త, శాసన మండలి సభ్యుడు తలశిల రఘురామ్, శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సి.ప్రద్యుమ్న, కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్–కలెక్టర్ ప్రకార్ జైన్, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి తదితరులు సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు.



ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ ప్రాంగణం లయోలా పాఠశాలలో సభావేదిక



సింథటిక్ కోర్టు



విజేతలకు బహూకరించనున్న ట్రోఫీలు

ఆటల పోటీల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ చర్చించారు.



క్రీడాకారుల ఉజ్వల భవిత కోసం



గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ఉజ్వల భవిత కోసమే సీఎం వైఎస్ జగన్ ఇంతటి మహా క్రీడాయజ్ఞాన్ని తలపెట్టారు. ఇది క్రీడా చరిత్రలో అతిపెద్ద మైలురాయి. ఒకే ఈవెంట్‌లో 34 లక్షల మంది క్రీడాకారులు పోటీపడటం ఎప్పుడూ జరగలేదు. 'ఆడుదాం ఆంధ్ర'ను మొక్కుబడిగా కాకుండా ప్రొఫెషనల్స్ గుర్తించి అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నాం. జగనన్న ఏదైనా చెబితే కచ్చితంగా చేస్తారు. దేశానికి పతకాలు అందించే క్రీడా కార్ఖానాగా ఏపీని మారుస్తారు. 21 మంది రాష్ట్రస్థాయి బ్రాండ్ అంబాసిడర్‌లు, 345 మంది జిల్లా స్థాయి క్రీడాకారులు 'ఆడుదాం ఆంధ్ర' ద్వారా క్రీడాకారులకు స్ఫూర్తినిస్తున్నారు.

– ఆర్కే రోజా, పర్యాటక, సాంస్కృతిక యువజన శాఖ మంత్రి

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విజేతలకు బహుమతులు (ఒక్కో జట్టుకు రూపాయిల్లో)	స్థానం	నియోజకవర్గం	జిల్లా	రాష్ట్ర స్థాయి
	ప్రథమ	35,000	60,000	5,00,000
	ద్వితీయ	15,000	30,000	3,00,000
	తృతీయ	5000	10,000	2,00,000

బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలకు బహుమతులు రూపాయిల్లో	స్థానం	నియోజకవర్గం	జిల్లా	రాష్ట్ర స్థాయి
	ప్రథమ	20,000	35,000	2,00,000
	ద్వితీయ	10,000	20,000	1,00,000
	తృతీయ	5000	10,000	50,000

దేవదాయ శాఖలో 70 ఇంజనీరింగ్ పోస్టులకు నోటిఫికేషన్

35 ఏఈఈ (సివిల్), 5 ఏఈఈ (ఎలక్ట్రికల్), 30 టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్) పోస్టుల భర్తీ

కాంట్రాక్టు పద్ధతిలో నియామకం.. 30 వరకు దరఖాస్తుల స్వీకరణ

- రాత పరీక్ష ద్వారా ఎంపిక
- ఎంపిక బాధ్యతలు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాకు
- ప్రస్తుతం దేవదాయ శాఖలో పెద్ద ఎత్తున పనులు
- రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఆలయాల పునరుద్ధరణ, కొత్తవి నిర్మాణం
- పలు ఆలయాల వద్ద అభివృద్ధి పనులు.. కొత్తగా ఇంజనీరింగ్ సిబ్బంది నియామకం

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖలో 70 ఇంజనీరింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలైంది. 35 ఏఈఈ (సివిల్), 5 ఏఈఈ (ఎలక్ట్రికల్), మరో 30 టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్) పోస్టులు కాంట్రాక్టు విధానంలో భర్తీకి దేవదాయ శాఖ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 30 వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ నియామక ప్రక్రియ మొత్తాన్ని ప్రభుత్వం ప్రముఖ సంస్థ 'ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా'కు అప్పగించింది. ఏఈఈ పోస్టులకు సంబంధిత కేటగిరిలో బీఈ, బీటెక్ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. టెక్నికల్ అసిస్టెంట్ల పోస్టులకు ఇంజనీరింగ్ డిప్లొమా పాసైన వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ కేటగిరి రిజర్వేషన్లను అమలు చేయడంతో పాటు రాత పరీక్ష ద్వారా ఈ పోస్టులు భర్తీ చేస్తారు. రాత పరీక్ష వంద మార్కులకు ఉంటుంది. 80 మార్కులకు సంబంధిత ఇంజనీరింగ్ అంశాలపైన, పది మార్కులకు ఇంగ్లిష్ ప్రావీణ్యం, మరో పది మార్కులకు జనరల్ నాలెడ్జితో కూడిన మల్టీపుల్ ఛాయిస్ విధానంలో ప్రశ్నలు ఉంటాయని దేవదాయ శాఖ ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది. దేవదాయ శాఖ పరిధిలో గతంలో ఎప్పుడూ లేని విధంగా కొత్త ఆలయాల నిర్మాణంతో పాటు పురాతన ఆలయాల పునర్నిర్మాణం పనులు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) పథకం ద్వారా ప్రభుత్వం ఈ పనులు చేపడుతోంది. రూ. 450 కోట్లకు పైగా పనులకు అనుమతులు తెలిపింది. అందులో రూ. 250 కోట్లకు పైగా పనులు జరుగుతున్నాయి. వీటికి తోడు విజయవాడ దుర్గగుడి, శ్రీశైలం, కాణిపాకం తదితర ఆలయాల్లో దాదాపు రూ. 350 కోట్ల విలువైన అభివృద్ధి పనులు సాగుతున్నాయి. మరోపక్క టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా దేవదాయ శాఖ ఆధ్వర్యంలోనే రాష్ట్రమంతటా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార కాలనీల్లో రూ. 300 కోట్ల ఖర్చుతో 3 వేల ఆలయాల నిర్మాణం జరుగుతోంది. మరో రూ. 50 కోట్ల టీటీడీ ఆర్థిక సహాయంతో రాష్ట్రమంతటా 120కి పైగా కొత్త ఆలయాల నిర్మాణం సాగుతోంది. మరోవైపు దేవదాయ శాఖ పరిధిలోని ప్రముఖ ఆలయాలన్నింటికీ వచ్చే 35 ఏళ్ల దాకా పెరిగే ఒత్తిడిని దృష్టిలో పెట్టుకొని ఆలయాల వారీగా కొత్త మాస్టర్ ప్లాన్లను రూపొందించింది. వాటికి అనుగుణంగా ఆ ఆలయాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అత్యవసరంగా కాంట్రాక్టు విధానంలో ఇంజనీరింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపడుతున్నట్టు దేవదాయ శాఖ పేర్కొంది.

పూర్తి పారదర్శకంగా భర్తీ ప్రక్రియ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రస్తుతం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ఆలయాల నిర్మాణం జరుగుతోంది. ఈ పనులు వేగంగా పూర్తి చేసేందుకు కొత్తగా ఇంజనీరింగ్ సిబ్బందిని నియమిస్తున్నాం. నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఉండేందుకు ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ 'ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా'కు అప్పగించాం.

– కొట్టు సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ)



దేవదాయ శాఖ భర్తీ చేసే పోస్టులు కేటగిరీల వారీగా..

ఏఈఈ (సివిల్) - 35

కేటగిరీ	పోస్టుల సంఖ్య
ఓసీ	15
బీసీ	09
ఎస్సీ	05
ఎస్టీ	03
ఈడబ్ల్యూఎస్	03

ఏఈఈ (ఎలక్ట్రికల్) - 05

కేటగిరీ	పోస్టుల సంఖ్య
ఓసీ	03
బీసీ (ఏ)	01
ఎస్సీ	01

టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్) 30

కేటగిరీ	పోస్టుల సంఖ్య
ఓసీ	13
బీసీ	08
ఎస్సీ	05
ఎస్టీ	02
ఈడబ్ల్యూఎస్	02

రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌కు కొత్తరూపు



సాక్షి, అమరావతి: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్ త్వరలో కొత్త రూపు సంతరించుకోనుంది. ఇందుకోసం ఆ శాఖ ఒక కమిటీని నియమించింది. సేవలను ప్రజలు సులభంగా వినియోగించుకునేలా వెబ్‌సైట్ డిజైన్, ఆప్షన్లను మార్చనున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ గత 30 సంవత్సరాలుగా వినియోగిస్తున్న కార్డ్ (కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్) సాఫ్ట్‌వేర్‌ను ఇటీవల కార్డ్ ప్రైమ్‌గా అప్‌డేట్ చేశారు. ఈ విధానంలో వినియోగదారులే నేరుగా ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో డాక్యుమెంట్లను తమంతట తాము తయారు చేసుకునే సౌలభ్యాన్ని కల్పించారు. స్థిరాస్తి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రాథమిక వివరాలను ఎంటర్ చేయగానే ఒక మోడల్ డాక్యుమెంట్ జెనరేట్ అవుతుంది. దాన్ని అలాగే వినియోగించుకోవడం లేదా అవసరమైన మార్పులు చేసుకునే అవకాశం కల్పించారు. అలాగే సర్వే నెంబర్ ఎంటర్ చేయగా దాని మార్కెట్ విలువ కనిపిస్తుంది. దానికి తగ్గట్టుగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ ఛార్జీలు కనిపిస్తాయి. ఆ మొత్తాన్ని గతంలో మాదిరిగా బ్యాంకులకు వెళ్లి చలానాల రూపంలో చెల్లించడం కాకుండా ఆన్‌లైన్‌లోనే చెల్లించేందుకు వీలుగా ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వేతో అనుసంధానించారు. అనంతరం టైమ్ స్లాట్ బుక్ చేసుకుని ఆ సమయంలో రిజిస్ట్రేషన్‌కు వెళ్లడం, అక్కడ ఈ–సిగ్నేచర్, వ్యవసాయ భూములైతే ఆటో మ్యుటేషన్ సౌకర్యాలు కల్పించారు. ఈ సేవలన్నింటినీ రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు సులభంగా వినియోగించుకునేలా వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నారు. వివాహ రిజిస్ట్రేషన్లు, సంస్థల రిజిస్ట్రేషన్లు కూడా ఆన్‌లైన్‌లోనే చేసుకునే ఆప్షన్ ఇచ్చారు. చిట్‌ఫండ్ కంపెనీల పర్యవేక్షణ, నోటరీల సమాచారాన్ని కూడా ఆన్‌లైన్‌లో పూర్తిగా తెలిసేలా చేశారు. అలాగే రిజిస్ట్రేషన్ సేవలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు, అభిప్రాయాలు తెలిపేందుకు ప్రత్యేకంగా గ్రీవెన్స్ రిడ్రెసల్ విధానాన్ని కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ వినియోగదారులు సులభంగా వినియోగించుకునేలా ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌ను మార్చనున్నారు.

గన్నవరంలో విమానాల అత్యవసర ల్యాండింగ్



గన్నవరం: ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సోమవారం హైదరాబాద్‌లో దిగాల్సిన మూడు విమానాలు గన్నవరం విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ అయ్యాయి. వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయాన్ని ఉదయం దట్టమైన పొగమంచు కప్పేసింది. దీంతో విమానాల ల్యాండింగ్‌కు అనుకూలమైన పరిస్థితులు లేకపోవడంతో అవి గాల్లోనే చక్కర్లు కొట్టాయి. చివరకు హైదరాబాద్‌లో దిగాల్సిన చండీఘర్, గోవా, తిరువనంతపురం నుంచి వచ్చిన ఇండిగో ఎయిర్‌బస్ ఎ320 విమానాలను గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు దారి మళ్లించారు. దీంతో మూడు విమానాలు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్య అత్యవసరంగా ల్యాండ్ అయ్యాయి. ఈ విమానాల్లో సుమారు 490 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. ఉదయం 10 గంటల తర్వాత శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మంచు ప్రభావం తగ్గడంతో తిరిగి హైదరాబాద్ వెళ్లాయి.

మురిసిన మిరియం

ఏజెన్సీలో 50 వేలకు పైగా ఎకరాల్లో మిరియం సాగు



సాక్షి, అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతం మిరియాల తోటలతో మురుస్తోంది. దిగుబడి, ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో సంక్రాంతి తర్వాత మిరియం కోతకు గిరిజన రైతులు సన్నద్ధమవుతున్నారు. ఏజెన్సీలోని 11 మండలాల్లో 2,46,139 గిరిజన రైతులు 2,58,021 ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్నారు. కాఫీ తోటలకు నీడనిచ్చేలా పెంచే సిల్వర్ ఓక్, యూకలిప్టస్ చెట్లపై మిరియం పాదులను ఎక్కించి ఫలసాయం పొందుతున్నారు. పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు, అనంతగిరి, అరకు వ్యాలీ, డుంబ్రిగూడ, హుకుంపేట, పెద్దబయలు, ముంచింగిపుట్టు మండలాల్లో కాఫీ తోటల్లో దాదాపు 50 వేలకుపైగా ఎకరాల్లో మిరియాల సాగు చేపట్టారు. ప్రభుత్వ సహకారంతో ఈ రెండు పంటల్ని సాగుచేస్తూ గిరిజన రైతులు మంచి ఆదాయం ఆర్జిస్తున్నారు. పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గిరిజన రైతులకు మిరియాల మొక్కలను అందించి సాగులో ఎప్పటికప్పుడు మెలకువలు అందిస్తోంది. మిరియాల పంట కోత కోసం 9,065 నిచ్చెనలు సైతం రైతులకు అందించింది.

ఆశాజనకంగా ధర

గిరిజనులు పండించే మిరియాలకు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో మిరియం దిగుబడులు పెరగనున్నాయని, మంచి ధర దక్కనుందని అధికారులు చెబుతున్నారు. సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే గిరిజనులు మిరియాల సేకరణ చేపడతారు. ఎకరానికి దాదాపు 450 కిలోల వరకు మిరియం గింజల దిగుబడి వస్తుందని అంచనా. వాటిని ప్రాసెసింగ్ చేసిన అనంతరం దాదాపు 100 నుంచి 120 కిలోల వరకు మిరియాలు వస్తాయి. వాటిని జనవరి నెలాఖరు నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు జోరుగా విక్రయిస్తారు. ప్రధాన మార్కెట్లు, సంతల్లో గిరిజన రైతులు మిరియాలను కిలో రూ.420 నుంచి 450 వరకు విక్రయిస్తారు. మన రాష్ట్రంతోపాటు పలు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు సైతం గిరిజనుల నుంచి మిరియాలు కొనుగోలు చేస్తుంటారు. ఈసారి మరింత డిమాండ్ పెరగడంతో కిలో రూ.500 వరకు ధర దక్కుతుందని భావిస్తున్నారు.

మిరియాలను కొనుగోలు చేయనున్న జీసీసీ

అటవీ ఉత్పత్తులకు మంచి ధర దక్కేలా ప్రభుత్వం శ్రద్ధ వహిస్తోంది. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న నేపథ్యంలో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా గిరిజనులు పండించే పంటలకు మద్దతు ధర దక్కేలా చేస్తున్నారు.

వాజ్‌పేయికి గవర్నర్ ఘన నివాళి



సాక్షి, అమరావతి: మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా సుపరిపాలన దినోత్సవాన్ని విజయవాడలోని రాజ్‌భవన్‌లో సోమవారం నిర్వహించారు.వాజ్‌పేయి చిత్రపటానికి గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానిగా ఆయన దేశ ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు.

జీర్ణదశకు చేరిన ఆలయాలకు మరమ్మతులు

ఉంగుటూరు: జీర్ణదశకు చేరుకున్న వందల ఏళ్ల నాటి దేవాలయాలను పునర్నిర్మించడంతో పాటు మరమ్మతులు చేయించి కొత్త రూపు తీసుకువస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులు రూ.1,400 కోట్లతో ఆలయాల రూపురేఖలు మారుస్తున్నామని చెప్పారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి రూ.225 కోట్లు, కాణిపాకం ఆలయానికి రూ.70 కోట్లు, శ్రీకాళహస్తీశ్వరాలయానికి రూ.70 కోట్లు, శ్రీశైలం ఆలయానికి రూ.200 కోట్లు, అన్నవరం ఆలయానికి రూ.50 కోట్లు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సింహాచలం ఆలయంలో రూ.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.500 కోట్ల సీజీఎఫ్ నిధులను కూడా ఆలయ అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నట్లు వివరించారు. ఆలయాల్లో అర్చకత్వం నిర్వహణకు నెలకు రూ.5 వేల చొప్పున ఇస్తున్నామన్నారు. ఆలయాల అభివృద్ధి తర్వాత అర్చక స్వాములను నియమిస్తామని తెలిపారు. బ్రాహ్మణులతో పాటు అర్చకత్వంపై ఆసక్తి ఉన్న పల్లెకారులు, ఎస్సీలు, బీసీలకు అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. టీడీపీ పాలనలో విజయవాడలో చంద్రబాబు 32 ఆలయాలను కూలిస్తే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని పునర్నిర్మించారన్నారు.

తెలంగాణ

గుండెపోటుతో తొమ్మిదో తరగతి విద్యార్థి మృతి

కోనరావుపేట (వేములవాడ): కుటుంబ సభ్యులందరూ క్రిస్మస్ వేడుకల్లో మునిగితేలారు. అప్పటి వరకు తమతో ఆడుతూ.. పాడుతూ క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్న వారి కొడుకు గుండెపోటుతో మృతిచెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన తాళ్లపెల్లి శంకర్–సరిత దంపతులకు యశ్వంత్, సుశాంత్ కుమారులు. యశ్వంత్ కోనరావుపేట కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. రెండో కొడుకు సుశాంత్ (13) నిజామాబాద్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనేందుకు సుశాంత్ కొత్త డ్రెస్ వేసుకొని కుటుంబ సభ్యులతో కలిసి చర్చికి వెళ్లాడు. అక్కడే గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే సిరిసిల్లలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుని అరెస్టు

మాదకద్రవ్యాలు వినియోగించిన పలువురికి నోటీసులు

సనత్‌నగర్ (హైదరాబాద్): సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసులో ఎస్ఆర్‌నగర్ పోలీసులు ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు. ఈ సంఘటనలో గోవా నుంచి మాదకద్రవ్యాలు తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్న ఐదుగురిలో అశిక్ యాదవ్ (26), రాజేష్ (27)లను ఇప్పటికే అరెస్టు చేయడం తెలిసిందే. వారి ద్వారా గోవా నుంచి మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న ప్రధాన నిందితుడు హనుమంతు బాబుసో దివాకర్ అలియాస్ బాబ (50)ను సోమవారం అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులు సాయిచరణ్, ఎడ్విన్‌ల కోసం గాలిస్తున్నారు. కాగా మాదక ద్రవ్యాలు వినియోగించిన 33 మందిని పోలీసులు గుర్తించారు. వీరిలో 12 మందిని అదుపులోకి తీసుకుని వారికి నోటీసులు జారీ చేశారు. మిగిలిన వినియోగదారుల్లో కూడా తాజాగా పలువురిని అదుపులోకి తీసుకుని.. వారికి కూడా నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

కోదండరాంకు కీలక పదవి!

సాక్షి, హైదరాబాద్: రాజకీయ జేఏసీ చైర్మన్ హోదాలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రొఫెసర్ కోదండరాం సేవలను కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా వినియోగించుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జనసమితి (టీజేఎస్) అధ్యక్షుడి హోదాలో ఆయన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో సోమవారం సచివాలయంలో భేటీ కావడంతో ఈ చర్చ ఊపందుకుంది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం ఆయనకు రాష్ట్ర స్థాయిలో కీలక పదవి ఇస్తారని, లేదంటే ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా కూడా నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. రాష్ట్ర అభివృద్ధి మండలిని ఏర్పాటు చేసి దానికి వైస్‌చైర్మన్‌గా కోదండరాంను నియమించవచ్చని ఊహాగానాలు వస్తున్నాయి.

బేషరతుగా మద్దతు...

వాస్తవానికి తెలంగాణ జనసమితి (టీజేఎస్) ఏర్పాటు తర్వాత రెండుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ కోదండరాం కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడ్డారు. 2018 ఎన్నికల్లో పార్టీ తరపున కొన్ని స్థానాల్లో పోటీ చేసినప్పటికీ 2023లో ఒక్క అసెంబ్లీ స్థానం కోసం కూడా డిమాండ్ చేయకుండా బేషరతుగా కాంగ్రెస్‌కు మద్దతిచ్చారు. ఆ సమయంలోనే కోదండరాంకు కాంగ్రెస్ ప్రభుత్వంలో తగిన హోదా కల్పిస్తామని, ముఖ్యంగా తెలంగాణ అమరవీరుల సంక్షేమాన్ని అమలు చేసే బాధ్యత ఆయనకు అప్పగిస్తామని కాంగ్రెస్ వర్గాలు హామీ ఇచ్చాయి. ఈ నేపథ్యంలో కోదండరాం బృందం ఉపముఖ్యమంత్రి భట్టితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మర్యాదపూర్వకమేనని చెబుతున్నా...

టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నర్సయ్య సోమవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సచివాలయంలో కలిశారు.

ప్రభుత్వ చదువులకు సలాం

ఫలించిన సర్కారు చదువుల యజ్ఞం.. సత్ఫలితాలనిస్తున్న విద్యా పథకాలు

- జగనన్న అమ్మఒడి, విద్యా కానుక, గోరుముద్ద, ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ బోధన
- 93 శాతం మంది ఇంగ్లిష్ మీడియంలోనే పరీక్షలకు హాజరు
- విద్యా సంస్కరణలకు నాలుగున్నరేళ్లలో ఏకంగా రూ.71,017 కోట్ల ఖర్చు
- చదువులో ప్రతిభ చాటినవారికి 'జగనన్న ఆణిముత్యాలు'గా ఎంపిక చేసి సత్కారం
- అత్యంత ప్రతిభావంతులకు అమెరికాలో పర్యటించే అవకాశం



> ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ద్విభాషా పాఠ్యపుస్తకాలను అందించడం గొప్ప పరిణామం.
>
> – ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర విద్యాశాఖ మంత్రి

> ప్రాథమిక స్థాయి నుంచి నాణ్యమైన విద్యను అందించడంలో ఆంధ్రప్రదేశ్ పనితీరు అద్భుతంగా ఉంది.
>
> – సంజయ్ కుమార్, కేంద్ర పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ కార్యదర్శి

> ఏపీ ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు వారి మాతృ భాషల్లో (సవర, కొండ, కువి, ఆదివాసీ ఒడియా, కోయ, సుగాలి) ద్విభాషా పాఠ్యపుస్తకాలు అందజేయడం గొప్ప పరిణామం. మనబడి నాడు–నేడు పథకాన్ని మా రాష్ట్రంలోనూ అమలు చేస్తాం.
>
> – నవీన్ జైన్, విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి, రాజస్థాన్

..ఇలా ఒకరు కాదు, ఇద్దరు కాదు.. ప్రతి ఒక్కరూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలను కొనియాడుతున్నారు. విద్యా రంగంలో ఏపీనే తమకు ఆదర్శమని ఎలుగెత్తి చాటుతున్నారు. ఏపీ విద్యా సంక్షేమ పథకాలను తమ రాష్ట్రంలోనూ అమలు చేస్తామని ఘంటాపథంగా చెబుతున్నారు. ఇప్పటికే మహారాష్ట్ర, ఒడిశా, అసోం, హరియాణా, ఛత్తీస్‌గఢ్, మిజోరాం, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, నాగాలాండ్, గుజరాత్, పుదుచ్చేరి, కేరళ, తెలంగాణ, అండమాన్ –నికోబార్, డామన్ డయ్యూ, దాద్రానగర్ హవేలీ విద్యాశాఖాధికారులు మన విద్యా విధానాలను వారి రాష్ట్రాల్లోనూ, కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ అమలు చేసేందుకు ముందుకు వచ్చారు. అలాగే అమెరికాలోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై జరిగిన ఉన్నత స్థాయి సదస్సులో 140 దేశాల విద్యావేత్తలు మన ప్రభుత్వ విద్యా సంస్కరణలను కొనియాడారు. జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబులు, బైజూస్ కంటెంట్, తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీల ఏర్పాటు, సీబీఎస్ఈ విద్యా విధానం, ఇంగ్లిష్ మీడియం బోధన, బాలికలకు స్వేచ్ఛ శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీని తెలుసుకుని అభినందించారు. ఈ పథకాలతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే కాదు.. వాటిని కళ్లారా చూస్తున్న తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ చదువులకు సలాం కొడుతున్నారు. పేదరికంతో ఏ ఒక్కరి చదువు ఆగిపోరాదని సంకల్పించిన సీఎం వైఎస్ జగన్ ఈ నాలుగున్నరేళ్లల్లో విద్యా సంస్కరణలకు ఏకంగా రూ.71,017 కోట్లు ఖర్చు చేశారు. ఫలితంగా 45 వేల ప్రభుత్వ పాఠశాలలు సమూలంగా తమ రూపురేఖలు మార్చుకున్నాయి. వాటిలో సకల వసతులు వచ్చి చేరాయి. దీంతో 43 లక్షల మంది పేదింటి విద్యార్థుల జీవితాల్లో సరికొత్త వెలుగులు ప్రసరిస్తున్నాయి.

– సాక్షి, అమరావతి

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడి

ప్రభుత్వం మనబడి నాడు–నేడు కింద ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో అనేక రకాల సౌకర్యాలు కల్పించింది. నాడు–నేడు కింద మొదటి దశలో రూ.3,669 కోట్లతో 15,715 పాఠశాలలను అభివృద్ధి చేయగా, రెండో దశలో రూ.8 వేల కోట్లతో 22,344 పాఠశాలలను అభివృద్ధి చేస్తోంది. పనులు పూర్తయిన వాటిల్లో హైస్కూళ్లకు 62 వేల ఐఎఫ్‌పీలు, ఎలిమెంటరీ స్కూళ్లకు 45 వేల స్మార్ట్ టీవీలు అందించి డిజిటల్ బోధనను ప్రవేశపెట్టింది. రెండు విడతల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో 9,52,925 ట్యాబ్‌లను అందించింది. పేదింటి పిల్లలు ప్రపంచ స్థాయిలో పోటీ పడేందుకు వీలుగా 2020–21 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులకు ద్విభాషా పాఠ్య పుస్తకాలను అందించింది. దీంతో ఈ విద్యా సంవత్సరంలో జరిగిన రెండు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ), సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ) పరీక్షల్లో 93% మంది విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలోనే పరీక్షలు రాశారు. ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 43 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా వీరిలో 39 లక్షల మందికి పైగా ఇంగ్లిష్ మీడియంలోనే పరీక్షలు రాస్తుండడం విశేషం. మరోవైపు బడికి దూరమవుతున్న పిల్లలను తిరిగి చేర్పించేందుకు, వారి చదువులు తల్లిదండ్రులకు భారం కాకూడదని 44,48,865 మంది తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేల చొప్పున ప్రభుత్వం జగనన్న అమ్మఒడి కింద నగదు జమ చేస్తోంది. దీంతో గతేడాది కంటే ఈ ఏడాది ఒకటి నుంచి ఇంటర్ వరకు 1,50,005 మంది విద్యార్థులు అధికంగా చేరారు. అలాగే గత విద్యా సంవత్సరంలో పది, ఇంటర్ బోర్డు పరీక్షల్లో ప్రతిభ చాటినవారిని 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట ప్రభుత్వం సత్కరించింది. అంతేకాకుండా రాష్ట్ర స్థాయిలో ప్రతిభావంతులను ఎంపిక చేసి ప్రభుత్వం అమెరికా పర్యటనకు పంపించింది.

గతంలో ఇన్ని సదుపాయాలు లేవు..



ప్రభుత్వ బడుల్లో ఇన్ని సదుపాయాలు, విద్యా సంస్కరణలు గతంలో ఎప్పుడూ లేవు. ఇప్పుడు ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్‌ను సైతం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. మా పెద్దమ్మాయి అరుణ కేజీబీవీలో పదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో చదువుతోంది. చిన్నమ్మాయి చైత్ర ప్రణవి ప్రభుత్వ బడిలోనే తొమ్మిదో తరగతి సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యనభ్యసిస్తోంది. ఇంత ఉత్తమ చదువులు నాలాంటి సామాన్యులకు అందుకోవడం గతంలో సాధ్యమయ్యేది కాదు. కానీ పేద, మధ్య తరగతి పిల్లల చదువుల భారం పూర్తిగా ప్రభుత్వమే చూసుకుంటోంది. ఇప్పుడు ప్రైవేటు కంటే ప్రభుత్వ స్కూళ్లే అద్భుతంగా ఉన్నాయి.

– రుత్తల పాపయ్య, అల్లిపూడి, కాకినాడ జిల్లా

ఇలాంటి గొప్ప చదువులు మాకు వరం



అటవీ ప్రాంతమైన మా సీలేరు గ్రామం ఇంగ్లిష్ చదువులకు చాలా దూరం. జగన్ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం వచ్చింది. ఇప్పుడు సీలేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఇంగ్లిష్ మీడియంలోనే చదువు చెబుతున్నారు. వచ్చే ఏడాది పదో తరగతి కూడా ఇంగ్లిష్‌లోనే ఉంటుందన్నారు. నా కూతురు జ్యోత్స్న స్థానిక జెడ్పీ స్కూల్లో 9వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో చదువుతోంది. ఇప్పుడు ఇంగ్లిష్ బాగా మాట్లాడుతోంది. ఇది మాకెంతో గర్వంగా ఉంది. ఇలాంటి గొప్ప చదువులు మాలాంటి వారికి వరం.

– పెయ్యల సింహాద్రి, సీలేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా

పౌష్టికాహారం.. గోరుముద్ద

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే గొప్ప ఆలోచనతో 2020, జనవరి 1న రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న గోరుముద్ద' పథకానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో రోజూ సాంబారు, అన్నం మాత్రమే పెట్టేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పుడు వారానికి 16 రకాల ఐటెమ్స్ తోపాటు ఫోర్టిఫైడ్ సార్టెక్స్ బియ్యంతో భోజనం పెడుతోంది. సోమవారం నుంచి శనివారం వరకు రోజుకో మెనూతో విద్యార్థులకు వేడిగా రుచి, శుచితో పోషకాహారాన్ని అందిస్తోంది. అలాగే వారిలో రక్తహీనతను అరికట్టడానికి వారంలో 3 రోజులు బెల్లంతో చేసిన రాగి జావ, మూడు రోజులు చిక్కీ, వారంలో ఐదు రోజులు ఉడికించిన గుడ్డును తప్పనిసరి చేసింది. ఎలా వండితే నచ్చుతుందో విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకుని ఆ మేరకు వంటలో మార్పులు సైతం చేశారు. పర్యవేక్షణ కోసం 'ఇంటిగ్రేటెడ్ మానిటరింగ్ సిస్టం ఫర్ మిడ్ డే మీల్స్ అండ్ శానిటేషన్ (ఐఎంఎంఎస్)' యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. జగనన్న గోరుముద్ద కోసం ఏటా సగటున రూ.1,400 కోట్లు చొప్పున ఐదేళ్లలో మొత్తం రూ.6,995.34 బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించింది. గత టీడీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కోసం ఏటా చేసిన రూ.450 కోట్లు ఖర్చు కంటే ఇది నాలుగు రెట్లు అధికం. ప్రభుత్వ బడులకు ప్రతి గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల, విలేజ్ క్లినిక్ నుంచి సిబ్బంది వచ్చి విద్యార్థులకు వైద్య పరీక్షలు కూడా చేస్తున్నారు. రక్తహీనతను అరికట్టేందుకు మాత్రలూ ఇస్తున్నారు.



శ్రీరామ అలంకారంలో యాదాద్రీశుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజైన సోమవారం శ్రీస్వామి వారు ఉదయం శ్రీరామ అలంకారంలో, రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి అలంకార సేవలో ఆలయ తిరు, మాడవీధుల్లో ఊరేగారు.



మనందరి వైపు చూసి మృత్యువు నవ్వుతుంది: మనం చేయగలిగినదల్లా తిరిగి నవ్వడమే!
– మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 26 డిసెంబర్ 2023

పరువు కోసం కుస్తీ!

ఏదైనా ఒక తప్పు జరిగినప్పుడు... తక్షణమే సరిదిద్దకపోతే, ఆపైన అన్నీ తప్పులే జరుగుతాయట. ప్రాచుర్యంలో ఉన్న లోకోక్తి అది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) కథ సరిగ్గా అలానే ఉంది. సమాఖ్యలోని అవకతవకలు, మహిళా మల్లయోధులపై సమాఖ్య అధ్యక్షుడు, కోచ్‌ల లైంగిక వేధింపుల గురించి ఏడాది పైగా వివాదాలు రేగుతూనే ఉన్నాయి. అయినా, కంటితుడుపులకే తప్ప, కఠిన చర్యలకు దిగని కేంద్ర పాలకులు తాజాగా సమాఖ్యపై సస్పెన్షన్ వేటువేయక తప్పలేదు. వివాదాస్పద బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ సారథ్యంలో సమాఖ్య గబ్బుపడితే, తాజాగా ఆయన సహచరుడు సంజయ్ సింగ్ సారథ్యంలో ఏర్పడ్డ కొత్త కార్యవర్గం సైతం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, ఎన్నికైన మూణ్ణాళ్ళకే సస్పెన్షన్ వేటుకు గురైన దుఃస్థితి. ఆదివారం నాటి ఈ సస్పెన్షన్‌తో మన రెజ్లింగ్ వ్యవహారం మరో మలుపు తిరిగింది. దేశానికి పేరు తెచ్చిపెట్టిన క్రీడాకారులెందరో ఉన్నప్పటికీ, మన కుస్తీ గోదా కథ ఆశించినంత గొప్పగా లేదని మరోమారు తేలిపోయింది.

ఒలింపిక్ పతకాలు సాధించిన మన మల్లయోధులు సాక్షీ మాలిక్, బజరంగ్ పూనియా, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతక విజేత వినేశ్ ఫోగట్‌లు సమాఖ్యలో అవతవకలపై గళం విప్పి మరి కొద్ది రోజుల్లో ఏడాది కావస్తోంది. ఈ పన్నెండు నెలల కాలంలో ర్యాలీలు, దేశ రాజధాని నడిబొడ్డున ఆటగాళ్ళ ధర్నాలు, వేధింపుల ఆరోపణలతో బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ పోలీసుల కేసులు, దర్యాప్తులు... ఇలా అనేక నాటకీయ ఘటనలు చూశాం. బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ తప్పనిసరై తన పదవికి దూరం జరిగాడు. అయితే, పేరుకు పదవిలో లేకపోయినా, వెనుక నుంచి చక్రం తిప్పుతున్నది అతగాడేనని సమాఖ్య కొత్త కార్యవర్గం తాజా ఎన్నికల్లోనూ తేలిపోయింది. బ్రిజ్‌భూషణ్‌కు దీర్ఘకాలంగా నమ్మిన బంటైన సంజయ్‌సింగ్ గత గురువారం డిసెంబర్ 21న జరిగిన ఎన్నికల్లో సమాఖ్య కొత్త అధ్యక్షుడయ్యారు. ఎన్నికలు జరిగిన 15 పదవుల్లో 13ను ఆ జట్టే గెలిచింది. పైగా, లైంగిక వేధింపులపై ఇంత రచ్చ జరుగుతున్నా ఎన్నికైనవారిలో కనీసం ఒక్క మహిళైనా లేకపోవడం మరీ విడ్డూరం.

అయినా వ్యవస్థ మారకుండా పేరుకు వ్యక్తులు మారితే ప్రయోజనం ఏముంటుంది! పాత తానులోని ముక్కే అయిన కొత్త అధ్యక్షుడు వస్తూనే సమాఖ్య నిబంధనలకు విరుద్ధంగా ఈ నెల 28 నుంచి యూపీలో అండర్–15, అండర్–20 వారికి జాతీయ ఛాంపియన్‌షిప్స్ జరుగుతాయని ప్రకటించారు. సమాఖ్య సెక్రటరీ జనరల్‌ను సంప్రతించడం లాంటి నియమాలేవీ పాటించనేలేదు. పైగా, లైంగిక వేధింపులు జరిగినట్టు ఆరోపణలున్న ప్రాంగణంలోనే, అదే పాత కాపుల కనుసన్నల్లోనే కొత్త కమిటీ సాగుతుండడం దిగ్భ్రాంతికరం. ఈ రాజ్యాంగ విరుద్ధ చర్య వివాదానికీ, ఫిర్యాదులకూ దారి తీసింది. మరోపక్క ఎన్ని పోరాటాలు చేసినా, ప్రభుత్వానికి మరెన్ని వినతులు ఇచ్చినా పాత కథే పునరావృతం కావడం ఆటగాళ్ళే కాదు, ఎవరూ జీర్ణించుకోలేని విషయం. రెజ్లర్ సాక్షీ మాలిక్ కుస్తీకి పూర్తిగా స్వస్తి చెబుతున్నట్టు కన్నీటి పర్యంతమవుతూ ప్రకటించారు. మరో రెజ్లర్ బజరంగ్ పునియా తన పద్మశ్రీ పతకాన్ని ప్రభుత్వానికి వెనక్కి ఇచ్చేస్తున్నట్టు శుక్రవారం స్పష్టం చేశారు. ఈ పరిణామాలతో సర్కార్ ఒత్తిడిలో పడింది. హడావిడిగా కొత్త కమిటీపై సస్పెన్షన్ వేటు వేసింది. సమాఖ్య నిర్వహణకు తాత్కాలిక ప్యానెల్‌ను నియమించాల్సిందిగా భారత ఒలింపిక్ సంఘాన్ని (ఐఓఏ) కోరింది.

రెజ్లింగ్ సమాఖ్యను సరిదిద్దేందుకు ఎప్పుడో చర్యలు చేపట్టాల్సిన సర్కార్ ఇప్పటికి గాఢనిద్ర నుంచి మేలుకుంటున్నట్టు కనిపిస్తోంది. ఈ మాత్రమైనా కదలిక రావడం మంచిదే. కానీ, ఇది సరిపోతుందా అన్నది ప్రశ్న. దేశానికి పతకాలు పండిస్తున్న క్రీడాంశంలో, అందులోనూ అంతర్జాతీయంగా మన ప్రతిష్ఠను పెంచిన ఆటగాళ్ళ నిఖార్సయిన ఆందోళనలపై మన పాలకులు ఇన్నాళ్ళు కాలయాపన చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? స్వపక్ష పార్లమెంట్ సభ్యుడే సమాఖ్య అధ్యక్షుడు కావడం, సార్వత్రిక ఎన్నికల బరిలో ఓట్లు – సీట్ల సంఖ్యను ప్రభావితం చేసే శక్తిమంతుడు కావడంతో బీజేపీ పెద్దలు ఇంతకాలం విషయం సాగదీశారనేది సుస్పష్టం. వినేశ్ ఫోగట్ అన్నట్టు... రెజ్లింగ్ సమాఖ్యలో పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇక దేశంలో కుస్తీ క్రీడ ఆడపిల్లకు భద్రత లేని అంశంగా మిగిలిపోతుంది. కానీ, 'బేటీ బచావో... బేటీ పఢావో' అంటూ బీరాలు పలికే పాలకులకు ఇది పెద్దగా పట్టినట్టు లేదు.

మన సొంతింటి రెజ్లింగ్ వ్యవహారం ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో దేశానికి అప్రతిష్ఠగా పరిణమించింది. నిజానికి, క్రీడా సంస్థలపై వివాదాలు కొత్త కావు. క్రీడాకారిణులపై లైంగిక వేధింపులు, ఆటగాళ్ళ ఎంపికలో అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు తరచూ వినబడుతూనే ఉన్నాయి. ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమన చర్యలతోనే సరిపుచ్చుతున్నాయి తప్ప, సమూల ప్రక్షాళనకు సమకట్టడం లేదు. రాజకీయాలకు అతీతంగా సాగాల్సిన క్రీడాసంస్థల్ని అధికార పార్టీల జేబు సంస్థలుగా, వారసత్వపు గడీలుగా నడుపుతున్నారు. పెద్ద స్థానాల్లో ఉన్న ఒకప్పటి స్టార్ ఆటగాళ్ళు సైతం తటస్థంగా, నిష్పక్షపాతంగా ఉండాల్సింది పోయి, తమకా పదవులిచ్చిన పార్టీల ప్రయోజనాలకు దూడూ బసవన్నలవుతున్నారు. ప్రజల్లో నమ్మకం పోగొట్టుకున్న, లోపభూయిష్ఠమైన మన క్రీడా నిర్వహణలో తక్షణ సంస్కరణలు అవసరం. లేదంటే, తీరని నష్టం. పాలకులు స్వపక్షాభిమానం వదిలి, కఠిన కార్యాచరణకు పూనుకోనట్లయితే... మన క్రీడావీరుల కష్టానికీ, కన్నీళ్ళకూ విలువేముంది! రాజకీయం ఆట కావచ్చేమో కానీ, ఆటలు రాజకీయం కాకూడదు!!

భూసమస్యలన్నీ పరిష్కారమయ్యేలా...

అభిప్రాయం



అజేయ కల్లం

దాదాపు వందేళ్ళ క్రితం బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ సర్వేలో భూమిని అనుభవిస్తున్న వారి వివరాలతో వాటి వాస్తవ స్థితిని నిర్ధారించారు. అయితే రెవెన్యూ రికార్డులను సరిగ్గా అప్‌డేట్ చేయకపోవడం, వివిధ చట్టాల్లో తీసుకువచ్చిన మార్పుల కారణంగా క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు, వ్యత్యాసాలు భూమి రికార్డుల్లో నమోదు కాలేదు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'రికార్డ్ ఆఫ్ రైట్స్' చట్టాన్ని (భూ యాజమాన్య హక్కు చట్టం) తెచ్చింది. భూ యాజమాన్య హక్కులకు సంబంధించి ఎదురవుతున్న అనేక సమస్యలను పరిష్కరించడానికి డ్రోన్లు, విమానాల ద్వారా భూముల రీ సర్వే చేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి భూకమతంలో పట్టాదారు వాస్తవ స్థితిని ధ్రువీకరించేలా సర్వే జరుగుతోంది.

భారతీయుల్లో భూమికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. సమాజంలోని అన్ని వర్గాల సంస్కృతులు భూ యాజమాన్యానికి అనుకూలంగా ఉండడం వల్ల అందరూ దాన్ని కోరుకుంటారు. దేశంలోని గ్రామీణ కుటుంబాల మొత్తం ఆస్తిలో భూమి 73 శాతం ఉండగా, పట్టణ గృహాల ఆస్తిలో భూమి, భవనాలు 90 శాతం ఉన్నట్లు 2013 ఎన్ఎస్ఎస్ఓ నివేదికలో తేలింది. అందుకే పెట్టుబడిదారులు, రుణదాతలు, బ్యాంకర్లు స్పష్టమైన టైటిల్, స్పష్టమైన ల్యాండ్ మ్యాపింగ్, రికార్డుల నిర్వహణ, స్పష్టమైన హక్కులు ఉండాలని కోరుకుంటారు. కానీ మెకెన్సీ సంస్థ నిర్వహించిన ఒక అధ్యయనంలో దేశంలోని ఎక్కువ భూముల యాజమాన్యానికి సంబంధించి చట్టపరమైన వివాదాలున్నాయని తేలింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ తరహా భూముల వివాదాలు 5 శాతం కంటే తక్కువగా ఉన్నాయి. కానీ మన దేశంలో దాదాపు 70 శాతం సివిల్ వివాదాలున్నాయి.

ప్రస్తుత రెవెన్యూ రికార్డులు ప్రాథమికంగా బ్రిటిష్ ప్రభుత్వం 100 ఏళ్ల క్రితం నిర్వహించిన సర్వే ఆధారంగా రూపుదిద్దుకున్నాయి. అవన్నీ ప్రభుత్వానికి భూముల ద్వారా ఎక్కువ ఆదాయాన్ని సేకరించే లక్ష్యంతో రూపొందించినవి. స్వాతంత్ర్యం వచ్చాక కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు భూమిని సాగు చేసేవారికి సురక్షితమైన హక్కులు ఉండేలా ప్రోత్సహించడానికి అనేక భూ సంస్కరణలు ప్రవేశపెట్టాయి. 'ఎస్టేట్‌లు – ఇనామ్ నిర్మూలన చట్టం', 'వ్యవసాయ భూముల సీలింగ్ చట్టం', 'పీఓటీ' చట్టం, 'ఆర్ఓఎఫ్ఆర్' వంటి చట్టాలను వరుసగా వచ్చిన ప్రభుత్వాలు సాగుదారులకు అనుకూలంగా తీసుకువచ్చాయి. భూముల యాజమాన్యంలో జరిగిన ఈ మార్పులన్నీ రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కినా... కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల క్రమం తప్పకుండా నవీకరణ (అప్‌డేట్) అవలేదు.

దాదాపు 100 సంవత్సరాల క్రితం జరిగిన సర్వేలో భూమిని అనుభవిస్తున్న వారి వివరాలతో వాటి వాస్తవ స్థితిని నిర్ధారించినా... రెవెన్యూ రికార్డులను సరిగ్గా అప్‌డేట్ చేయకపోవడం, వివిధ చట్టాల్లో తీసుకువచ్చిన మార్పుల కారణంగా క్షేత్ర స్థాయిలో నెలకొన్న పరిస్థితులు, వ్యత్యాసాలు భూమి రికార్డుల్లో నమోదు కాలేదు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఏపీ ప్రభుత్వం 'రికార్డ్ ఆఫ్ రైట్స్' చట్టాన్ని ప్రవేశపెట్టింది. అలాగే ఆ చట్టాన్ని సవరించడం ద్వారా గ్రామాల వారీగా ప్రతి వ్యక్తి అధీనంలో ఉన్న భూమి వివరాలను రికార్డుల్లో అప్‌డేట్ చేసింది. ఇలా హక్కుల రికార్డును ప్రవేశపెట్టిన తర్వాత కూడా భూ వివాదాలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి.

ప్రస్తుత రెవెన్యూ రికార్డులు ఊహాజనిత హక్కును మాత్రమే కల్పిస్తాయి. కొన్ని కేసుల్లో రికార్డులు క్షేత్ర స్థాయి పరిస్థితికి విభిన్నంగా ఉంటాయి. కోర్టు కేసులు, వారసత్వాలు, తనఖా వంటి భూమికి సంబంధించిన వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించే ఎలాంటి ఒకే ఒక్క మూలాధారం ప్రస్తుత రికార్డుల్లో లేదు. దీనివల్ల భూ యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ సమస్యలన్నింటినీ ఒకేసారి పరిష్కరించేందుకు ఏపీ ప్రభుత్వం రాష్ట్రం మొత్తాన్ని డ్రోన్లు, విమానాల ద్వారా భూముల రీ సర్వే చేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి భూ కమతంలో పట్టాదారు వాస్తవ స్థితిని ధ్రువీకరించేలా సర్వే జరుగుతోంది. భూ యాజమాన్యంపై ఉన్న గందరగోళాన్ని తొలగించేలా రీ సర్వేలో ప్రతి భూభాగానికి జియో రిఫరెన్స్ ఇస్తున్నారు. భూమి, దానికి సంబంధించిన రికార్డులను అనేక శాఖలు (రెవెన్యూ, పంచాయితీ రాజ్, పట్టణ స్థానిక సంస్థలు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, రిజిస్ట్రేషన్ శాఖలు) నిర్వహిస్తుండడం వల్ల తీవ్ర జాప్యం జరుగుతోంది. అలాగే పౌరులు వాటికి సంబంధించిన అనుమతులు, సేవలు పొందేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆ పరిస్థితి ఎందుకంటే?

భూమి యాజమాన్యం సార్వభౌమాధికారంతో ఉంటుందని దేశంలో చాలా తక్కువ మందికి మాత్రమే తెలిసిన విషయం. అనేక అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగా నిశ్చయాత్మకమైన టైటిల్ విధానానికి (కన్‌క్లూజివ్ టైటిల్ విధానం) మన దేశం వెళ్లలేదు. ఇప్పుడు ఉన్న ల్యాండ్ టైటిల్ విధానం... యాజమాన్యాన్ని ధ్రువీకరించే నిశ్చయాత్మక టైటిల్‌కు విరుద్ధంగా 'అనుకూల టైటిల్ కాన్సెప్ట్' (ప్రిజెమ్టివ్ టైటిల్) ఆధారంగా రూపొందించబడింది. అంటే భూమి అధీనంలో ఉన్న వ్యక్తి సదరు భూమికి సంబంధించి రెవెన్యూ శాఖకు పన్ను చెల్లిస్తున్న వ్యక్తిగా భావించబడే అర్థంలో ఇచ్చిన టైటిల్ మాత్రమే. అది కూడా '1872 ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్' ప్రకారం చట్టపరమైన స్వాధీనమే. భూమిపై లావాదేవీ జరిగినప్పుడు కూడా టైటిల్ వెరిఫికేషన్ అవసరం లేని వ్యవస్థ కారణంగా భూమి టైటిల్ విధానం పేలవంగా ఉంది. '1908 ఇండియన్ రిజిస్ట్రేషన్ యాక్ట్' కూడా పత్రాల నమోదుకు సంబంధించిన చట్టమే తప్ప భూమి లేదా టైటిల్ రిజిస్ట్రేషన్‌కి సంబంధించినది కాదు. 1982 ఆస్తి బదిలీ చట్టానికి యాజమాన్యం యొక్క ధ్రువీకరణ అవసరం లేదు. భూమి లావాదేవీల విషయంలో ఆదాయాన్ని పెంచడానికి మాత్రమే ఈ చట్టాలు పరిమితమయ్యాయి. ఆ భూముల యాజమాన్యానికి సంబంధించి ఏదైనా ప్రశ్న తలెత్తితే, అది తనదేనని నిరూపించుకోవాల్సి బాధ్యత యజమానిపైనే ఉంటుంది.



తక్షణ సంస్కరణలు అవసరం

ఈ నేపథ్యంలో భూ సమస్యలన్నింటినీ అధిగమించేందుకు ఎలా ముందుకు వెళ్లాలో సూచించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక టాస్క్ ఫోర్స్‌ను నియమించింది. ఈ 'టైటిల్ సర్టిఫికేషన్ టాస్క్‌ఫోర్స్' ఒక సమగ్రమైన భూమి టైటిల్ వ్యవస్థను దేశంలో వీలైనంత త్వరగా తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తించింది. దాని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం 2011లో ఒక ముసాయిదా ల్యాండ్ టైట్లింగ్ బిల్లును తీసుకువచ్చింది. నిశ్చయాత్మకమైన ఆస్తి హక్కుల (కన్‌క్లూజివ్ ప్రాపర్టీ టైటిల్స్) వ్యవస్థను ఏర్పాటు చేయడం, పాలన, నిర్వహించడం దీని ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా అనుసరించే 'టోరెన్స్' వ్యవస్థ ఆధారంగా దీన్ని రూపొందించారు. టోరెన్స్ వ్యవస్థ 3 సూత్రాలతో ఉంటుంది.

1. మిర్రర్ సూత్రం. ఇది టైటిల్ రిజిస్ట్రేషన్‌ను సూచిస్తుంది. క్షేత్ర స్థాయి వాస్తవికత (గ్రౌండ్ రియాలిటీ)ను కచ్చితంగా ప్రతిబింబిస్తుంది.

2. కర్టెన్ సూత్రం. ఇది గతానికి అడ్డుగా ఒక తెర ఉన్నన్నట్లు సూచిస్తుంది. టైటిల్‌ను రిజిస్టర్‌లో టైటిల్ నమోదు కావడమే ప్రస్తుత టైటిల్ నిశ్చయాత్మక రుజువు అనీ, గతాన్ని పరిశోధించాల్సిన అవసరం లేదనీ చెబుతోంది.

3. హామీ సూత్రం. ఇది టైటిల్‌ను రిజిస్టర్ చేసే క్రమంలోనూ, భూ యజమానులకు జారీ చేసే ధ్రువీకరణ పత్రాలలోనూ దొర్లే తప్పులకు నష్టపరిహారానికి ప్రభుత్వ సంస్థల హామీని ఇస్తుంది. ఇది కోర్టుల్లో కూడా చెల్లుబాటయ్యే పూర్తి అజేయమైన యాజమాన్య ధ్రువీకరణ పత్రంగా ఉంటుంది.

ఈ నేపథ్యంలోనే ఏపీ శాసనసభ 2019లో 'ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టా'న్ని ఆమోదించి దాన్ని భారత రాష్ట్రపతి అంగీకారం కోసం పంపింది. దాన్ని అందుకున్న కేంద్రం భూమి వ్యవహారాలు పర్యవేక్షించే కేంద్ర ఎల్ఓఆర్, ఐటీ, న్యాయ తదితర శాఖల పరిశీలనకు పంపింది. ఆ యా శాఖలు కొంత సమయం తీసుకుని ఈ చట్టంపై అభిప్రాయాలు, వ్యాఖ్యలు పంపారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఏపీ ప్రభుత్వం అందుకనుగుణంగా టైట్లింగ్ బిల్లుకు పలు సవరణలు చేసి శాసనసభకు పంపింది. దీనిని 2023లో సభ ఆమోదించింది. ఆ బిల్లును మళ్లీ రాష్ట్రపతి ఆమోదం కోసం పంపగా ఇటీవలే దానికి ఆమోదం లభించింది. ఆ తర్వాత ఏపీ ప్రభుత్వం ఆ చట్టాన్ని నోటిఫై చేసి అమలు చేయడానికి కావల్సిన నియమాలు, మార్గదర్శకాలను రూపొందిస్తోంది.

కానీ చర్చించకుండా హడావిడిగా చట్టం తెచ్చారని కొందరు బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉంది. రెండు సార్లు పూర్తిగా చర్చించి సంతృప్తి చెందిన తర్వాతే అసెంబ్లీ ఈ బిల్లును ఆమోదించింది. మన దేశంలో చట్టాలు ఇదే విధానంలో రూపుదిద్దుకుంటాయి తప్ప వేరే విధానంలో కాదు. ప్రజాస్వామ్యంలో చట్ట సభలు ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. రాజ్యాంగ సవరణలు కూడా ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లవు. దీన్ని సమగ్రంగా పరిశీలించడానికి, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు పలు దఫాలుగా పంపిన వివరణలు చూసి ఆమోదించడానికి కేంద ప్రభుత్వానికి నాలుగేళ్లు పట్టింది.

భూముల వ్యవహారంలో రెవెన్యూ శాఖ సమర్థతను ప్రశ్నిస్తూ కొందరు వ్యక్తులు పత్రికలకు ఎక్కడం కూడా దురదృష్టకరం. బహుశా ఈ దేశంలో భూ యాజమాన్య వ్యవస్థల పరిణామం గురించి వారికి తెలియకపోవచ్చు. బ్రిటీష్‌వారు మొదటిసారిగా రైత్వారీ సెటిల్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు, రెవెన్యూ సిబ్బంది అయిన సెటిల్‌మెంట్ అధికారులే భూమిని అనుభవిస్తున్న ప్రజలకు హక్కులు ఇచ్చారు తప్ప వేరే వారు కాదు. ఆర్ఓఆర్, ఎస్టేట్‌ల రద్దు, ఇనాం రద్దు, ల్యాండ్ సీలింగ్ వంటి భూమికి సంబంధించిన ప్రతి చట్టంలోనూ హక్కుదారులకు సంబంధించిన అంశాలను పరిష్కరించే అధికారం రెవెన్యూ అధికారులకే ఉంది. భూ సమస్యలను పరిష్కరించడంలో, పట్టా హక్కులు లేదా యాజమాన్య హక్కులు ఇవ్వడంలో రెవెన్యూ సిబ్బందికి మించిన జ్ఞానం ఎవరికీ ఉండదు. రెవెన్యూ సిబ్బందికి భూ చట్టాలు/సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం లేదని చెప్పడం సరికాదు. అదే సందర్భంలో ఏ సీనియారిటీ ప్రకారం టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారులను నియమిస్తారనే విషయం రాష్ట్ర ప్రభుత్వానికే వదిలేయాలి. అన్ని వివరాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే ప్రభుత్వం టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారులను ఖరారు చేస్తుంది.

చట్టం ప్రకారం అప్పీలేట్ అధికారులుగా సర్వీసులో ఉన్న లేదా రిటైర్ అయిన జాయింట్ కలెక్టర్ స్థాయి కంటే తక్కువ కాకుండా ఉన్న వారే నియమితులవుతారు. అప్పీలేట్ అధికారులుగా ఎవరిని నియమించాలనేది రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నిర్ణయించలేదు. ఈ దశలో ఎవరికి నచ్చినట్లు వారు ఊహించుకోవడం సరికాదు. టైటిల్ రిజిస్టర్‌లో నమోదైన ఎంట్రీలపై అప్పీల్ చేసుకునేందుకు రెండేళ్ల సమయం ఎలా సరిపోతుందని కొందరు ప్రశ్నించారు. ఇది చాలా విడ్డూరంగా కనిపిస్తోంది. మ్యుటేషన్ చట్టం, ఆర్ఓఆర్ వంటి ఏ ఇతర చట్టాల ప్రకారమైనా రికార్డింగ్ అధికారి నిర్ణయాన్ని సవాలు చేయడానికి చరిత్రలో ఎన్నడూ కొన్ని వారాల కంటే ఎక్కువ సమయం ఇవ్వలేదు. రికార్డింగ్ అధికారి నిర్ణయాన్ని సవాలు చేయడానికి కొన్ని వారాల సమయం మాత్రమే ఇస్తారు. కానీ ల్యాండ్ టైట్లింగ్ చట్టంలో రెండు సంవత్సరాల సమయం ఇచ్చారు. పైన చెప్పిన టోరెన్స్ వ్యవస్థ ప్రకారం పునఃసమీక్ష, పరిష్కారం తర్వాత, రికార్డింగ్ చేయబడుతుంది, ఇది తాత్కాలికంగా మాత్రమే పరిగణించబడుతుంది. ఈ ప్రక్రియలో పట్టాదారులకు నోటీసులు ఇవ్వబడతాయి. ఈ తాత్కాలికాన్ని సవాలు చేయడానికి ప్రజలకు 2 సంవత్సరాల సమయం ఇస్తారు. 2 సంవత్సరాలలోపు ఎటువంటి ఛాలెంజ్ లేకపోతే, తాత్కాలికమే ఫైనల్ అవుతుంది. ఈ విషయంలో పరిమితి చట్టంలోని నిబంధనలను కోట్ చేయడం అసంబద్ధం.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి ప్రధాన సలహాదారు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, తిథి: పౌర్ణమి తె.5.02 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి బహుళ పాడ్యమి, నక్షత్రం: మృగశిర రా.10.10 వరకు తదుపరి ఆరుద్ర, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.8.41 నుండి 9.29 వరకు, తదుపరి రా.10.44 నుండి 11.32 వరకు, అమృతఘడియలు: ప.1.18 నుండి 2.55 వరకు.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం: 5.28
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ మీడియా

గొప్ప మనుషులు



మిగతా దేశాలకు భిన్నంగా ఒక్క జపాన్‌లోని యాపిల్ స్టోర్లలోనే ఐఫోన్లను కట్టకుండా ఉంచుతారు. ఎందుకంటే అక్కడ ఎవరూ దొంగతనం చేయరు. ఇది జపాన్ అత్యుత్తమ సంస్కృతిని ప్రతిబింబించడం లేదా?

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

నవ్వితే నవ్వండి!



మిమ్మల్ని చూసి జనం నవ్వడాన్ని మీరు ఎంతగా ఆపడానికి ప్రయత్నిస్తే... మీరు అంతగా నగుబాటుకు గురవుతారు. అదే మీరు కూడా వారి నవ్వుతో జత కలిస్తే, ఇక నవ్వులాట ఉండదు. జోక్ ఆగిపోతుంది. ఇది ఇంత మామూలు విషయం. ప్రపంచపు అధికార వ్యవస్థలు ఎంత మారినా, ఇది మారలేదు.

– వీర్ దాస్, కమెడియన్

ఒప్పిస్తారు!



భారతదేశంలో రెండు రకాల వైద్యులున్నారు. 1.నిజమైన వైద్యులు. 2.తమను తాము వైద్యులుగా భావించుకునేవాళ్లు. ఎవరు ఎమిటని మీకు ఎలా తెలుస్తుంది? పెద్ద కష్టపడే పనిలేదు– రెండో కోవలోకి వచ్చేవాళ్లు తాము వైద్యులమేనని ఒప్పించడానికి తాము చేయకూడదనిదంతా చేస్తారు.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

అమృతకాలంలో... అన్నీ వాస్తవాలేనా?

సందర్భం



సి. రామచంద్రయ్య


ఎన్నికల సీజన్‌లో ప్రజలు, ప్రసార మాధ్యమాల దృష్టి ఎక్కువగా రాజకీయాలపైనే కేంద్రీకృతం అవుతుంది. చర్చలన్నీ వాటి చుట్టూనే తిరుగుతాయి. 5 రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచీ అదే జరిగింది. ఇక మరి కొన్ని రాష్ట్రాలకు, అదేవిధంగా లోక్‌సభకు మరో 3 నెలల వ్యవధిలో ఎన్నికలు జరిగే నేపథ్యంలో పార్టీల గెలుపోటముల మీదనే జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

మధ్యప్రదేశ్‌లో వరుసగా నాలుగోసారి అధికారం దక్కించుకోవడంతో పాటు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో పాగా వేయడంతో భారతీయ జనతాపార్టీ మంచి జోరు మీద ఉంది. ఈ భారీ విజయాల అనంతరం ప్రధాని నరేంద్రమోదీ స్వరం పెరిగింది. 'మూడవ సారి ప్రధానిని నేనే' అంటూ ఆయన ధీమాగా చెబుతున్నారు. భారత్ వెలిగిపోతోందని చెప్పేందుకు బీజేపీకి వత్తాసు పలికే కొన్ని పత్రికలు, ప్రసార మాధ్యమాలు దేశంలో కాంతులీనుతున్న వంతెనలను, దీపాల వెలుగుల్లో ముచ్చట గొల్పుతున్న హైవేలను చూపుతున్నాయి. 2047 నాటికి దేశం ప్రపంచంలోనే 2వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకోవడం తథ్యం అని ప్రధానితో సహా బీజేపీ అగ్రనేతలు పదేపదే ప్రచారం చేస్తున్నారు.

అయితే, అందుబాటులో ఉన్న గణాంకాలను పరిశీలిస్తే భారత ఆర్థిక వ్యవస్థ కరిమింగిన వెలగపండు మాదిరిగానే ఉందన్నది ఓ చేదు వాస్తవం. జీడీపీ మెరుపుల వెనుకనున్న మరకల్ని చూపించకపోవడం అన్నది చిరుగుల చొక్కాపై అందమైన కోటు వేసుకోవడం లాంటిదే! ఇక, ఎన్నికలలో విజయం సాధించినపుడు అనేక ప్రతికూల అంశాలు మరుగున పడిపోతాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్య స్థితిని అంచనా వేసే కొలమానాల్లో జీడీపీ వృద్ధిరేటుకు ఇటీవలి కాలంలో పెద్దగా ప్రాధాన్యం లభించడం లేదు. ఆర్థిక విధానాలను సరళీకృతం చేశాక పెరిగిన ఆర్థిక అసమానతల నేపథ్యంలో... ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతను లెక్కించడానికి మూలధన వృద్ధిరేటు (రేట్ ఆఫ్ క్యాపిటల్ ఫార్మేషన్), మానవాభివృద్ధి రేటు, టెక్నాలజీ ఉపయోగిత రేటు, సహజవనరుల వినియోగం, మౌలిక సదుపాయాల వృద్ధి, ఉద్యోగిత పెరుగుదలలో కనిపించే వృద్ధి, విద్యాప్రమాణాల నాణ్యత, జీడీపీలో ప్రైవేటు పెట్టుబడుల నిష్పత్తి, రూపాయి పటిష్ఠత, తలసరి ఆహార లభ్యత, అవినీతి, సుపరిపాలన వంటివి కీలకంగా మారాయి.

ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త 'శ్రీమతి ఉత్స పట్నాయక్' తాజా పుస్తకం 'ఎక్స్‌ప్లోరింగ్ ది పావర్టీ క్వశ్చన్'లో పేర్కొన్న దాని ప్రకారం దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లోని 80 శాతం మంది కనీస స్థాయిలో ఆహార ధాన్యాలు పొందలేకపోతున్నారు. ఆక్స్‌ఫామ్ నివేదిక దీనిని బలపరుస్తూ 2021లో దేశవ్యాప్తంగా 84 శాతం కుటుంబాల ఆదాయం తగ్గిపోయిందని పేర్కొంది. దేశంలో పొదుపు తగ్గిన కారణంగా క్యాపిటల్ ఫార్మేషన్ మందగించింది. దేశ స్థూల ఉత్పత్తిలో ప్రైవేటు అప్పుల నిష్పత్తి బాగా పెరిగిపోయిందనీ, ఇందుకు కారణం బ్యాంకుల నుంచి, ఇతర ప్రైవేటు ఆర్థిక సంస్థల నుంచి రుణాలు స్వీకరించిన వారు తిరిగి అప్పులు చెల్లించలేక పోవడమేననీ బ్యాంకుల సమాఖ్య వెల్లడించింది.

గతంలో ఎన్నడూ లేని విధంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కాంట్రాక్టర్లకు, సప్లయిర్లకు చేయవలసిన చెల్లింపులు నిలిచిపోవడమో, లేక మితిమీరిన జాప్యం జరగడమో అవుతోంది. కొందరు కాంట్రాక్టర్లు తమకు రావాల్సిన బకాయిల చెల్లింపులపై విధిలేని పరిస్థితిలో న్యాయస్థానాల గుమ్మాలు తొక్కుతుంటే, ఇంకొందరు రుణభారం మోయలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ దుఃస్థితి దేశవ్యాప్తంగా ఉంది. 'మనీ ఫ్లో' లేకపోవడం వల్ల వస్తు వినిమయం బాగా తగ్గిపోయింది. ద్రవ్యోల్బణం పెరిగి నిత్యావసరాల ధరలు రోజురోజుకీ పైకి ఎగబాకుతున్నాయి. దీనివల్ల మెజార్టీ ప్రజలు కనీస పోషక విలువలు ఉండే ఆహారాన్ని తీసుకోలేకపోతున్నారు. ముఖ్యంగా దేశంలో పేద వర్గాలకు చెందిన అత్యధిక శాతం మంది గర్భిణీ స్త్రీలకు



పౌష్టికాహారం తగినంత అందకపోవడం అన్నది దేశాన్ని తలదించుకొనేలా చేస్తోంది.

ప్రపంచ మానవాభివృద్ధి సూచీలో 2015లో 188 దేశాల్లో భారత్‌కు లభించిన స్థానం 130 కాగా, 2021–22లో 191 దేశాల్లో 132వ స్థానం దక్కించుకొంది. అంటే ఆరేడేళ్లల్లో దేశ ప్రజల జీవితాల్లో ఏమాత్రం మెరుగుదల కనపడలేదని అంతర్జాతీయ సమాజం గుర్తిస్తోంటే, ఆశ్చర్యకరంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ... భారతదేశం 2022లో అమృత్‌కాల్ (అమృతకాలం)లోకి ప్రవేశించినట్లు పదేపదే చెబుతున్నారు. అందుకు ఆయన చూపుతున్న ఉదాహరణ భారత ఆర్థిక వ్యవస్థ యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)ను దాటిపోవడం. మరో పాతికేళ్లల్లో మనం చైనాను వెనక్కు నెట్టేస్తామట. ప్రధాని నరేంద్రమోదీ మనల్ని నమ్మమంటున్నారు. నిజానికి, 2047 నాటికి లేదా 2027 నాటికి 'చైనా' స్థానం ఎక్కడకు వెళుతుంది? క్రితం యేడాది ప్రపంచబ్యాంకు నివేదికనే ప్రామాణికంగా తీసుకొంటే చైనా కంటే భారత్ 6 రెట్లు వెనుకబడి ఉంది. ఒక అమెరికన్ డాలర్ భారత్ కరెన్సీకి 82 రూపాయలు. అదే 7 యువాన్లు (చైనా కరెన్సీ) పెడితే ఒక అమెరికా డాలర్! ఈ లెక్కన అంతర్జాతీయ ద్రవ్య విపణిలో చైనా కరెన్సీ ఎంత బలంగా ఉందీ, రూపాయి ఎంత బలహీనంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. భారత్‌కు చైనాకు పోలిక తేవడం దేనికి? 2047లో చైనాను వెనక్కు నెట్టేయడం ఎలా సాధ్యం? భారత్ ఆర్థికంగా పురోగమిస్తుంటే, చైనా చేష్టలుడిగి చూస్తుందా?

ఇక, దేశ కీలక రంగాలకు చెందిన ఆడిట్ రిపోర్టులను తయారుచేసి పార్లమెంట్‌కు సమర్పించేందుకు ఏర్పాటయిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సీఏజీ)ను క్రమంగా నిర్వీర్యం చేసే బాధ్యతను కూడా ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిందా అనే అనుమానం కూడా కలుగుతోంది. ఎందుకంటే, ఏటా 40 రంగాల ఆడిట్ రిపోర్టులు పార్లమెంట్‌కు సమర్పించే సీఏజీ... గత 4 ఏళ్లుగా సగటున 22 నివేదికలు మాత్రమే పార్లమెంట్‌కు సమర్పిస్తోంది. సిఏజీ అన్నది రాజ్యాంగబద్ధ వ్యవస్థ. దీనికి కేటాయించే బడ్జెట్‌ను భారీగా తగ్గించారు. అరకొర నిధులు కేటాయించడం అంటే కీలక రంగాలలో ఏమి జరుగుతున్నదో ప్రజలకు తెలియజెప్పాల్సిన అవసరం లేదని పాలకులు భావించడమే! వాస్తవాలు తెలుసుకోకుండా, అధికారంలో ఉన్నవారు ఏది చెబితే దానిని నమ్మాలా? దేశం అమృతకాలంలోకి ప్రవేశించిందని సంబరాలు జరుపుకోవాలా?

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

ఆధ్యాత్మిక పరిమళాలు

ఇటీవల కాలంలో పండుగలు, పర్వ దినాలు వస్తే గృహ ప్రాంగణాలు, దేవాలయాలు సామూహిక సంకీర్తనా గానంతో మారుమోగి పోతున్నాయి. ఆధ్యాత్మిక పరిమళాలు ఇంటింటా, ఊరూరా ఈ సామూహిక గానంతో వ్యాపించి వికసిస్తున్నాయి. ఇది చాలా సంతోషించ దగిన విషయం.

జ్యోతిర్మయం

సామాజిక మాధ్యమాలు అందుబాటులో ఉండటంతో స్త్రీలు, పురుషులు బృందాలుగా ఏర్పడి, సమయాన్ని నిర్ణయించుకుని, ఒకరికొకరు సమాచారాన్ని ఇచ్చుకుని, ఒకచోట కలిసి, లలితా సహస్ర నామాలు, విష్ణు సహస్ర నామాలు, హనుమాన్ చాలీసా, గోవింద నామాలు వంటివి సామూహికంగా గానం చేస్తున్నారు. ఈ విధమైన భగవన్నామ స్మరణ, కీర్తన జనులలో కొత్త శక్తిని నింపుతుంది. అందరూ కలిసి చేసే ఈ నామ సంకీర్తనలో ఆర్తి ఉంటుంది.

రెండు మూడు గంటల పాటు నిర్విరామంగా భగవంతుని సంకీర్తన చేస్తూ, తరువాత కూడా దైవాన్ని గురించే మాట్లాడుకుంటూ ఉండటం వల్ల లౌకికమైన ఈర్ష్య, అసూయ ద్వేష భావాలకు దూరంగా ఉండటం సాధ్యమవుతుంది. తామంతా ఒక్కటే అన్న ఐకమత్య భావన ఈ సామూహిక గానం వల్ల కలుగుతుంది. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావన ఈ సంకీర్తన వల్ల వెల్లి విరుస్తుంది.

కలియుగంలో సంకీర్తన ముక్తిదాయకమని పురాణాలు చెబుతున్నాయి.!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

నేడు పౌర్ణమి గరుడసేవ రద్దు



తిరుమల: తిరుమలలో మంగళవారం నిర్వహించాల్సిన పౌర్ణమి గరుడ సేవను టీటీడీ రద్దు చేసింది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. అయితే శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు జరుగుతున్న కారణంగా మంగళవారం పౌర్ణమి గరుడసేవ ఉండదని, ఈ విషయాన్ని భక్తులు గమనించాలని తెలిపింది.

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో మంగళవారం జరగనుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో అభివృద్ధి పనులతో పాటు మరిన్ని అంశాలపై పాలకమండలి చర్చించనుంది. ఈ సమావేశానికి టీటీడీ బోర్డు సభ్యులు హాజరుకానున్నారు.

సర్వదర్శన టోకెన్ల జారీ పూర్తి

ఈ నెల 23 నుంచి 2024, జనవరి 1వ తేదీ వరకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించిన సర్వ దర్శన టోకెన్ల జారీని సోమవారం టీటీడీ పూర్తి చేసింది. తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, గోవిందరాజస్వామి సత్రాలు, భూదేవి కాంప్లెక్స్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం, జీవకోన హైస్కూల్, బైరాగిపట్టెడలోని రామానాయుడు హైస్కూల్, ఎంఆర్ పల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో 90 కౌంటర్లలో 10 రోజులకు గాను నాలుగు లక్షలకుపైగా సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లను భక్తులకు అందించారు. తదుపరి సర్వదర్శనం టోకెన్లను జనవరి 2వ తేదీ నుంచి ఇవ్వనున్నారు. టోకెన్లు లేని భక్తులను దర్శనానికి అనుమతించరు.

లోడింగ్‌లో దుమ్మురేపిన విశాఖ పోర్టు



విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీ లోడింగ్‌లో దుమ్మురేపింది. రెండు రోజుల క్రితం నెలకొల్పిన రికార్డును అధిగమించింది. సోమవారం ఒక్క రోజులోనే ఎంవీ ఫెయిత్ నౌకలోకి 8,379 మెట్రిక్ టన్నుల కాల్సిన్డ్ అల్యూమినాను లోడింగ్ చేసింది. ఈనెల 23వ తేదీన 8,055 మెట్రిక్ టన్నుల లోడింగ్ రికార్డును బ్రేక్ చేసింది. ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్ స్టీవ్‌డోర్‌గాను, ఈశ్వర్ షిప్పింగ్ సర్వీసెస్ స్టీమర్ ఏజెంట్‌గా వ్యవహరించాయి.

తెలంగాణ

బిగ్‌బాస్ నిర్వాహకులకు నోటీసులు

బంజారాహిల్స్(హైదరాబాద్): ఈ నెల 17వ తేదీన బిగ్‌బాస్ సీజన్–7 ఫైనల్స్ సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో బిగ్‌బాస్ యాజమాన్యం ఎండమోల్ షైన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు జూబ్లీహిల్స్ పోలీసులు తాజాగా నోటీసులు జారీచేశారు. వివరాల్లోకి వెళ్తే... హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో నిర్వహించిన బిగ్‌బాస్ ఫైనల్ వేడుకలో పల్లవిప్రశాంత్ విజేతగా నిలిచారు. అయితే అప్పటికే పల్లవిప్రశాంత్, రన్నరప్ అమర్‌దీప్ చౌదరి అభిమానులు భారీసంఖ్యలో అక్కడికి చేరుకొని ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. ఆర్టీసీ బస్సులపై రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో అమర్‌దీప్, మరో కంటెస్టెంట్ గీతూరాయ్, పోలీసుల కార్లు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో పల్లవిప్రశాంత్‌తోపాటు మరికొందరిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. దీంతో బిగ్‌బాస్ యాజమాన్యానికి పోలీసులు నోటీసులు అందజేశారు.

నమ్మక ద్రోహం నారా బాబుదే!

బాబు ఎగ్గొట్టిన రూ.715.84 కోట్ల బీమా పరిహారాన్ని రైతన్నలకు చెల్లించింది సీఎం జగన్ ప్రభుత్వమే

- అన్నదాతపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా
- 2022–23 నుంచి పీఎంఎఫ్‌బీవైతో అనుసంధానం
- కప్ అండ్ క్యాప్ మోడల్‌తో రైతన్నలకు పైసా నష్టం ఉండదు
- 80–110 విధానంలో అదనపు పరిహారం భారం ప్రభుత్వానిదే
- మెజార్టీ రాష్ట్రాల్లో ఇదే విధానం

సాక్షి, అమరావతి: దేశంలో మరెక్కడా లేని విధంగా నోటిఫై చేసిన ప్రతి పంటకు, సాగు చేసిన ప్రతీ ఎకరాకు యూనివర్సల్ కవరేజ్ కల్పిస్తూ రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. లబ్ధి పొందిన రైతుల సంఖ్యను చూసినా, అందుకున్న పరిహారాన్ని పరిశీలించినా టీడీపీ హయాంతో పోలిస్తే ఇప్పుడు రెట్టింపు స్థాయిలో ప్రయోజనం చేకూరిందన్నది రామోజీకి మింగుడు పడకున్నా కాదనలేని సత్యం. అర్హులైన ప్రతి ఒక్కరికీ వెతికి మరీ పరిహారాన్ని అందిస్తూ పూర్తి పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌ను స్ఫూర్తిగా తీసుకొని మెజార్టీ రాష్ట్రాలు ఇదే బాట పట్టాయి. చాలా రాష్ట్రాలు ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయంటే అది బాగున్నట్లే కదా! చంద్రబాబు హయాంలో 6.19 లక్షల మంది అన్నదాతలకు ఎగ్గొట్టిన రూ.715.84 కోట్ల బీమా పరిహారాన్ని సీఎం జగన్ ప్రభుత్వమే చెల్లించింది. నిత్యం బాబు భజనలో మునిగి తేలుతున్న రామోజీ మాత్రం బాబోయ్ అన్నదాతలకు ద్రోహం చేస్తున్నారంటూ, ఉచిత పంటల బీమా పేరుతో కోతలు వేస్తున్నారంటూ గావు కేకలు పెడుతున్నారు!!

రైతులపై పైసా భారం లేకుండా..

పంటల బీమా సీజన్‌వారీగా నోటిఫై చేసిన పంటలకు మాత్రమే వర్తిస్తుంది. గతంలో పీఎంఎఫ్‌బీవై కింద బ్యాంకు రుణం తీసుకున్న రైతులతోపాటు కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ప్రీమియం చెల్లించిన ఇతర అన్నదాతలకు మాత్రమే బీమాను వర్తింపచేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక 2019 నుంచి రైతులపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ఈ క్రాప్ డేటా ఆధారంగా నోటిఫై చేసిన పంటలకు, సాగైన ప్రతీ ఎకరాకు యూనివర్సల్ కవరేజ్‌తో బీమా రక్షణ కల్పిస్తోంది. 2019-20లో పీఎంఎఫ్‌బీవైతో కలిసి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయగా 2020-21, 2021-22 సీజన్లలో పరిహారాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించింది. ఈ క్రాప్ డేటాతో యూనివర్సల్ కవరేజ్ కల్పించేందుకు కేంద్రం అంగీకరించడంతో 2022–23 సీజన్ నుంచి పీఎంఎఫ్‌బీవైతో ఉచిత పంటల బీమాను అనుసంధానించి అమలు చేస్తున్నారు.

హేతుబద్ధీకరణ కోసం..

బీమా పరిహారం తగ్గిన సందర్భాల్లో అధిక ప్రీమియం వసూలుతో వచ్చే ఆదాయం ద్వారా బీమా కంపెనీలు ఎక్కువ ప్రయోజనం పొందుతున్నాయని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ప్రీమియం రేట్ల హేతుబద్ధీకరణకు రిస్క్ షేరింగ్ మోడళ్లను ప్రతిపాదించింది. వీటిలో ఒకటైన కప్ అండ్ క్యాప్ 80–110 మోడల్‌కు ప్రయోగాత్మకంగా తొలుత మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో 2020–21లో శ్రీకారం చుట్టగా తర్వాత పలు రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఈ మోడల్‌ను ఉచిత పంటల బీమా కింద 2023 – 24 వ్యవసాయ సీజన్ నుంచి దిగుబడి ఆధారిత పంటల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కప్ అండ్ క్యాప్ (80–110) బీడ్ మోడల్ ద్వారా కంపెనీలకు చెల్లించాల్సిన ప్రీమియం హేతుబద్ధీకరిస్తారేగానీ రైతులకు చెల్లించాల్సిన బీమా పరిహారంలో ఎలాంటి కోతలు ఉండవు.

కోతలు పెట్టడానికి చాన్స్ లేదు

రాష్ట్రంలోని 9 క్లస్టర్ల పరిధిలో దిగుబడి ఆధారిత పంటలకు సంబంధించి 110 శాతం కన్నా ఎక్కువ నష్టం సంభవించిన సందర్భాల్లో ఆ అదనపు పరిహారం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ రైతులకు పూర్తి బీమా పరిహారాన్ని చెల్లిస్తుంది. ఇది పూర్తిగా బీమా కంపెనీలకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య విధానపరంగా జరిగే వ్యవహారమే కానీ రైతులకు చెల్లించే బీమా పరిహారానికి సంబంధించింది కాదన్న విషయం రామోజీకి తెలియదు కాబోలు! ఇదంతా బీమా కంపెనీలకు అదనపు ప్రయోజనాన్ని నివారించే చర్యే తప్ప ఇందులో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లదు.



ఖరీఫ్‌లో 70.80 లక్షల ఎకరాలకు కవరేజ్

2023 ఖరీఫ్‌లో 15 పంటలను దిగుబడి ఆధారంగా, ఆరు పంటలను వాతావరణ ఆధారంగా నోటిఫై చేసి ఉచిత బీమా వర్తింపచేశారు. 2023 – 24 రబీలో 13 పంటలను దిగుబడి ఆధారంగా, నాలుగు పంటలను వాతావరణ ఆధారంగా అక్టోబర్‌లో నోటిఫై చేసి ఉచిత బీమా వర్తింప చేశారు. 2023 ఖరీఫ్‌లో 93 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా నోటిఫై చేసిన పంటలకు సంబంధించి 70.80 లక్షల ఎకరాల్లో సాగైన వాటికి బీమా వర్తింప చేశారు. తద్వారా 34.70 లక్షల మంది రైతులు బీమా రక్షణ పొందారు. జాబితాలను అక్టోబర్ 31 నాటికి కేంద్రానికి కూడా పంపించారు. వీటిని నేషనల్ క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత రైతులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాల్సిన ప్రీమియం వాటాలను నిర్ధారిస్తారు. ఆ మేరకు రైతుల వాటాతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తమ వాటాను కలిపి బీమా కంపెనీలకు చెల్లిస్తుంది. ఆ తర్వాత కేంద్రం తమ వాటా జమ చేస్తుంది. తద్వారా బీమా కంపెనీలు అర్హత కలిగిన రైతుల ఖాతాలకు పరిహారం చెల్లిస్తాయి. ఇదే విధానాన్ని 2022 – 23లో అనుసరించారు. గతంలో ఎప్పుడు లేని విధంగా తదుపరి సంవత్సరం అదే సీజన్ ముగిసే నాటికి బీమా పరిహారం చెల్లిస్తున్నారు.

ఏపీ బాటలోనే పలు రాష్ట్రాలు

దిగుబడి ఆధారిత పంటల కోసం రిస్క్ షేరింగ్ మోడల్‌ను తమిళనాడుతో పాటు మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర లాంటి పెద్ద రాష్ట్రాలు కూడా ఈ ఏడాది నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నాయి. కర్ణాటక ఇప్పటికే ఖరారైన టెండర్లను సైతం రద్దు చేసి వచ్చే రెండేళ్లకు 80 –110 మోడల్ ద్వారా కొత్తగా టెండర్లకు వెళ్లేందుకు సిద్ధపడింది. పథకం అమలుకు సంబంధించి అన్ని వ్యవహారాలు పోర్టల్ ద్వారా పారదర్శకంగా జరుగుతాయి. మార్గదర్శకాలను అనుసరించి దిగుబడి ఆధారిత పంటలకు పంట కోత ప్రయోగాల ద్వారా నమోదయ్యే వాస్తవ దిగుబడుల ఆధారంగా లెక్కించిన బీమా పరిహారాన్ని చెల్లిస్తారు. వాతావరణ ఆధారిత పంటలకు వాతావరణంలో హెచ్చు తగ్గులను ప్రామాణికంగా తీసుకుని బీమా పరిహారం లెక్కిస్తారు.

అలాగైతే ఉచితంగా ఎందుకిస్తుంది?

వాతావరణ ఆధారిత పంటలకు పాత పద్ధతిలోనే టెండర్లను ఖరారు చేశారు. దేశంలోని ఏ రాష్ట్రం వాతావరణ ఆధారిత బీమా పథకంలో రిస్క్ షేరింగ్ మోడల్‌ను అమలు చేయడం లేదు. ఇక రామోజీ చెబుతున్నట్లుగా ఆర్థిక భారం తగ్గించుకోవడమే ప్రభుత్వ లక్ష్యమైతే.. అసలు ఉచిత పంటల బీమా పథకం అమలు ద్వారా యూనివర్సల్ కవరేజీ దిశగా అడుగులు వేసేదే కాదు. టీడీపీ హయాంలో ఐదేళ్లలో 30.85 లక్షల మందికి రూ.3,411.20 కోట్లు పరిహారం మాత్రమే ఇవ్వగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు 54.48 లక్షల మందికి రూ.7,802.05 కోట్లు పరిహారం అందచేసింది. గత సర్కారు హయాంతో పోలిస్తే ఇప్పుడు అదనంగా 23.63 లక్షల మంది లబ్ధి పొందగా పరిహారం పరంగా రూ.4,390.85 కోట్ల మేర అదనంగా రైతన్నలకు ప్రయోజనం చేకూరింది.

కులోన్మాదుల తప్పుడు ప్రచారం సిగ్గుచేటు

- బహుజన పరిరక్షణ సమితి నేతలు
- 1,184వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



తాడికొండ: తమను మోసం చేస్తున్నారని తెలుసుకున్న బహుజనులు ఓట్లేయకపోవడంతో పెత్తందారీతనానికి కాలం చెల్లిందని గ్రహించిన కులవాదులంతా ఏకమై రాష్ట్రంలో తప్పుడు ప్రచారాలకు దిగడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 1,184వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని పలువురు ముఖ్య అతిథులు సందర్శించి మద్దతు తెలిపి ప్రసంగించారు. రాష్ట్రంలో తామే ఆధిపత్యం చేయాలని ఓ సామాజికవర్గం కులాలు, ప్రాంతాల మధ్య కుంపట్లు పెట్టే పనిలో పడ్డారన్నారని విమర్శించారు. అభివృద్ధి అంతా ఒకే ప్రాంతంలో కుమ్మరించి, అమరావతి రాజధానిని సైతం తమ కుల వాదుల చేతుల్లో బంధించాలని చూసిన చంద్రబాబు, ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి లక్షల కోట్ల కుంభకోణం చేశాడని మండిపడ్డారు. తన సామాజికవర్గ పెద్దలు, ఎన్‌ఆర్‌ఐలు వంటి వారికి ముందస్తు సమాచారం అందించి ఈ ప్రాంతంలో భారీగా భూములు కొనుగోలు చేయించి ఆ భూములకు రెక్కలొచ్చేలా అమరావతి ఇన్నర్ రింగ్ అలైన్‌మెంట్ మార్చి భారీ మోసానికి పాల్పడ్డాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుజనులను మోసం చేసి అణగదొక్కినందుకే బాబుకు రాష్ట్రంలో తగిన శాస్తి జరిగిందని, తమ హక్కులను హరించేందుకు కుట్రకోణంలో తప్పుడు కేసులు వేస్తున్న కులవాదులను వెంటనే అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అప్పుడు బందిపోటు ఇప్పుడెలా అవసరమయ్యారు

ఎంపీ మార్గాని భరత్



ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే)ను బీహార్ బందిపోటుగా, గజదొంగగా అభివర్ణించిన చంద్రబాబు ఇప్పుడెలా ఆయనను పక్కన కూర్చోబెట్టుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్ ప్రశ్నించారు. రాజమహేంద్రవరంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. నిజానికి చంద్రబాబే పెద్ద గజదొంగ అని ఎద్దేవా చేశారు. టీడీపీపై ప్రజల్లో నమ్మకం లేనప్పుడు ఏ సెఫాలజిస్ట్ అయినా చేసేదేమీ ఉండదన్నారు. తెలంగాణలో నివాసముంటూ ఏపీలో రాజకీయ వ్యాపారాలు చేసే వలస పక్షుల జిమ్మిక్కులు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. 2014లో రాష్ట్ర ప్రజలు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తే ఆ ఐదేళ్లూ రాష్ట్రాన్ని నిలువునా ముంచేసి ఖజానాను దోచుకున్నారని విమర్శించారు. ఇప్పుడు మీ భవిష్యత్‌కు గ్యారంటీ, బాబు ష్యూరిటీ అంటూ ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వస్తున్నారని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని దోచుకున్న చంద్రబాబు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. ప్రజల ముందుకు వస్తే ఆయన్ను నిలదీయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్ చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలని ఏనాడో ప్రజలు గ్రహించారన్నారు. నాడు కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తూ ఎన్టీఆర్ టీడీపీని నెలకొల్పితే అదే కాంగ్రెస్‌తో చేతులు కలిపి చంద్రబాబు ఏ విధంగా రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఈ రాష్ట్ర ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చారని, రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ విజయానికి ఇవన్నీ దోహదపడతాయని స్పష్టం చేశారు.

శానిటరీ నాప్‌కిన్ల పంపిణీలో ఏపీ అగ్రగామి

మెన్‌స్ట్రువల్ హైజీన్ కార్యక్రమం అమలులో అన్ని రాష్ట్రాలకూ ఆదర్శం

- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య 59.63 లక్షల శానిటరీ నాప్‌కిన్ల ఉచిత పంపిణీతో దేశంలో రెండోస్థానం
- స్వేచ్ఛ కార్యక్రమం కింద ఏడు నుంచి ఇంటర్ విద్యార్థినులకు ప్రభుత్వం అందజేత
- నెలసరి సమయంలో అపరిశుభ్ర పద్ధతులతో ఎదురయ్యే సమస్యలపై అవగాహన
- వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కౌమార దశ క్లినిక్‌ల నిర్వహణ
- గత ఏడాది మెన్‌స్ట్రువల్ హైజీన్ కార్యక్రమం అమలుకు రూ.200 కోట్ల ఖర్చు
- కేటాయించిన నిధులను మొత్తం ఖర్చుచేసి దేశంలో నెంబర్–1గా నిలిచిన ఏపీ



సాక్షి, అమరావతి: ఆడబిడ్డల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ వారిపట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కనబరుస్తున్న ప్రత్యేక శ్రద్ధ ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. మెన్‌స్ట్రువల్ హైజీన్ (నెలసరి పరిశుభ్రత) కార్యక్రమం అమలులో ఏపీ దేశంలోనే అగ్రగామిగా ఉంటోంది. ఈ అంశాన్ని ఇటీవల కేంద్ర ఆరోగ్య శాఖ లోక్‌సభలో వెల్లడించింది. నెలసరి సమయంలో స్కూళ్లు, కాలేజీల్లో చదివే విద్యార్థినులు పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం 'స్వేచ్ఛ' కార్యక్రమం ద్వారా శానిటరీ నాప్‌కిన్లను ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఇలా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబరు మధ్య 72.59 లక్షల నాప్‌కిన్‌లను పంపిణీ చేసి పశ్చిమ బెంగాల్ మొదటి స్థానంలో ఉండగా.. 59,63,209 శానిటరీ నాప్‌కిన్ల పంపిణీతో ఏపీ రెండో స్థానంలో ఉంది. అనంతరం.. 45.86 లక్షలతో తమిళనాడు మూడో స్థానంలో నిలిచింది. ఇక కేరళలో 80,166, కర్ణాటకలో కేవలం 5,613, తెలంగాణలో 3,920 మాత్రమే పంపిణీ చేశారు.

కేటాయించిన నిధుల ఖర్చులో నెంబర్ వన్..

ఇక నెలసరి పరిశుభ్రత కార్యక్రమాలు అమలుచేయడం ద్వారా భవిష్యత్తులో బాలికలు అనారోగ్య సమస్యల బారినపడకుండా నియంత్రించేందుకు కేటాయించిన నిధులను ఖర్చుచేయడంలో ఏపీ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్ల మేర నిధులు కేటాయించడమే కాకుండా దేశంలోనే అత్యధికంగా వంద శాతం నిధులను ఖర్చుచేసింది. పశ్చిమ బెంగాల్‌లో రూ.389 కోట్లు కేటాయించగా కేవలం రూ.9.32 కోట్లు, తెలంగాణాలో రూ.303 కోట్లు కేటాయించినప్పటికీ రూ.4 లక్షలు మాత్రమే ఖర్చుచేసినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది.

ప్రతీనెలా 10 లక్షల మంది బాలికలకు..

నెలసరి ఇబ్బందులతో బాలికలు విద్యకు దూరమవుతున్న పరిస్థితులను సీఎం జగన్ ప్రభుత్వం గుర్తించింది. దేశంలో దాదాపు 23 శాతం బాలికల చదువులు ఆగిపోవడానికి ప్రధాన కారణం నెలసరి సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులేనని యునైటెడ్ నేషన్స్ వాటర్ సప్లై అండ్ శానిటేషన్ కొలాబరేటివ్ కౌన్సిల్ నివేదికల్లో వెల్లడించారు. ఈ తరహా డ్రాపౌట్స్‌ను తగ్గించడంతో పాటు, బాలికలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా స్వేచ్ఛ కార్యక్రమాన్ని 2021లో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమం కింద ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ఏడు నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న 10 లక్షల మంది బాలికలకు ప్రతినెలా ఒకొక్కరికి 10 చొప్పున నాణ్యమైన, బ్రాండెడ్ శానిటరీ నాప్‌కిన్లను ఉచితంగా అందిస్తున్నారు. ఇందుకోసం ఏటా ప్రభుత్వం రూ.30 కోట్ల మేర ఖర్చుచేస్తోంది.

ప్రత్యేకంగా స్నేహపూర్వక కౌమార దశ క్లినిక్‌లు..

ఇక కౌమార దశలో బాలబాలికలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యల నివృత్తికి, వారికి వైద్యసేవలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రత్యేకంగా స్నేహపూర్వక కౌమార క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. క్లినిక్‌లలో సేవలు అందించే వైద్యులు.. కౌమార దశ పిల్లలపట్ల ఏ విధంగా వ్యవహరించాలి.. తదితర అంశాలపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణనిచ్చారు. అంతేకాక.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామాలకు వెళ్లిన డాక్టర్లు మధ్యాహ్నం నుంచి పాఠశాలలు సందర్శించి అక్కడి బాలికల ఆరోగ్యంపై వాకబు చేస్తున్నారు. ఎదుగుతున్న సమయంలో శరీరంలో వచ్చే మార్పుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళా ఉపాధ్యాయులు, మహిళా అధ్యాపకులు, గ్రామ సచివాలయాల్లోని ఏఎన్ఎంలు ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.


అపరిశుభ్ర పద్ధతులతో సమస్యలు..

ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థినుల్లో చాలావరకు మధ్యతరగతి, పేద కుటుంబాల వారుంటారు. వీరికి శానిటరీ నాప్‌కిన్లు కొనే ఆర్థిక స్తోమత ఉండదు. దీంతో..

- నెలసరి సమయంలో వస్త్రాన్ని వాడే విధానాన్ని అపరిశుభ్ర పద్ధతిగా వైద్యులు చెబుతారు. ఇలా వాడటంతో రీప్రొడక్టివ్ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు (జననాంగం సంబంధిత ఇన్ఫెక్షన్లు–ఆర్టీఐ) వస్తాయి.
- అలాగే.. సాధారణంగా జననాంగంలో రక్షణకు అవసరమైన హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను స్రవించే లాక్టోబాసిల్లై అనే మంచి బ్యాక్టీరియాతో పాటు కొద్ది మోతాదులో వేరే బ్యాక్టీరియా కూడా ఉంటుంది. వస్త్రం వంటి అపరిశుభ్రమైన పద్ధతులతో జననాంగం సంబంధిత ఇన్ఫెక్షన్ల ముప్పు ఏర్పడిన తర్వాత కాలంలో సంతానలేమి, శృంగారంతో ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ వ్యాధులొస్తాయి.
- అంతేకాదు.. హానికరమైన బ్యాక్టీరియాతో యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ వస్తుంది. భవిష్యత్‌లో సంతానలేమి సమస్యలూ తలెత్తుతాయి.

తెలంగాణ

ఇంట్లోనే థియేటర్!



దేశవ్యాప్తంగా పెరుగుతున్న హోం థియేటర్ ట్రెండ్

నగరాలతోపాటు చిన్న పట్టణాల్లోనూ డిమాండ్	ఏటా సుమారు 1.25 లక్షల హోం థియేటర్ల ఏర్పాటు	తెలంగాణ, ఏపీలో 5 వేల యూనిట్ల విక్రయం

ప్రత్యేక అనుభూతి కోసం రూ. కోట్లు ఖర్చు చేస్తున్న సంపన్నులు

సాక్షి, హైదరాబాద్: భారీ తెర.. 4కే నాణ్యతతో దృశ్యాలు.. నలువైపుల నుంచి ప్రతిధ్వనించే సరౌండ్ సౌండ్ సాంకేతికత.. చీకటి పరుచుకున్న పెద్ద హాల్లో చల్లగా తాకే ఏసీ గాలి... ఒకేసారి వందలాది మందితో కలసి సౌకర్యవంతమైన సీట్లలో కూర్చొని చూసే వీలు.. దీనికితోడు ఈలలు, చప్పట్లతో హోరెత్తించే అభిమానులు... ఇదీ మల్టీప్లెక్స్‌లు లేదా థియేటర్లలో సినీ వీక్షకులకు కలిగే అనుభూతి. మరి ఇదే భారీతనం ఇంట్లోనే లభిస్తే..! అవును.. ప్రజలు ఇప్పుడు క్రమంగా థియేటర్‌ను ఇంటికే తెచ్చేసుకుంటున్నారు. ఈ హోం థియేటర్ ట్రెండ్ దేశవ్యాప్తంగా చిన్న పట్టణాలకూ పాకుతోంది.

అడ్డంకులు లేని అనుభూతి..

మార్కెట్‌లో భారీ తెరల టీవీలు అందుబాటులో ఉన్నప్పటికీ ఆడియో నాణ్యత విషయంలో పరిమితులు నెలకొన్నాయి. కానీ అదే హోం థియేటర్లో ఇటువంటి అడ్డంకులు ఏవీ ఉండవు. నచ్చిన సైజులో స్క్రీన్, ఖరీదైన సౌండ్ సిస్టంను ఏర్పాటు చేసుకొనే వెసులుబాటు ఉంటోంది. దీనికితోడు నచ్చిన సమయంలో కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య సరదాగా గడుపుతూ థియేటర్ ముందు కాలక్షేపం చేసే సౌలభ్యం కలుగుతోంది. ఇక అనుభూతి అంటారా.. ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్టు.. మీరు ఖర్చు చేసేదాన్నిబట్టి థియేటర్ ఎక్స్‌పీరియెన్స్ మారుతుంది.

పెరిగిన డిమాండ్..

మూడు గదుల కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న అపార్ట్‌మెంట్లు, విల్లాల్లో నిర్మాణ సంస్థలు సైతం ప్రత్యేకంగా హోం థియేటర్ కోసం ఏర్పాట్లు చేస్తున్నాయంటే వాటికి ఉన్న ప్రాధాన్యత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఏటా భారత్‌లో సుమారు 1,25,000 హోం థియేటర్లు ఏర్పాటవుతుండటం విశేషం. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాటా దాదాపు 5,000 యూనిట్లుగా ఉంటోంది.

ఓటీటీల రాకతో...

దేశంలో ఓటీటీలకు పెద్దగా ఆదరణ లేనప్పుడు హోం థియేటర్ విభాగం వృద్ధి కేవలం 20 శాతంగానే ఉండేది. కరోనా మహమ్మారి వ్యాప్తి తర్వాత ఏకంగా ఏటా 50 శాతం వృద్ధి నమోదవుతోంది. ఇప్పుడు స్థానిక భాషల్లోనూ ఓటీటీల్లో కంటెంట్ ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. హోం థియేటర్లో సినిమాలను 50 శాతం మంది చూస్తుంటే స్పోర్ట్స్‌ను 25 శాతం, వెబ్ సిరీస్‌లను 25 శాతం మంది వీక్షిస్తున్నారట.

ఖర్చు ఎంతంటే..

మెట్రో, ప్రథమ శ్రేణి నగరాల్లో సంపన్నులు 15–30 సీట్ల సామర్థ్యంగల లగ్జరీ హోం థియేటర్లను కోరుకుంటున్నారు. ఇందుకోసం రూ. 50 లక్షలు మొదలుకొని రూ. 3 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. మొత్తం పరిశ్రమలో ఈ విభాగం వాటా 5 శాతం ఉంటోంది. అలాగే 6–12 సీట్ల సామర్థ్యం ఉన్న హోం థియేటర్ల వాటా 25 శాతంగా ఉంది. వాటికి అయ్యే వ్యయం రూ. 15–50 లక్షల శ్రేణిలో ఉంది. ఇక ఎకానమీ విభాగంలో రూ. 5–15 లక్షల వ్యయంలో 4–10 సీట్లతో హోం థియేటర్లను ప్రజలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

రూ.7 కోట్ల ఖరీదు చేసే స్పీకర్లు..

ప్రస్తుతం డాల్బీ అట్మాస్, ఆరో 3డీ, డీటీఎస్ ఎక్స్ ఆడియో ఫార్మాట్స్ ఉన్నాయి. హోం థియేటర్ కోసం ఇళ్లలో స్క్రీన్ తప్పనిసరి కాదు. కానీ థియేటర్ ఫీల్ కావాలంటే మాత్రం స్క్రీన్ ఏర్పాటు చేసుకోవాల్సిందే. లేజర్ ప్రొజెక్టర్ల వైపు మార్కెట్ మళ్లుతోంది. వాటి ధర రూ. 2.5 లక్షలు మొదలు కొని రూ. 1.5 కోట్ల వరకు ఉంది. మంచి స్పీకర్లు రూ. 50 వేల నుంచి రూ. 2 కోట్ల వరకు దేశంలో లభిస్తున్నాయి. జర్మనీ బ్రాండ్ అయిన టైడల్ ఆడియో రెండు స్పీకర్ల ధర రూ. 7 కోట్ల వరకు ఉంది. ఆంప్లిఫయర్ ధర రూ. 1.5–20 లక్షలు, ప్రాసెసర్ ధర రూ. 50 వేలు మొదలుకొని రూ. 35 లక్షల దాకా పలుకుతోంది. అకౌస్టిక్స్ కోసం వాడే మెటీరియల్‌నుబట్టి థియేటర్ ఎక్స్‌పీరియెన్స్ ఆధారపడి ఉంటుంది.

కరోనా తర్వాత పెరిగిన ప్రాధాన్యత



కరోనా వ్యాప్తి తర్వాత ప్రజలు ఎంటర్‌టైన్‌మెంట్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. కాబట్టే హోం థియేటర్లకు డిమాండ్ పెరిగింది. ప్రైవసీ కోరుకొనే వాళ్లకు హోం థియేటర్ చక్కని పరిష్కారం. సంప్రదాయ థియేటర్‌ను మించి హోం థియేటర్ ఎక్స్‌పీరియెన్స్ ఉంటుంది. ఆడియో క్వాలిటీ 100 శాతంపైగా మెరుగ్గా ఉంటుంది. నీటి తుంపర, సీటు కదలడం వంటి స్పెషల్ ఎఫెక్ట్స్ సైతం ఏర్పాటు చేసుకోవచ్చు. మేము ఇప్పటివరకు 2 వేలకుపైగా హోం థియేటర్లను ఏర్పాటు చేశాం.

– ముదిమెల వెంకట శేషారెడ్డి, ఎండీ, వెక్టర్ సిస్టమ్స్

రోడ్డు కనబడక చెరువులోకి దూసుకెళ్లి..

- నీట మునిగిన కారు.. ఒకరు మృతి
- మృతుడు అనకాపల్లి జిల్లాకు చెందిన గుణశేఖర్‌గా గుర్తింపు

అనంతగిరి: సరదాగా విహారయాత్ర కోసం బయలుదేరిన వారిని పొగమంచు కమ్మేసింది. దట్టంగా కమ్ముకున్న పొగమంచుతో రోడ్డు సరిగా కనబడక.. కారు పక్కనే ఉన్న చెరువులోకి దూసుకెళ్లింది. అందులో ఉన్న ఐదుగురిలో నలుగురు ఈదుకుంటూ బయటికిరాగా.. ఒకరు నీట మునిగి మృతి చెందారు. వికారాబాద్ పట్టణ శివార్లలోని శివారెడ్డిపేట్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం నుంచి బయటపడినవారు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని అనకాపల్లి జిల్లా దేవరాంపల్లి మండలం మామిడిపల్లికి చెందిన గుణశేఖర్ (24), వైజాగ్‌కు చెందిన సాగర్, రఘుపతి, చిత్తూరు జిల్లాకు చెందిన పూజిత, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మోహన్ ఐదుగురూ స్నేహితులు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి అనంతగిరి గుట్టలకు విహారయాత్ర కోసం బయలుదేరారు. వికారాబాద్ పట్టణ శివార్లలోని శివారెడ్డిపేట్ చెరువు వద్ద ప్రయాణిస్తున్న సమయంలో పొగ మంచు దట్టంగా అలుముకుని ఉంది. దీనితో రోడ్డు సరిగా కనిపించక కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఈత వచ్చిన రఘు నీట మునిగిపోతున్న సాగర్‌ను బయటికి తీసుకువచ్చాడు. కారు నడుపుతున్న మోహన్, పూజిత కూడా సురక్షితంగా బయటికి రాగలిగారు. గుణశేఖర్ నీటిలో మునిగిపోయాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బాధితులను వికారాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా సేవా 19వ వార్షికోత్సవం



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని సమైక్య తెలుగు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (సేవా) 19వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవా అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి జీవీఆర్ మురళి సహా సేవా ప్రతినిధులు ఢిల్లీలోని తెలుగు ప్రముఖులను సత్కరించారు. ఏపీ భవన్‌లో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

కాషాయ ప్ర'దక్షిణం'..!

దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వేసేందుకు బీజేపీ కసరత్తు

- 130 స్థానాల్లో 80 దాకా గెలవడమే టార్గెట్
- 2019లో 29 సీట్లతో సరిపెట్టుకున్న కమలదళం



రానున్న సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయాలన్న గట్టిపట్టుదలతో ఉన్న బీజేపీ తన దృష్టినంతా దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రీకరించింది. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ హవా కొనసాగుతోంది. కొరకరాని కొయ్యలా ఉన్న దక్షిణాది రాష్ట్రాలపై పట్టు సాధిస్తే కేంద్రంలో వరుస గా మూడోసారి అధికారం దక్కించుకోవడం ఆ పార్టీకి నల్లేరుపై నడకే. ఉత్తరాదితో పోలిస్తే ముందునుంచీ సవాలుగానే ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని బీజేపీ పట్టుదలగా ఉంది...

అరునూరైనా 60 దాటాల్సిందే...!

కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు పుదుచ్చేరిలలో కలిపి మొత్తం 130 లోక్‌సభ స్థానాలున్నాయి. 2024 సాధారణ ఎన్నికల్లో వాటిలో 80 సీట్ల సాధనే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే వాటిలో కర్ణాటక మినహా మిగతా దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలతో కమలదళం పోటీ పడలేకపోతోంది. గత ఎన్నికల్లో కాషాయపార్టీ ఈ 130 సీట్లలో కేవలం 29 చోట్ల గెలిచింది. కర్ణాటకలో 28 సీట్లకు ఏకంగా 25 నెగ్గగా తెలంగాణలో 17 స్థానాలకుగాను నాలుగు చోట్ల గెలిచింది. ఆంధ్రప్రదేశ్‌లో 25, తమిళనాడులో 39, కేరళలో 20 స్థానాలకు గాను ఒక్కటంటే ఒక్కటి కూడా గెలవలేక చతికిలపడింది. ఈసారి మాత్రం దక్షిణాదిన ఎలాగైనా కనీసం 60 సీట్లలో గెలుపే లక్ష్యంగా పెట్టుకుంది. తాజాగా జరిగిన బీజేపీ పదాధికారుల భేటీలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ఇదే విషయాన్ని నొక్కిచెప్పారు. బీజేపీ ఎత్తుగడలను ఇటీవలి కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు దెబ్బ తీశాయనే చెప్పాలి. కర్ణాటక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు 42.88 శాతం ఓట్లు రాగా, బీజేపీ 36 శాతం ఓట్లకు పరిమితం కావడమే గాక రాష్ట్రంలో అధికారం కూడా కోల్పోయింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో 13 శాతం ఓట్లు సాధించిన జేడీ(ఎస్)తో కలిసి లోక్‌సభ ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. కాంగ్రెస్‌ను ఎలాగైనా సింగిల్ డిజిట్‌కే పరిమితం చేసేలా వ్యూహాలు రచిస్తోంది. అయితే సీట్ల పంపకాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. జేడీ(ఎస్) నేత కుమారస్వామి ఇటీవలే ప్రధాని మోదీతో ఈ అంశమై చర్చలు జరిపారు. ఇక 2019లో నాలుగు లోక్‌సభ సీట్లు సాధించిన తెలంగాణలో ఈసారి కనీసం రెట్టింపు చోట్ల గెలవాలని బీజేపీ యోచిస్తోంది. తెలంగాణలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 7 శాతం ఓట్లు సాధించిన బీజేపీ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో దాన్ని రెట్టింపునకు పెంచుకుని 14 శాతం ఓట్లు రాబట్టింది. ఈ లెక్కన ఎంపీ సీట్లను కూడా డబుల్ చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదనే ఆశపడుతోంది. పదాధికారుల భేటీలో మోదీ, షా ద్వయం ఇదే విషయాన్ని తెలంగాణ బీజేపీ నేతలకు నూరిపోశారు.

కేరళలో...

కేరళలో వామపక్ష సంకీర్ణ కూటమితో తలపడటం బీజేపీకి పెద్ద సవాల్‌గా మారింది. వరుసగా 2104, 2019 ఎన్నికల్లో ఖాతా తెరవలేకపోయిన బీజేపీ ఈసారి కనీసం ఎనిమిది సీట్లు సాధించాలని చూస్తోంది. గత ఎన్నికల్లో 12 శాతం ఓట్లను రాబట్టుకున్న పార్టీ ఈసారి 25 శాతం ఓట్లు లక్ష్యంగా కార్యాచరణను రూపొందిస్తోంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో తన పట్టు పెంచుకునేందుకు బీజేపీ ఎక్కువగా పొత్తులపైనే ఆధారపడుతోంది. జనసేనతో పొత్తు కొనసాగినా అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈసారి 24 సీట్ల దాకా ఖాయమన్న వస్తాయన్న సర్వే సంస్థల వెల్లడి నేపథ్యంలో బీజేపీ ఇక్కడ ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితే కనిపిస్తోంది.

ఉత్తరాది నేతలకు బాధ్యతలు

దక్షిణాది రాష్ట్రాల్లో పాగా దిశగా వ్యూహ రచనకు బీజేపీ ఇప్పటికే టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి, ఉపాధ్యక్షులు బైజయంత్ పాండా, దిలీప్ ఘోష్, లాల్‌సింగ్ ఆర్య ఇందులో ఉన్నారు. రాష్ట్రాలవారీగా పార్టీ పరిస్థితులను అంచనా వేసి, తదనుగుణంగా గెలుపు వ్యూహాలను అధిష్టానం సిద్ధం చేసింది. వాటి అమలు బాధ్యతను గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కీలక నేతలకు అప్పగించనున్నట్టు తెలుస్తోంది. యూపీ నేతలు కేశవ్ ప్రసాద్ మౌర్య, సునీల్ బన్సల్, స్వతంత్ర దేవ్ సింగ్, గుజరాత్‌కు చెందిన పర్దేశ్ మోదీ, విజయ్ రూపానీ సేవలను కూడా వినియోగించుకోనుంది.

– సాక్షి, న్యూఢిల్లీ

దక్షిణాదిన ఈసారి బీజేపీ ప్రధానంగా దృష్టి సారించిన రాష్ట్రం తమిళనాడు. ఇక్కడ ఆ పార్టీ ఇప్పటిదాకా బోణీ కొట్టలేకపోయింది. అధికార డీఎంకే అక్కడ కాంగ్రెస్‌తో అంటకాగడం బీజేపీకి మింగుడు పడట్లేదు. జయలలిత హయాంలో బీజేపీకి ఏఐఏడీఎంకేతో పొత్తుండేది. అయితే 2014లో అన్నాడీఎంకే 44 శాతం ఓట్లతో 37 సీట్లు నెగ్గితే మిత్రపక్షంగా బీజేపీ కేవలం 5.56 శాతం ఓట్లతో సరిపెట్టుకుంది. ఇక 2019 లోక్‌సభ ఎన్నికల్లో అక్కడ బీజేపీ పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. ఓట్ల శాతం 3.66 శాతానికి తగ్గింది. ఈ నేపథ్యంలో అక్కడ ఓట్ల శాతాన్ని పెంచుకుని, దాన్ని సీట్లలోకి కూడా మార్చుకోవడం బీజేపీకి కత్తిమీద సామే. మోదీ కరిష్మాతో ఈ పరిస్థితిని అధిగమించాలని పార్టీ భావిస్తోంది. ఇందుకోసం మోదీని తమిళనాడు నుంచి రాష్ట్రం నుంచి బరిలో నిలపాలని రాష్ట్ర బీజేపీ నేతలు భావిస్తున్నారు. ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కోయంబత్తూరు, కన్యాకుమారి, రామనాథపురంలో ఏదైనా ఒక లోక్‌సభ స్థానం నుంచి మోదీ పోటీ చేయవచ్చే ప్రచారం జోరుగా సాగుతోంది. దీనికి బలాన్నిస్తూ మోదీ తమిళనాడులో పదేపదే పర్యటిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. దీనికి తోడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలైకి అధిష్టానం పూర్తి స్వేచ్ఛనిచ్చింది. ఆయన డీఎంకే ప్రభుత్వ పనితీరు, అవినీతిపై తీవ్రంగా విమర్శల దాడి కొనసాగిస్తున్నారు. అవినీతి ఆరోపణలపై ఇద్దరు డీఎంకే మంత్రులు ఇప్పటికే జైలుకు వెళ్లగా, మరింత మందికి శిక్ష తప్పదనే సంకేతాలను బీజేపీ పంపుతోంది!

తమిళనాడు నుంచి లోక్‌సభ బరిలో మోదీ...?

బీజేపీ వీడియోతో డీఎంకే ఎదురుదాడి

చెన్నై: హిందీ మాట్లాడేవాళ్లు తమిళనాడులో టాయిలెట్లు కడుగుతున్నారంటూ మార్చి నెలలో డీఎంకే ఎంపీ దయానిధి మారన్ చేసిన వ్యాఖ్యల వీడియోపై బీజేపీ దుమ్మెత్తి పోస్తుండటంతో డీఎంకే ఘాటుగా స్పందించింది. దక్షిణాది ప్రజలు నల్లగా ఉంటారంటూ బీజేపీ నేత చేసిన వ్యాఖ్యల వీడియోను తెరమీదకు తెచ్చింది. దక్షిణాది రాష్ట్రాల ప్రజలు 'నల్లని మనుషులు' అంటూ బీజేపీ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు తరుణ్ విజయ్ చేసిన వ్యాఖ్యల పాత వీడియోను డీఎంకే తాజాగా షేర్ చేసి దీనిపై బీజేపీ నేతలు ఏమంటారని ప్రశ్నించింది. 2017 సంవత్సరంలో అల్ జజీరా టీవీ చానల్‌లో చర్చా కార్యక్రమంలో తరుణ్ చేసిన వ్యాఖ్యలు ఆనాడు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. తర్వాత ఆయన క్షమాపణలు చెప్పారు. ''ఉత్తరాది రాష్ట్రాల ప్రజలకు నిజంగానే జాతి వివక్ష చూపే అవలక్షణమే ఉంటే మాకు మొత్తం దక్షిణాదితో అవసరమేముంది?. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్.. ఇలా ఈ రాష్ట్రాల ప్రజలతో ఎందుకు కలిసిమెలిసి ఉంటాం?. మా చుట్టూ మొత్తం నలుపు మనుషులే ఉన్నారు'' అని తరుణ్ విజయ్ మాట్లాడిన వీడియోను డీఎంకే ఐటీ విభాగం షేర్ చేసింది. ''యూపీ, బిహార్ ప్రజలు ఇంగ్లిష్‌ను గాలికొదిలి హిందీని పట్టుకుని వేలాడి తమిళనాడులో టాయిలెట్లు కడుగుతున్నారు'' అని డీఎంకే నేత దయానిధి మారన్ గతంలో చేసిన వ్యాఖ్యలు తాజాగా దేశవ్యాప్తంగా వివాదం రేపడం తెలిసిందే.

దేశవ్యాప్తంగా 63 కరోనా జేఎన్1 కేసులు

సాక్షి, న్యూఢిల్లీ: వేగవంతమైన సాంక్రమణ సామర్థ్యమున్న కరోనా జేఎన్1 రకం వైరస్ వ్యాప్తి దేశంలో పెరుగుతోంది. గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా ఈ ఉపవేరియంట్ రకం కరోనా పాజిటివ్ కేసులు 63 వెలుగుచూసినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది. ఒక్క గోవాలోనే 34 ఈ రకం వైరస్ కేసులు బయటపడ్డాయి. మహారాష్ట్రలో తొమ్మిది, కర్ణాటకలో ఎనిమిది, కేరళలో ఆరు, తమిళనాడులో నాలుగు, తెలంగాణలో రెండు ఈ రకం కేసులు నమోదయ్యాయి. అన్ని వేరియంట్లు కలుపుకుని గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా కొత్తగా మొత్తం 628 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 4,054కు చేరినట్లు కేంద్రం తెలిపింది. కేరళలో 128 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రాలు కరోనా నిర్ధారణ పరీక్షల సంఖ్యను, వైరస్ నిఘా వ్యవస్థను పెంచాలని కేంద్రం సూచించింది.



సోమవారం ఉదయం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పూర్తిగా కమ్మేసిన పొగ మంచు

ఉత్తరాదిని 'కమ్ముకున్న పొగమంచు'

సాక్షి, న్యూఢిల్లీ: చలి పులికి ఉత్తరాది రాష్ట్రాలు గజగజ వణుకుతున్నాయి. ఉష్ణోగ్రతలు తగ్గడంతో పొగమంచు కమ్ముకుంటోంది. దీంతో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హరియాణా, రాజస్థాన్ రాష్ట్రాల్లో మంచుతెరలు దట్టంగా పరుచుకున్నాయి. ఢిల్లీసహా ఆరు రాష్ట్రాల విమానాశ్రయాల్లో సోమవారం ఉదయం పొగమంచు తీవ్రతంగా ఉండటంతో రన్‌వే కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. దీంతో పలు విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఏర్పడటంతో పలు విమానాలను అధికారులు దారి మళ్లించారు. సోమవారం ఉదయం ఢిల్లీ, అమృత్‌సర్, ఆగ్రా, ప్రయాగ్‌రాజ్, గ్వాలియర్, జైసల్మేర్ విమానాశ్రయాల్లో జీరో విజిబిలిటీ నమోదైందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. వచ్చే కొద్ది రోజులు చలి మరింత పెరిగే అవకాశం ఉందని ఐఎండీ అంచనావేసింది. ప్రతికూల వాతావరణ ప్రభావంతో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. సోమవారం ఉదయం పొగమంచు కారణంగా ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు విమానాల రాకపోకలపై ప్రభావం పడింది.

ప్రాణం తీసిన పొగమంచు!

బహ్రెయిచ్(యూపీ): దట్టంగా కమ్ముకున్న పొగమంచు ముగ్గురి ప్రాణాలు పోవడానికి కారణమైంది. సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని బహ్రెయిచ్–బల్‌రామ్‌పూర్ రహదారిలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. మంచుదుప్పటి కప్పిన రోడ్డుపై వేగంగా వస్తున్న ట్రక్కును ప్రయాణికుల బస్సు ఢీకొట్టింది. డ్రైవర్లతో పాటు ఒక ప్రయాణికుడు మరణించాడు. 20 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి.

నిరుపేద, అణగారిన వర్గాల సాధికారతే ధ్యేయం: మోదీ

ఇండోర్: సమాజంలో నిరుపేద, అణగారిన వర్గాల సాధికారతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆయా వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో హుకుంచంద్ మిల్లు కార్మికులకు రూ.224 కోట్ల మేర బకాయిలు చెల్లించే కార్యక్రమాన్ని ప్రధాని మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభించారు. బకాయిల చెల్లింపుతో 4,800 మంది కార్మికులకు లబ్ధి చేకూరనుందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో మధ్యప్రదేశ్‌లో అభివృద్ధి వేగం పుంజుకుందని హర్షం వ్యక్తం చేశారు. బిల్లు కార్మికులకు చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లిస్తున్న మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కరిపించారు. ఈ కార్యక్రమంలో భాగస్వామి కావడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని వ్యాఖ్యానించారు.

మాలవీయ పుస్తకం ఆవిష్కరణ

బెనారస్ హిందూ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు మదన్ మోహన్ మాలవీయ రచనలు, లేఖలు, కరపత్రాలు, ప్రసంగాలతో కూడిన పుస్తకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఢిల్లీలో ఆవిష్కరించారు. మాలవీయ 162వ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించారు. మాలవీయ రచనలను ఆంగ్లం, హిందీ భాషల్లో 11 సంపుటాలుగా ప్రచురించారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు

సమాజానికి సరైన దశ దిశను చూపడంలో, ప్రజలకు సేవలందించడంలో క్రైస్తవుల పాత్ర పట్ల దేశం గర్విస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో వారు ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఆయన క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం ఢిల్లీలోని తన నివాసంలో క్రైస్తవులతో సమావేశమయ్యారు. క్రైస్తవ వర్గం ప్రజలతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పేదలకు సేవలందించడంలో క్రైస్తవులు ఎల్లప్పుడూ ముందంజలో ఉంటున్నారని కొనియాడారు. విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ఎనలేని సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. యేసు ప్రభువు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని చెప్పారు.



సోమవారం ఢిల్లీలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

వాజ్‌పేయికి ముర్ము, మోదీ నివాళులు

దివంగత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 99వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని ఆయన స్మారకం 'సదైవ్ అటల్' వద్ద సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ అభివృద్ధి కోసం వాజ్‌పేయి అహర్నిశలూ కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు, హర్దీప్‌సింగ్ పురి, అర్జున్‌రామ్ మేఘ్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విషాహారం

ఒకరి మృతి..70 మందికి అస్వస్థత

బెంగళూరు: బెంగళూరు శివారులోని హోస్‌కోటే ప్రాంతంలో ఒక ఆలయంలో ప్రసాదం తిని ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. 70 మంది ఆస్పత్రి పాలయ్యారు. ఆలయంలో విషాహారం ఘటనను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం వెంటనే దర్యాప్తునకు ఆదేశించింది. ఆదివారం ఒక ఆలయంలో అక్కడి భక్తులు ప్రసాదం తిన్నాక వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతూ వేర్వేరు ఆస్పత్రుల్లో చేరారు. ఆరోగ్యం పూర్తిగా విషమించి ఒక మహిళ సోమవారం ఆస్పత్రిలో కన్నుమూసింది. ఫుడ్ పాయిజన్‌కు కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఒక ఆస్పత్రిలో ఒక ఫ్లోర్ మొత్తం ఐసీయూ పేషెంట్ల కోసం కేటాయించి చికిత్స చేస్తోంది. ప్రసాదం తినడం వల్లే తమ ఆరోగ్యం చెడిపోయిందని కొందరు చెప్పగా, ప్రసాదం తినకపోయినా ఆరోగ్య సమస్యలు తలెత్తాయని ఇంకొందరు చెప్పారు! దీనిపై నుంచి నివేదిక రావాల్సి ఉందని పోలీసులన్నారు.

కట్టేసి.. ఒళ్లంతా బ్లేడుతో కోసి.. పెట్రోల్ పోసి తగలబెట్టి..

స్నేహితురాలి దారుణ హత్య

చెన్నైలో 'ట్రాన్స్‌మ్యాన్' ఘాతకం

చెన్నై: పదో తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితురాలు. అబ్బాయిగా మారింది. దాంతో ఎవరూ ఆదరించడం లేదు. దాంతో అయ్యో పాపమని తనతో సానుభూతితో మాట్లాడింది. ఆ పాపానికి ప్రాణమే కోల్పోయిందో అమ్మాయి! మరెవరికీ దక్కొద్దనే అత్యాశతో అబ్బాయిగా మారిన (ట్రాన్స్‌మ్యాన్) అమ్మాయే ఆమెను పొట్టన పెట్టుకుంది. ఈ దారుణం తమిళనాడులో జరిగింది.

తానే సర్వస్వంగా ఉండాలనే అత్యాశ

మదురైకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆర్.నందినికి పాండీ మహేశ్వరి బాల్య స్నేహితురాలు. ఇద్దరూ పదో తరగతి వరకు కలిసే చదువుకున్నారు. ప్రస్తుతం థొరైపాకంలో ఎనిమిది నెలలుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. 26 ఏళ్ల పాండీ మహేశ్వరి కొంతకాలం క్రితం అబ్బాయిగా మారింది. వెట్రిమారన్ అని పేరు మార్చుకుంది. దాంతో తనకు స్నేహితులు లేకుండా పోయారు. తన బాధ చూడలేక సానుభూతితో నందిని మాట్లాడటం మొదలుపెట్టింది. కానీ నందిని తనతోనే మాట్లాడాలి, తనతోనే ఉండాలనేంతగా వెట్రిమారన్ తీరులో మార్పు వచ్చింది. ఇతర స్నేహితులతో మాట్లాడితే అస్సలు నచ్చేది కాదు. దాంతో నందిని అతడిని దూరం పెట్టేందుకు ప్రయత్నించింది. చెన్నైలో దగ్గరి బంధువుల ఇంటికి మకాం మార్చింది. ఉద్యోగం చేసేది.

బర్త్‌డే సర్‌ప్రైజ్ అని తీసుకెళ్లి...

నందిని తనను అస్సలు పట్టించుకోవట్లేదన్న కసితో ఎలాగైనా చంపేయాలని వెట్రిమాన్ నిర్ణయించుకున్నాడు. డిసెంబర్ 24న నందిని పుట్టినరోజు కావడంతో సర్‌ప్రైజ్‌చేస్తానంటూ ముందు రోజు శనివారం ఆమెను వెంటబెట్టుకుని తాంబరం సమీపంలోని అనాథాశ్రయానికి తీసుకెళ్లి విరాళం ఇచ్చాడు. కొత్త బట్టలు కొనిచ్చి పొన్మార్ వద్ద నిర్మానుష్య ప్రదేశంలో ఆగాడు. సర్‌ప్రైజ్ చేస్తానంటూ గంతలు కట్టి, కాళ్లు, చేతులు కట్టేశాడు. బ్లేడుతో విచక్షణారహితంగా మెడపై, ఛాతిపై, ఒళ్లంతా కోశాడు. భయంతో కేకలు వేస్తున్న నందినిపై పెట్రోల్ పోసి నిప్పంటించి పారిపోయాడు. యువతి హాహాకారాలు విన్న చుట్టుపక్కల జనం వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ''మేం ఘటనాస్థలికి చేరుకున్నప్పుడు వెట్రిమారన్ కూడానే ఉన్నాడు. కాలిపోయింది నందిని అని అతనే చెప్పాడు. ప్రభుత్వాసుపత్రికి తరలించేటపుడూ వెంట వచ్చాడు'' అని పోలీసులు చెప్పారు. నందిని మరణవాంగ్మూలంలో వెట్రిమారన్ గురించి చెప్పడంతో అతడిని పట్టుకున్నారు. నందిని మృతదేహాన్ని ఆమె పుట్టినరోజు నాడే కుటుంబానికి అప్పగించారు. కుటుంబసభ్యుల రోదన చూసిన వారందరికీ హృదయం ద్రవించింది.

పెద్ద పదవులు కోరుకోవడం లేదు: నితీశ్

పాట్నా: గత వారం ఢిల్లీలో జరిగిన విపక్ష 'ఇండియా' కూటమి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల పట్ల తాను అసంతృప్తితో ఉన్నానంటూ వెలువడిన వార్తలను బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ ఖండించారు. తమ కూటమిలో భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు త్వరలోనే పూర్తవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి తరపున ప్రధానమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేరును మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి నేతలు ప్రతిపాదించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. నితీశ్ కుమార్ సోమవారం పాట్నాలో మీడియాతో మాట్లాడారు. వ్యక్తిగతంగా తనకు పెద్ద కోరికలేవీ లేవని తెలిపారు. పెద్ద పదవులను తాను ఆశించడం లేదన్నారు. 'ఇండియా' కూటమి నిర్ణయాలపై తనకు ఎలాంటి అసంతృప్తి లేదని ఉద్ఘాటించారు. జేడీ(యూ) నేతల మధ్య తీవ్ర విభేదాలున్నాయన్న ప్రచారాన్ని నితీశ్ కొట్టిపారేశారు. పార్టీలో ఎలాంటి సమస్యలు లేవని చెప్పారు.



క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సోమవారం వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ బాసిలికా బాల్కనీ నుంచి విశ్వాసులకు ఆశీస్సులు అందిస్తున్న పోప్ ఫ్రాన్సిస్

బాల యేసులు ఎందరో యుద్ధంలో మరణిస్తున్నారు

- ఇజ్రాయెల్ దాడులు మరణాల నెత్తురు పంట పండిస్తున్నాయి
- క్రిస్మస్ సందేశంలో ఆవేదన వ్యక్తం చేసిన పోప్ ఫ్రాన్సిస్

వాటికన్ సిటీ: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ తన సందేశంలో గాజాపై ఇజ్రాయెల్ హేయ దాడులను ప్రస్తావించారు. పాలస్తీనియన్ల అపార ప్రాణనష్టానికి హేతువైన ఇజ్రాయెల్ దాడులను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బాసిలికా చర్చి ప్రధాన బాల్కనీ నుంచి సోమవారం పోప్ తన సందేశం వినిపించారు. ''గాజా సహా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల్లో బాలలు కన్నుమూస్తున్నారు. వారంతా నేటి తరం బాల యేసులు. గాజాపై ఇజ్రాయెల్ దాడులు అక్కడి అమాయక పౌరుల నెత్తుటి పంట పండిస్తున్నాయి. ఇజ్రాయెల్‌పై అక్టోబర్‌లో హమాస్ మెరుపు దాడి దారుణం. నాడు అపహరించుకుపోయిన వారందర్నీ హమాస్ విడిచిపెట్టాలి. ప్రపంచ ఆయుధ విపణి యుద్ధవీణ తంత్రులను మోగిస్తోంది. గాజా, ఉక్రెయిన్, సిరియా, యెమెన్, లెబనాన్, ఆర్మేనియా, అజర్‌బైజాన్‌లలో సైనిక, సామాజిక, రాజకీయ సంక్షోభాలు సమసిపోవాలి. ప్రపంచవ్యాప్తంగా శరణార్థుల హక్కులు పరిరక్షించబడాలి. గాజా స్ట్రిప్‌లో మానవతా సాయానికి దారులు తెరచి మానవీయ సంక్షోభాన్ని నివారించాలి'' అని పోప్ వ్యాఖ్యానించారు. విశ్వవ్యాప్తంగా పెరిగిన ఆయుధ కొనుగోళ్లపై స్పందించారు. ''ఆయుధాల ఉత్పత్తి, కొనుగోలు, రవాణా ఊహకందనంత పెరిగిన ఈ తరుణంలో కనీసం శాంతి అన్న పదం మనం ఉచ్ఛరించగలమా?'' అని పోప్ ఆవేదన వ్యక్తంచేశారు.

రష్యా సంప్రదాయాలకు ఉక్రెయిన్ 'నో'

అందరిలాగే ఇకపై డిసెంబర్ 25న క్రిస్మస్



ఉక్రెయిన్ రాజధాని కీవ్ శివార్లలోని ఓ గ్రామంలో వేడుకగా క్రిస్మస్ పర్వదినాన్ని జరుపుకుంటున్న చిన్నారులు

కీవ్: తమ భూభాగంపై దురాక్రమణకు దిగిన రష్యాపై ఆగ్రహంగా ఉన్న ఉక్రెయిన్ శతాబ్దకాలంగా పాటిస్తూ వస్తున్న సంప్రదాయానికీ తిలోదకాలు ఇచ్చింది. వందేళ్లకుపైగా ఉక్రెయిన్ జనవరి ఏడో తేదీనే క్రిస్మస్ వేడుకలను జరుపుకుంటోంది. రష్యా దండయాత్రతో ఆ దేశంతో శత్రుత్వం మరింత పెంచుకున్న ఉక్రెయిన్.. రష్యాతోపాటు అనుసరిస్తున్న రోమన్లకాలంనాటి జూలియన్ క్యాలెండర్‌ను పట్టించుకోవద్దని నిర్ణయించుకుంది. ప్రపంచంలో అత్యధిక క్రైస్తవ మెజారిటీ దేశాలు పాటించే గ్రెగోరియన్ క్యాలెండర్‌ను ఇకపై అనుసరించాలని తుది నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన చట్టానికి ఈ జూలై నెలలోనే దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆమోదముద్ర వేశారు. దీని ప్రకారం ఈఏడాది తొలిసారిగా డిసెంబర్ 25వ తేదీనే క్రిస్మస్ వేడుకలు ఉక్రెయిన్ అంతటా జరిగాయి. దేశంలో డిసెంబర్ 25వ తేదీన క్రిస్మస్ వేడుకలు జరగడం వందేళ్లలో ఇదే తొలిసారి. ఇన్నాళ్లూ రష్యాతోపాటు జూలియన్ క్యాలెండర్‌ను అనుసరిస్తూ జనవరి ఏడో తేదీన క్రిస్మస్‌ను జరుపుకుంది. ఈ సంవత్సరంతో ఉక్రెయిన్ కొత్త సంప్రదాయానికి తెరతీసింది. 'ఉక్రేనియన్లు సొంత సంప్రదాయాలు, సెలవులు, సొంత పర్వదినాలతో జీవించనున్నారు' అని ఈ సందర్భంగా జెలెన్‌స్కీ అన్నారు. ఉక్రెయిన్‌లో క్రైస్తవ జనాభానే అధికం. ఉక్రెయిన్‌లో దశాబ్దాలుగా రష్యన్ ప్రాచీన చర్చి సంప్రదాయాలనే ఎక్కువగా పాటిస్తుండటం గమనార్హం.

బెత్లెహంలో సాదాసీదాగా క్రిస్మస్



వెస్ట్‌బ్యాంక్‌లోని బెత్లహంలో జీసస్ జన్మస్థలంగా భావించే చాపెల్ ఆఫ్ సెయింట్ కాథరిన్‌లో సోమవారం క్రిస్మస్ ప్రార్థనలు

బెత్లెహం: క్రీస్తు జన్మస్థలం బెత్లెహం నగరంలో క్రిస్మస్ పర్వదినాన సందడి కన్పించలేదు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం నేపథ్యంలో ఈసారి అక్కడ సంబరాలు నిర్వహించరాదని నిర్ణయించారు. దాంతో క్రిస్మస్ ప్రత్యేక వేడుకలేవీ నిర్వహించలేదు. పండగ వెలుగులు, ఏటా వచ్చే వేలాది మంది పర్యాటకులు, సందర్శకులు, భక్తుల కోలాహలం లేక బెత్లెహం వెలవెలబోయింది. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో హమాస్ మద్దతుదారుల కోసం కోసం ఇజ్రాయెల్ సేనలు గాలింపు ముమ్మరం చేశాయి. వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థి శిబిరంపై సోమవారం ఉదయం వైమానిక దాడులు చేశాయి. క్రిస్మస్ ఏర్పాట్లలో మునిగిపోయిన జనం ఈ దాడులతో భయాందోళనకు గురయ్యారు. యేసు జన్మించిన ప్రదేశంగా భావించే బెత్లహంలోనూ వైమానిక దాడులు జరిగాయి.

'అల్–మగజి'పై అసాధారణ దాడులు

106 మంది పాలస్తీనియన్ల దుర్మరణం

గాజా స్ట్రిప్: భీకర గగనతల, భూతల దాడులతో తలో దిక్కూ పారిపోతూ శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్న పాలస్తీనియన్ల పట్ల ఇజ్రాయెల్ క్షిపణులు కనికరం చూపడం లేదు. సోమవారం సెంట్రల్ గాజా స్ట్రిప్‌లోని డెయిర్ అల్–బాలాహ్ పట్టణం సమీపంలోని అల్–మగజి శరణార్థి శిబిరంపై ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడిలో ఏకంగా 106 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. మూడు అంతస్తుల భవంతి పూర్తిగా నేలమట్టమైంది. భవన శిథిలాల నుంచి డజన్ల కొద్దీ మృతదేహాలను వెలికితీస్తున్న దృశ్యాలు అంతర్జాతీయ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. మరణాల సంఖ్య పెరగవచ్చని హమాస్ ఆరోగ్య విభాగం తెలిపింది. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దురాక్రమణ మొదలయ్యాక జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇదీ ఒకటి. గాజా స్ట్రిప్‌లో మొత్తంగా గత 24 గంటల్లో 250 మంది మరణించారని, 500 మందికి పైగా పాలస్తీనియన్లు గాయపడ్డారని హమాస్ పేర్కొంది. ఇజ్రాయెల్ కాల్పుల విరమణను ప్రకటించనుందన్న వార్తలను ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తోసిపుచ్చారు. త్వరలోనే యుద్ధాన్ని మరింతగా విస్తరిస్తామన్నారు.

మరణంలోనూ వీడని బంధం

• భర్త మృతిని తట్టుకోలేక ఆగిన భార్య గుండె

తిరువొత్తియూరు: నామకల్ జిల్లాలో భర్త మృతి చెందడంతో ఆవేదన తట్టుకోలేక భార్య కూడా మృతి చెందిన ఘటన తీవ్ర విషాదం నింపింది. వివరాలు.. నామకల్ జిల్లా తిరుచెంగోడు ప్రాంతానికి చెందిన నారాయణన్ (68). ఇతని భార్య రాజేశ్వరి (67). వీరికి పిల్లలు లేరు. వీరు కుమారపాళ్యం దక్షిణ కాలనీలో గత పదేళ్లుగా నివాసం ఉంటున్నారు. అక్కడ వారు నేతపని కార్మికులుగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో గత కొన్ని సంవత్సరాలుగా నారాయణ అనారోగ్యం కారణంగా పనికి వెళ్లడం లేదు. రాజేశ్వరి కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి నారాయణన్ మృతి చెందాడు. ఈ సంఘటనతో తీవ్ర ఆవేదనకు గురైన రాజేశ్వరి ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు.

న్యూస్‌రీల్

రామేశ్వరం జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడి



తిరువొత్తియూరు: నడి సముద్రంలో చేపలు పడుతున్న రామేశ్వరం జాలర్లపై శ్రీలంక నావిక దళం దాడి చేసింది. వివరాలు.. రామనాథపురం జిల్లా రామేశ్వరం ప్రాంతంలో వరుసగా కురుస్తున్న వర్షాలు కారణంగా గత ఐదు రోజులకు పైగా జాలర్లు సముద్రంలో వేటకు వెళ్లలేదు. ఈ క్రమంలో శనివారం రాత్రి రామేశ్వరం నుంచి 400కు పైబడిన ఫైబర్ పడవల్లో సుమారు 2 వేలకు పైగా జాలర్లు సముద్రంలోకి చేపలు పట్టేందుకు వెళ్లారు. ఆ సమయంలో గస్తీ కాస్తున్న శ్రీలంక నావికాదళం పోలీసులు 30 పైగా పడవల్లో ఉన్న రామేశ్వరం జాలర్లపై దాడి చేసి అక్కడి నుంచి వెళ్లగొట్టారు. సరిహద్దు దాటారంటూ కొందరు సముద్రంలో వేసిన వలలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో జాలర్లు ఆదివారం రామేశ్వరం సముద్రతీరానికి చేరుకున్నారు.

మదురై నుంచి అయోధ్యకు పుణ్య జలాలు



తిరువొత్తియూరు: మదురై మీనాక్షి అమ్మన్ ఆలయం సహా వివిధ దేవాలయాల్లోని తీర్థాల నుంచి సేకరించిన పుణ్య జలాలను అయోధ్యకు సోమవారం తరలించారు. వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో రామాలయం భారీ స్థాయిలో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆలయ కుంభాభిషేకము జనవరి 22న జరుగనుంది. అందుకోసం పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో విశ్వహిందూ పరిషత్ సంస్థ నిర్వాహకులు మదురై జిల్లాలోని అలగర్ ఆలయంలోని తీర్థం, మదురై మీనాక్షి ఆలయంలో స్వీకరించబడిన పుణ్యతీర్థం, చోళవందన్ నగర్ తీర్థం, తిరువేంగడం ఆలయంలోని పుణ్యతీర్థాలు, యోగ నరసింహ ఆలయంలోని పుణ్యజలాలను సేకరించారు. ఈ పుణ్యజలాలను కలశాలలో నింపి వాటిని మదురై మీనాక్షి అమ్మన్ ఆలయంలో ఉంచి ఆదివారం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్తు రాష్ట్ర నిర్వాహకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహకులు మాట్లాడుతూ పుణ్యజలాలను అయోధ్యకు రైలు ద్వారా తరలించినట్లు వెల్లడించారు.

నేడు అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే సర్వ సభ్య సమావేశం మంగళవారం చెన్నైలో జరగనుంది. వివరాలు.. అన్నాడీఎంకే పూర్తిగా మాజీ సీఎం పళనిస్వామి గుప్పెట్లోకి చేరిన విషయం తెలిసిందే. దీంతో ఆయన తన రాజకీయ వ్యూహాలకు పళని స్వామి పదును పెట్టారు. ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించినానంతరం తొలి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించేందుకు పళని సిద్ధమయ్యారు. పార్టీ పరంగా కీలక నిర్ణయాలు, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక మొదలు అన్ని రకాల కార్యక్రమాలు, పర్యటనలు, పొత్తులు తదితర ప్రక్రియలకు సంబంధించిన సర్వాధికారాలను ఈ సమావేశం ద్వారా పళని స్వామికి కట్టబెట్టే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పార్టీ పరంగా మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశాలు ఉన్నట్టు అన్నాడీఎంకే వర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీలోని 2,700 మేరకు ఉన్న సర్వ సభ్య సమావేశం సభ్యులు, రాష్ట్ర కార్యవర్గం అందరూ ఈ సమావేశానికి తరలి రానున్నారు. ఇక్కడకు వచ్చే పళని స్వామికి బ్రహ్మరథం పట్టే విధంగా ఆహ్వాన ఏర్పాట్లు ఇప్పటికే చేపట్టడం గమనార్హం.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

• బాలిక మృతి, ఇద్దరికి గాయాలు

కొరుక్కుపేట: చెంగల్పట్టు దగ్గర బలాటు వంతెన వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘోర ప్రమాదంలో ఓ బాలిక మృతి చెందింది. ఓ వృద్ధురాలు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేర్చారు. చెంగల్‌పట్టు జిల్లా మామండూర్ ఉత్తుకోట అమ్మన్‌కోయిల్ వీధికి చెందిన ప్రకాష్ (36), ఆయన కుమార్తె హర్ష (6), ప్రకాష్ తల్లి శశికళ తమ ద్విచక్ర వాహనంపై చెంగల్‌పట్టు నుంచి ఫ్లెటైవర్‌పై ప్రకాష్ బంధువు రాణాకార్తీక్ వెళ్తుండగా.. లారీ ఢీకొంది. కార్తీక్, శశికళ, హర్షకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా.. హర్ష మృతి చెందింది. మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు లారీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

భక్తిశ్రద్ధలతో.. క్రిస్మస్

రాష్ట్రంలో సోమవారం క్రిస్మస్ కోలాహలం మిన్నంటింది. పండుగను క్రైస్తవులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. దేవాలయాలల్లో(చర్చి) భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. పరస్పరం పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఏసుక్రీస్తు గొప్పదనాన్ని, ఆయన ప్రపంచానికి చాటి చెప్పిన సత్యం, శాంతితో కూడిన సందేశాన్ని మత పెద్దలు తమ బోధనల్లో తెలియజేశారు.

• రాష్ట్రవ్యాప్తంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
• రాత్రంతా మిన్నంటిన వేడుకలు
• కేక్ కటింగ్‌లు చేపట్టి శుభాకాంక్షలు చెప్పుకున్న క్రైస్తవులు
• కన్యాకుమారిలో సముద్రంలో సంబరాలు



బాల ఏసును ప్రార్థిస్తున్న చిన్నారులు



కేక్ కటింగ్, ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

సాక్షి, చెన్నై: లోకాకర్షణను మనిషి నియంత్రించగలడని నిరూపించిన దైవ కుమారుడు ఏసు క్రీస్తు జన్మించిన పర్వదినమే క్రిస్మస్. ఈ పండుగను రాష్ట్రంలోని క్రైస్తవులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి నుంచే చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అర్ధరాత్రి వేళ భారీ కేక్‌లు కట్ చేస్తూ వేడుకలు చేసుకున్నారు.

కిక్కిరిసిన చర్చిలు..

చెన్నై మైలాపూర్‌లోని శాంథోమ్, సెయింట్ థామస్ మౌంట్, బీసెంట్ నగర్‌లోని అన్నైవేలాంగణ్ణి, సెయింట్ జార్జ్ కోటలోని సెయింట్ మేరిస్, ఎగ్మూర్‌లోని ఆండ్రూస్ చర్చ్, సైదా పేటలోని సీఎస్ఐ, ప్యారిస్‌లోని ఆర్మేనియన్, కేకే నగర్ మత్తయి చర్చి, సైదాపేటలోని చిన్నమలై చర్చి, వెప్పేరి, ఐనావరం, కొళత్తూరుల్లోని లూథరన్ చర్చి, డాన్‌బాస్కో చర్చి, మడిపాక్కంలోని డ్రెనిట్ ఫుల్ గోసెర్ చర్చి, పెరంబూరు, విల్లివాక్కంలలోని ఏసు క్రీస్తు ప్రార్థనా మందిరాల్లో, నుంగంబాక్కం హైరోడ్డు చర్చి, చింతాద్రి పేటలోని మేరి చర్చి, పెరంబూరులోని వాటర్ బరీస్ మెమోరియల్ తెలుగు బాప్టిస్టు చర్చ్, వేప్పేరి మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చ్, వ్యాసార్పాడిలోని చర్చి, పులియంతోపు, కొరుక్కుపేట , తాంబరం తదితర ప్రాంతాలలోని చర్చిలల్లో క్రైస్తవులు పెద్దఎత్తున ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇంటిల్లి పాది ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు. రాష్ట్రంలోని నాగపట్నం వేలాంగన్నిలోని చర్చి, కన్యాకుమారి సముద్రతీర చర్చి, తిరుచ్చి, మదురై, ఈరోడ్, దిండుగల్, కడలూరు, కోయంబత్తూరు, చెంగల్పట్టు, కాంచీపురం , తిరువళ్లూరు, నీలగిరి, ఏలగిరి, సేలం, శివగంగై, నీలగిరి, కోవిల్‌పట్టి, ఊటీ, మేట్టుపాలయం, అరక్కోణం, జోలార్‌పేట, దిండుగల్ తదితర రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చర్చిలతో బాటు పాండిచ్చేరిలోని ప్రసిద్ధి చెందిన చర్చిల్లో భక్తి భావంతో ప్రార్థనలు జరిగాయి. వరద ముంపునకు గురైన తిరునల్వేలి, తూత్తుకుడిలో పండుగ కళ తప్పింది. తమను కష్టాల కడలి నుంచి గట్టెక్కించాలని అక్కడి క్రైస్తవ సోదరులు దేవుడిని కన్నీటితో ప్రార్థించారు. నాగపట్నం జిల్లా వేలాంగన్నీలో లక్షలాదిగా భక్తులు తరలి రావడంతో పండుగ వాతవరణం మిన్నంటింది.

నడి సముద్రంలో..

కన్యాకుమారిలో నడి సముద్రంలో క్రిస్మస్ వేడుక సాగాయి. తీరంలోని జాలర్ల కుటుంబాలు ప్రత్యేక ఏర్పాట్లతో పండుగను జరుపుకున్నారు. పదుల సంఖ్యలో పడవలలో తమ కుటుంబాలతో నడి సముద్రంలోకి వెళ్లారు. అక్కడ ప్రార్థనలు చేశారు. భారీ కేక్ కట్ చేశారు. ఇంటిల్లిపాది విందుతో ఆనందంగా గడిపారు. మైలాడుతురైలో ఓ హోటల్ నేతృత్వంలో క్రిస్మస్ సందర్భంగా 18 అడుగులతో బ్రహ్మండ కేక్‌ను సిద్ధం చేశారు. చంద్రాయన్ - 3 ఆకారంలో ఈ కేక్‌ను తీర్చిదిద్దారు.

కిటకిటలాడిన పర్యాటక కేంద్రాలు

క్రిస్మస్, అర్ధ సంవత్సరం పరీక్షలతో వచ్చిన సెలవులతో రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు సోమవారం కిట కిటలాడాయి. ప్రకృతి సీమలో రారాజుగా పేరుగడించిన నీలగిరి జిల్లా ఊటీ, ప్రకృతీ రమణీయతను తనలో ఇముడ్చుకున్న పర్యాటక యువరాణి దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లో ఎటు చూసినా జనం సందోహం కనిపించింది. సేలం జిల్లా ఏర్కాడులోని పేదల ఊటీ కూడా కిట కిటలాడింది. మంచు దుప్పటితో అక్కడి పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయి. అలాగే చెన్నై శివారులలోని మహాబలిపురం బీచ్, నగరంలోని మెరీనా బీచ్ సాయంత్రం వేళ జనంతో కిక్కిరిశాయి. రోడ్లన్నీ వాహనాలతో బారులుదీరాయి. అనేక కుటుంబాలు క్రిస్మస్‌ను తమ సొంత ఊళ్లలో జరుపుకోగా, మరికొన్ని కుటుంబాలు పర్యాటక ప్రాంతాల్లో వెళ్లి సందడి చేశాయి.

మిన్నంటిన భక్తి భావం

సోమవారం క్రిస్మస్ ప్రత్యేక ఆరాధనలు భక్తి భావాన్ని నింపాయి. ఏసుక్రీస్తు పుట్టుకను గుర్తు చేస్తూ, ఆయన జననంలోని పరామార్థాన్ని వివరించే విధంగా పాస్టర్లు శాంతి సందేశాన్ని ఇచ్చారు. ఏసుకు త్యాగం తప్ప స్వార్థం తెలియదని, క్షమించడం తప్ప కఠినత్వం లేదని తెలిపారు. పాప కార్యాలను వీడి పుణ్య కార్యాలు చేయాలని పిలుపునిస్తూ, ఆ ప్రభువును ప్రేమించినట్లే అందర్నీ ప్రేమించాలని సూచించారు. క్రైస్తవ సోదరుల్లో భక్తి భావాన్ని, దయ, దాన గుణాన్ని పెంచే విధంగా సందేశాలు సాగాయి. మధ్యాహ్నం వరకు సాగిన క్రిస్మస్ ఆరాధనల్లో బైబిల్ సారాంశాన్ని వినిపించారు. చివరగా ఒకరికి మరొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కొన్ని చోట్ల ఇతర మతస్తులు సైతం క్రైస్తవాలయాలకు తరలి వచ్చి శుభాకాంక్షలు తెలుపుతూ, తమ మిత్రులతో ఆనందాన్ని పంచుకున్నారు. తమ తమ ఇళ్లల్లో పండుగ రోజున పిండివంటలను చేసుకుని ఇరుగు పొరుగుకు పంచిపెట్టారు. ఇంటి ముందు, లోపల ప్రత్యేకంగా అలంకరించిన క్రిస్మస్ ట్రీ లను ఆకర్షణీయంగా ఉంచారు. మిత్రులు, ఆప్తులకు స్వీట్లు, కేక్‌లను పంచి పెట్టారు.



వేలాంగన్ని చర్చిలో..



మదురైలో..



తిరునల్వేలిలో..





చంద్రయాన్ శాటిలైట్ ఆకారంలో క్రిస్మస్ కేక్, తూత్తుకుడిలో ప్రార్థనలు

సీపీసీఎల్‌కు వ్యతిరేకంగా సీపీఐ ఆందోళన



సముద్ర తీరంలో పేరుకుపోయిన చమురు తెట్టు

సాక్షి, చెన్నై: సీపీసీఎల్‌కు వ్యతిరేకంగా ఎన్నూరులో సీపీఐ నేతృత్వంలో సోమవారం ఆందోళన కార్యక్రమం జరిగింది. సీపీసీఎల్ చమురు శుద్ధీకరణ కేంద్రం నుంచి వెలువడ్డ తెట్టు ప్రజలకు తీవ్ర నష్టం కలిగించిందని, ఇందుకు పూర్తి బాధ్యతను సీపీసీఎల్ వహించాలని, బాధితులకు పూర్తి స్థాయిలో సాయం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన సాగింది. ఇందులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్‌తో పాటు నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చమురు తెట్టు ఇంకా తమ ప్రాంతాలకు విస్తరించి ఉండడంపై పల వేర్కాడు జాలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు నష్ట పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ 40 గ్రామాల ప్రజలు ఆందోళనలకు సిద్ధమయ్యారు. మంగళవారం నుంచి పోరాట బాట పట్టనున్నట్లు ప్రకటించారు.

కుంటలో మునిగి తల్లి, కుమార్తె మృతి

తిరువొత్తియూరు: తిరువాడనై సమీపంలో బెంగళూరు నుంచి సొంత ఊరికి సెలవులకు వచ్చిన సమయంలో కుంటలో మునిగి తల్లి, కుమార్తె మృతి చెందారు. వివరాలు.. రామనాథపురం జిల్లా తిరువాడనై సమీపంలో ఉన్న అలగమడై గ్రామానికి చెందిన రాజారాం (41). ఇతని భార్య రాజేశ్వరి (40). వీరి కుమార్తె హన్సిని (11), కుమారుడు ప్రణవన్ (7). హన్షిని ఏడో తరగతి చదువుతోంది. బెంగళూరులో ఉంటున్న వీరు సెలవులకు రెండు రోజుల క్రితం అలాగు మడైకి వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున రాజేశ్వరి, తన కుమార్తె హన్సినిని తీసుకొని సమీపంలోని కుంటలో స్నానం చేయడానికి వెళ్లారు. చాలా సమయమైనప్పటికీ వారు తిరిగి రాలేదు. దీంతో సందేహపడిన రాజారాం బంధువులు మడుగు వద్దకు వెళ్లి చూశారు. ఆ సమయంలో రాజేశ్వరి నీటిలో మృతదేహంగా తేలుతూ ఉంది. వెంటనే వారు కుంటలో దిగి రాజేశ్వరి మృతదేహం బయట తెచ్చారు. అయితే నీరు ఎక్కువ లోతు ఉండడంతో బాలికను వెతకడం కష్టంగా మారింది. దీంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని బాలిక మృతదేహాన్ని బయటకు తీశారు.

టీఎన్‌పీఎస్సీ గ్రూప్ -2 పోస్టుల సంఖ్య పెంపు



• హర్షం వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

కొరుక్కుపేట: గ్రూప్ 2, గ్రూప్ 2ఏ పోస్టుల ఫలితాలు జనవరి 12న ప్రచురించనుండగా, ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్యను టీఎన్‌పీఎస్సీ మరింతగా పెంచింది. దీనిపై అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేశారు. వివరాలు.. తమిళనాడు పబ్లిక్ సర్వీస్ సెలక్షన్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) గ్రూప్ 2, గ్రూప్ 2ఏ పోస్టులలోని ఖాళీగా ఉన్న 5,413 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకోసం 2022 మే 21న మొదటి దశ రాత పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 9,94,890 మంది హాజరయ్యారు. ఇందుకు సంబంధించిన పరీక్షా ఫలితాలు ఈ నెల 8న విడుదలయ్యాయి. ఇందులో ఎంపిక అయిన 57,641 మందికి ఈ ఏడాది ఫిబ్రవరి 25న జరిగిన ప్రధాన పరీక్షకు ఎంపికయ్యారు. ఈ పరీక్షకు 51 వేల మందికి పైగా రాశారు. ఒకేసారి పలు పరీక్షలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొనడం, ఇటీవల తుపాను వరదల కారణంగా సమాధాన పత్రాల మూల్యాంకనానికి అదనపు సమయం పట్టింది. ఈ క్రమంలో గ్రూప్ 2 పరీక్ష ఫలితాలను జనవరి 12న విడుదల చేస్తామని టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో, టీఎన్‌పీఎస్సీలో ఖాళీల సంఖ్య పెరిగింది. అదనంగా 620 పోస్టులను జత చేశారు. దీంతో మొత్తం ఖాళీల సంఖ్య 6,033 పెరిగింది. ఈమేరకు టీఎన్‌పీఎస్సీ తన వెబ్‌సైట్‌లో సవరించిన ఖాళీల వివరాలను ప్రచురించింది.

నిధులిస్తారనే నమ్మకంతోనే ఉన్నాం!

• మంత్రి ఉదయ నిధి స్టాలిన్ వ్యాఖ్య
• తూత్తుకుడిలో పర్యటన
• వరదల్లో ప్రసవం చేసిన నర్సుకు అవార్డు
• బాధితులకు ఎల్జీ తమిళి సై ఓదార్పు



సీఎం స్టాలిన్‌కు చెక్కు అందజేస్తున్న కుంద్రకుడి అడిగళార్



వరద ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి ఉదయనిధి



సహాయకాలు పంపిణీ చేస్తున్న మంత్రులు ఉదయ నిధి, తంగం తెన్నరసు, మూర్తి



ఎంపీ కనిమొళికి సమస్యలు విన్నవిస్తున్న వరద బాధితులు

సాక్షి,చెన్నై: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన పర్యటనలో భాగంగా తమిళనాడుకు నిధులిస్తారనే నమ్మకంతో ఎదురు చూస్తున్నామని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ఉదయ నిధి స్టాలిన్ వ్యాఖ్యానించారు. తూత్తుకుడిలో వరద ముంపునకు గురైన ప్రాంతాలలో సోమవారం మంత్రులు మూర్తి, తంగం తెన్నరసులో కలిసి ఆయన పర్యటించారు. బాధితులకు సహాయకాలు అందజేశారు. అనేక చోట్ల బాధితులు కన్నీటితో తమ ఆవేదనను ఉదయనిధికి వివరించారు. అందర్నీ ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, జాతీయ విపత్తుకు నో ఛాన్స్ అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించడంపై మండిపడ్డారు. అయితే ఆమె ఇప్పుడు ఇక్కడి విపత్తును చూసేందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. మంగళవారం జరిగే ఆమె పర్యటన తదుపరి తమిళనాడును ఆదుకునేందుకు నిధులు సంవృద్ధిగా ఇస్తారనే నమ్మకంతో ఎదురు చూస్తున్నామన్నారు. కాగా, వరద ముంపునకు గురైన ప్రాంతాలలో తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పర్యటించారు. బాధితులను ఓదార్చారు.

నెల్లై 16 మంది మృతి

వరదలకు తిరునల్వేలి(నెల్లై)లో 16 మంది మరణించినట్లు ఆ జిల్లా కలెక్టర్ కార్తికేయన్ సోమవారం వెలువరించారు. ఈ 16 మంది కుటుంబాలకు తలా రూ. 5 లక్షలు చొప్పున అందజేస్తామన్నారు. అలాగే, 67 ఎద్దులు, 138 పశువులు, 504 గొర్రెలు, మేకలు, 28 వేల కోళ్లు మరణించినట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. పంట నష్టం, ఇతర ఆస్తి నష్టం వివరాల లెక్కింపు ఇంకా జరుగుతోందన్నారు. తూత్తుకుడి నగరంలో అనేక ప్రాంతాలు సాధారణ పరిస్థితులు చోటు చేసుకున్నాయి. శివారులలోని కొన్ని ప్రాంతాలు, మరికొన్ని గ్రామాలలో మాత్రమే నీళ్లు ఉండడంతో వాటిని తొలగించే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నగరంలో చెత్త పేరుకు పోయి ఉండడంతో రేయింబవళ్లు పారిశుధ్య కార్మికులు తొలగిస్తున్నారు.

నర్సుకు అవార్డు..

తూత్తుకుడిలో వరదల సమయంలో ఈనెల 18వ తేదీన ఆరోగ్య కేంద్రానికి చేరుకుని అత్యవసర పరిస్థితుల్లో ప్రసవానికి వచ్చిన నిండు గర్భిణికి వైద్యం అందించిన నర్సుకు అవార్డును అందజేయడానికి ఆరోగ్యశాఖ నిర్ణయించింది. తన మేన కోడలు రమ్యకు ప్రసవం రావడంతో అతి కష్టం మీద మోసుకుంటూ ఆరోగ్య కేంద్రానికి ఓ మామయ్య తీసుకొచ్చాడు. అప్పటికే ఆసుపత్రి పరిసరాలలో మోకాలు లోతు నీరు ఉండటంతో వైద్య సేవలు కష్టంగా మారాయి. ఆస్పత్రిలోకి సైతం నీళ్ల చేరడంతో అక్కడ విధులలో ఉన్న నర్సు జయలక్ష్మి, ఆయమ్మ విరాటి అమ్మల్ ఆ గర్భిణి వేదనను చూసి అతి కష్టంపై తామే ప్రసవం చేశారు. చుట్టు నీరున్నా, బెడ్‌లను ఎత్తుగా పేర్చి దానిపై ఆ గర్భిణిని పడుకోబెట్టి ప్రసవం చేశారు. పండంటి మగ బిడ్డకు ఆమె జన్మనిచ్చారు. ఆరోగ్య కేంద్రాన్ని వరదలు చుట్టుముట్టడంతో మూడు రోజుల పాటు ఆ తల్లి బిడ్డను కంటికి రెప్పలా నర్సు, ఆయమ్మ రక్షించారు. ఈ సమాచారం ఆరోగ్య శాఖ మంత్రి సుబ్రమణియన్ దృష్టికి చేరింది. దీంతో ఆ నర్సుకు ప్రభుత్వం తరపున అవార్డుకు సిఫారసు చేశారు.

బిడ్డకు ఎంపీ కనిమొళి పేరు..

తూత్తుకుడి శ్రీవైకుంఠంలో కొరుక్కై గ్రామంలో వరదలలో చిక్కుకుని ఓ గర్భిణి తీవ్ర అవస్థలు పడుతున్నట్టు ఎంపీ కనిమొళికి సమాచారం అందింది. దీంతో ట్రాక్టర్లో వెళ్లి ఆ గర్భిణిని రక్షించారు. ఆమె ఆడ బిడ్డకు జన్మించింది. ఈ బిడ్డను సోమవారం కనిమొళి పరామర్శించారు. ఈ సమయంలో ఆ కుటుంబ సభ్యులు బిడ్డకు కనిమొళి అని పేరు పెట్టాలని కోరారు. వారి విజ్ఞప్తి మేరకు తన పేరును కనిమొళి పెట్టారు. కాగా, ఏరల్లై గ్రామంలో తామర భరణీ ఉధృతిని గుర్తించిన ఆ గ్రామంలోని తహసీల్దార్‌తో పాటు సిబ్బంది ఆమేఘాలపై ప్రజలు అప్రమత్తం చేశారు. 2,400 మందిని సురక్షిత ప్రాంతాలకు తీసుకెళ్లి ఉండడంతో తహసీల్దార్‌కు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా, వరద బాధితుల సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు కుంద్రకుడి పొన్నంబల అడిగలార్ రూ. 5 లక్షలు అందజేశారు. సీఎం స్టాలిన్‌ను కలిసి ఈమేరకు చెక్కు అందజేశారు.

క్లుప్తంగా

పాము కాటుతో ఇద్దరు మహిళలు మృతి

• 43 మందికి అస్వస్థత

తిరువొత్తియూరు: నెల్‌లై, తూత్తుకుడి జిల్లాలలో వర్షం కారణంగా వరద నీటిలో కొట్టుకొచ్చిన పాములు కరిచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో 43 ఉంది అస్వస్థతకు గురయ్యారు. వివరాలు.. నెల్‌లై తూత్తుకుడి జిల్లాలలో కురిసిన భారీ వర్షం కారణంగా వరదలు ఏర్పడిన విషయం తెలిసిందే. దీని కారణంగా పలుచోట్ల పాములు నీటిలో కొట్టుకొచ్చి నివాస ప్రాంతంలో చొరబడ్డాయి. ఈ క్రమంలో నెల్‌లై, తూత్తుకుడి, తెన్‌కాశి జిల్లాల్లో ఈనెల 17వ తేదీ నుంచి 25వ తేదీ వరకు 45 మంది పాము కాటుకు గురై పాలయంకొట్టై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో తెన్‌కాశి జిల్లా వెల్లగౌండమ్ పట్టికి చెందిన అయ్యమ్మాల్ (53) చికిత్స పొందుతూ మృతి చెందారు. అలాగే తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠం ప్రాంతానికి చెందిన 60 ఏళ్ల మహిళ కూడా మరణించినట్లు అధికారులు సోమవారం వెల్లడించారు.

బస్సు ఢీకొని యువకుడు..

కొరుక్కుపేట: చెన్నైలోని అశోక్‌నగర్‌లో సిటీ బస్సు ఢీకొన్న యువకుడి అక్కడికక్కడే మృతి చెందాడు. చెన్నైలోని సాలిగ్రామానికి చెందిన ప్రకాశం (19). అతను ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. సిటీబస్సు ద్విచక్రవాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో ప్రకాశం అదుపుతప్పి కిందపడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం తిరువొత్తియూరుకు చెందిన బస్సు డ్రైవర్ శరవణన్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

చెరువు నీటిలో మునిగి మరొకరు..

తిరువొత్తియూరు: ఆవడి సమీపం ముత్తాపుదుపేట కథవూర్ ప్రాంతానికి చెందిన అరవింద్ (25) ఈనెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి తర్వాత తిరిగి రాలేదు. అతని కోసం బంధువులు పలుచోట్ల గాలించారు. కానీ అతని ఆచూకీ తెలియ రాలేదు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కదువూరు ప్రాంతంలోని ఓ చెరువులో యువకుడి మృతదేహం తేలుతున్నట్లు సమాచారం పోలీసులకు అందింది. ముత్తా పొదుపేట పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి.. అది అరవింద్‌గా గుర్తించారు. అనంతరం శవ పరీక్ష కోసం కీళ్పాకం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనవరి నుంచి కిలాంబాక్కంలో బస్సు సేవలు

• లక్ష మంది ప్రయాణికుల కోసం ఏర్పాట్లు
• రోజుకు 2,310 బస్సు సర్వీసులు
• మంత్రి శేఖర్‌బాబు వెల్లడి

సాక్షి, చెన్నై: కిలాంబాక్కం టెర్మినల్ నుంచి జనవరిలో బస్సుల సేవలకు శ్రీకారం చుడుతామని సీఎండీఏ చైర్మన్, దేవదాయ శాఖమంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు. లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించే విధంగా ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. అవి తుది దశకు చేరినట్లు పేర్కొన్నారు. రోజుకు 2310 బస్సులను ఇక్కడి నుంచి నడుపుతామన్నారు. వివరాలు.. చెన్నై కోయంబేడు బస్టాండ్‌కు ప్రత్యామ్నాయంగా నగర శివార్లలో సబర్బన్ బస్ టెర్మినల్స్‌పై సీఎండీఏ దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. ఇందులో మాధవరం సబర్బన్ బస్ టెర్మినల్ ఉపయోగంలోకి వచ్చేసింది. అలాగే పూందమల్లి సమీపంలో మరో సబర్బన్ టెర్మినల్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దక్షిణ తమిళనాడు వైపుగా వెళ్లే బస్సుల కోసం కిలాంబాక్కం భారీ టెర్మినల్ రూపుదిద్దుకుంది. దివంగత డీఎంకే అధినేత కరుణానిధి శత జయంతి స్మారకంగా ఆయన పేరిట ఈ టెర్మినల్ తీర్చిదిద్దారు. ఈ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ పనులను సోమవారం చెన్నై మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, హిందూ దేవదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి అన్బరసన్, చెంగల్పట్టు కలెక్టర్ రాహుల్ నాథ్ తదితర అధికారులు పరిశీలించారు. పనులను మరింత వేగవంతం చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు.


కిలాంబాక్కం టెర్మినల్‌ను పరిశీలిస్తున్న మంత్రులు శేఖర్‌బాబు, అన్బరసన్ తదితరులు

సీఎం చేతుల మీదుగా..

అనంతరం మంత్రి శేఖర్ బాబు మీడియాతో మాట్లాడుతూ, గత నెలన్నర రోజులుగా వర్షాల కారణంగా పనుల్లో కాస్త జాప్యం నెలకొందన్నారు. రేయింబవళ్లు ఇక్కడ వర్షపు నీటి కాలువల నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ బస్టాండ్ నుంచి రోజుకు 2,310 బస్సులను నడపనున్నామని, ఇందులో 840 ఆమ్నీ ప్రైవేటు బస్సులు కూడా ఉన్నట్లు తెలిపారు. రోజుకు లక్ష మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి బస్సుల సేవలు పొందేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు, ఏర్పాట్లు చేశామన్నారు. హోటళ్లు, మెడికల్ షాపులు కూడా ఏర్పాటు చేస్తున్నామని, డ్రైవర్లు, కండెక్టర్లకు విశ్రాంతి గదులు సిద్ధం చేశామన్నారు. జనవరిలో ఈ బస్టాండ్ ఉపయోగంలోకి వస్తుందన్నారు. సంక్రాంతి పర్వదినానికి ముందుగా ఈ బస్ టెర్మినల్‌ను సీఎం స్టాలిన్ ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రశ్నలకు సమాధానం ఇస్తూ, డీఎంకే ప్రభుత్వంపై తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ చేస్తున్న వ్యాఖ్యలపై స్పందించారు. ఆమె తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తే చాలు అని హితవు పలికారు. బాధ్యత గల పదవిలో ఉంటూ బీజేపీ అధికార ప్రతినిధి తరహాలో విమర్శలు, ఆరోపణలు గుప్పిస్తూ వస్తున్నారని మండిపడ్డారు. తన రాజకీయ భవిష్యత్తు కోసం ఆమె ప్రయత్నాలలో ఉన్నట్లున్నారని, తమిళనాడులో ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీకి దిగుతారని అయితే ఇప్పటికే ప్రజలు ఆమెను ఓడించారని చమత్కరించారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి సేవలు అజరామరం


తిరువళ్లూరు: వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తిరువళ్లూరు: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 99వ జయంతి వేడుకలను తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా బీజేపీ నేతలు సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. పూండి, తిరువళ్లూరు, ఆవడి తదితర ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అశ్విన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకరన్, ఆర్య శ్రీనివాసన్ పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించి మొక్కల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశ్విన్‌కుమార్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకుని పార్టీ కోసం పని చేయాలని రాజ్‌కుమార్ సూచించారు. పోఖ్రాన్ అణు పరీక్షలను నిర్వహించి రక్షణ విభాగంలో భారత్ సామర్థ్యాన్ని ప్రపంచ దేశాలకు వాజ్‌పాయి చాటిచెప్పారని గుర్తుచేశారు. అదేవిధంగా పూండీ, ఊత్తుకోట, పూందమల్లి, ఆవడి, అంబత్తూరు, గుమ్మిడిపూండీ, పొన్నేరితో పాటు పలు ప్రాంతాల్లోనూ వాజ్‌పేయి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అద్యక్షుడు అశ్విన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు లయన్ శ్రీనివాసన్, జయగణేష్, కోశాదికారి మధుసూధనన్, యూనియన్ అద్యక్షుడు సురేష్, పాండూర్ శేఖర్, జిల్లా ఉపాద్యాక్షుడు షన్ముగం, కార్యదర్శులు బాలాజీ, మోరాజీదేశాయ్ పాల్గొన్నారు.

పళ్లిపట్టులో..



పళ్లిపట్టు: వాజ్‌పేయ్ జయంతి సందర్భంగా పళ్లిపట్టులో సోమవారం బీజేపీ శ్రేణులు నివాళులర్పించారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వాజ్‌పేయ్ చిత్రపటానికి మండల బీజేపీ అధ్యక్షుడు బాలన్ పూలమాల వేసి నివాళులర్పించి స్వీట్లు పంచిపెట్టారు. ఇందులో ఆ పార్టీ మండల నాయకులు సుబ్రహ్మణ్యం, మునుస్వామి, వీరమణి, హేమలత, రవి, సహా అనేక మంది పాల్గొన్నారు. తిరుత్తణి,ఆర్కేపేట ప్రాంతాల్లో పార్టీ జెండాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రవర్తి నాయుడు పాల్గొన్నారు.

అమరవీరులకు మార్క్సిస్టుల ఘన నివాళి

కొరుక్కుపేట: నాగపట్నం జిల్లా కిల్వేలూర్ పక్కనే ఉన్న కెయిల్వేమణిలో 1968లో వేతనాల పెంపును నిరసిస్తూ భూ నిర్వాసితులు భారీగా ధర్నా చేశారు. ఈక్రమంలో మహిళలు, పిల్లలు సహా 44 వ్యవసాయ కూలీల కుటుంబాలను ఒకే ఇంటిలో బంధించి దుండగులు నిప్పంటించారు. ఈ ఘటన జరిగిన 55 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మార్క్సిస్టులు – కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కీలవెన్మణిలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద సోమవారం ఘన నివాళులర్పించారు. కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణన్, రాజకీయ నాయకత్వ కమిటీ సభ్యుడు జి. రామకృష్ణన్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సౌందరరాజన్ స్మారక స్థూపాన్ని సందర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాజర్, జిల్లా కార్యదర్శులు నాగై మరిముత్తు, ఎమ్మెల్యేలు చిన్న దురై, పళనిస్వామి, ధర్మకర్తల మండలి సభ్యులు సెల్వరాజ్, షణ్ముగం పూల మాలలు వేసి నివాళులర్పించారు.

బాలికకు లైంగిక వేధింపులు

తిరువొత్తియూరు: చెన్నై పులియన్‌తోపు ప్రాంతానికి చెందిన 35ఏళ్ల మహిళ పులియంతోపు మహిళ పోలీస్ స్టేషన్లో ఓ ఫిర్యాదు చేశారు. ఇందులో తన 15 ఏళ్ల కుమార్తె పదో తరగతి చదువుతుందని ఆమె పాఠశాలకు వెళ్తున్న సమయంలో కన్నిగాపురం రెండవ వీధికి చెందిన అజయ్ (23) లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అజయ్‌ని పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు.

లాడ్జి పై నుంచి దూకి ఉత్తరాది యువకుడి ఆత్మహత్య

తిరువొత్తియూరు: కొత్త చాకలిపేట నమ్మయ్య మేస్త్రి వీధిలో ఓ ప్రైవేటు లాడ్జి ఉంది. ఇందులో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన పలువురు ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయము ఉత్తరాది రాష్ట్రం యువకుడు ఒకరు మిద్దె పైనుంచి హఠాత్తుగా కిందకు దూకాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన అతడు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దీంతో కొత్త చాకలిపేట పోలీసులు అక్కడి చేరుకొని విచారణ చేపట్టారు. కాగా అతను ఎవరు ? ఏ ప్రాంతానికి చెందిన వాడు అనే విషయం తెలియ రాలేదు.

బీఎస్ఎన్ఎల్ సహాయ ఇంజినీరు దారుణ హత్య

• మొదటి భార్య అరెస్టు

తిరువొత్తియూరు: తిరుచి జిల్లా తురైయూరు సమీపంలో బీఎస్ఎన్ఎల్ సహాయ ఇంజనీరును ఆయన మొదటి భార్య హత్య చేసింది. దీనిపై రెండవ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితురాలిని అరెస్టు చేశారు. వివరాలు.. తిరుచి జిల్లా తురయూరు సమీపంలోని దేవాంగర్ నగరంలో నివాసం ఉంటున్న తిరుమలై కుమారుడు అన్నాదురై (55). ఇతను తురయూరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సహాయ ఇంజనీర్‌గా పని చేస్తూ ఉన్నాడు. ఇతనికి మొదటి భార్య పద్మిని(50), రెండవ భార్య లలిత (45) ఉన్నారు. వీరిద్దరూ ఒకే ఇంటిలో నివాసం ఉంటున్నారు. మద్యం అలవాటు ఉన్న అన్నాదురై తరచూ మద్యం తాగి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పద్మినితో ఘర్షణ పడ్డాడు. దీంతో ఆగ్రహించిన పద్మిని అన్నాదురైని కిందకు తోయడంతో అతను స్పృహ తప్పాడు. వెంటనే నైలాన్ దారంతో భర్త గొంతును బిగించి వేయడంతో అతను అదే చోట మృతి చెందాడు. దీనిపై రెండో భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు తురయూరు పోలీసులు హత్య కేసు నమోదు చేసి పద్మినిని అరెస్టు చేశారు. అనంతరం అన్నాదురై మృతదేహం స్వాధీనం చేసుకుని తురయూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.


నీటి విడుదల

ఈరోడ్ జిల్లా భవానీ కళింగరాయన్ డ్యామ్ నుంచి రెండో కారు పంట కోసం సోమవారం నీటిని మంత్రి ముత్తుసామి విడుదల చేశారు. కలెక్టర్ రాజగోపాల్ సుంకర పర్యవేక్షించారు. ఎంపీపీలు గణేశమూర్తి, ఆండియూర్ సెల్వరాజ్ పాల్గొన్నారు. - సేలం

చిరో చిత్ర షూటింగ్ పూర్తి

తమిళ సినిమా: మిలియన్ స్టూడియోస్ పతాకంపై ఎమ్మెస్ మన్సూర్ నిర్మిస్తున్న చిత్రం చిరో. మలయాళంలో పదినెట్టాంబడి, వాలాట్టి లాంటి సక్సెస్ ఫుల్ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు పొందిన అక్షయ్ రాధాకృష్ణన్ ప్రధానపాత్రను పోషించిన ఇందులో నటి ప్రార్థన సాబ్రియా నాయకిగా నటించారు. రోహిణి, పోర్‌తొళిల్ చిత్రం ఫేమ్ లిషా చిన్ను, సూపర్ డీలక్స్ చిత్రం ఫేమ్ నోబల్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించిన విచిత్రానికి కథ దర్శకత్వం బాధ్యతలను వివేక్ రాజారాం నిర్వహిస్తున్నారు. ఇంతకుముందు పలు వాణిజ్య చిత్రాలకు దర్శకత్వం వహించారన్నది గమనార్హం. ఈ చిత్ర వివరాలను నిర్మాత ఎమ్మెస్ మన్సూర్ తెలుపుతూ ఇది తమ సంస్థ నిర్మిస్తున్న రెండవ చిత్రం అని చెప్పారు. ఈ ఏడాది అక్టోబర్ 27న చిత్ర షూటింగ్ ప్రారంభించినట్లు, చెన్నై కోవలం, పిచ్చావరం, పాండిచ్చేరి, చిదంబరం తదితర ప్రాంతాల్లో 45 రోజులు షూటింగ్ నిర్వహించి పూర్తి చేసినట్లు చెప్పారు. సరైన ప్రణాళిక, చిత్ర యూనిట్ సహకారంతో చిత్రాన్ని ముందుగా నిర్ణయించిన విధంగా షూటింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. చిత్రం కమర్షియల్ అంశాలతో జనరంజకంగా ఉంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం చిత్ర నిర్మాణాంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, దీన్ని 2024 ఫిబ్రవరిలో విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి అశ్విన్ ఆర్యన్ సంగీతాన్ని అందిస్తున్నారు.


చిరో చిత్ర యూనిట్ సభ్యులు

కోలీవుడ్ టాక్స్

అయలాన్ ట్రైలర్.. దుబాయ్‌లో.!


అయలాన్ చిత్రంలో శివకార్తికేయన్, రకుల్ ప్రీత్ సింగ్

తమిళ సినిమా: శివకార్తికేయన్, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటించిన చిత్రం అయలాన్. ఇషా గోపిక ముఖ్యపాత్రను పోషించిన ఈ చిత్రాన్ని కేసీఆర్ స్టూడియోస్, 24 ఏఎం స్టూడియోస్ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. సోషియో సైంటిఫిక్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రానికి రవికుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం 2018లోనే ప్రారంభమైంది. అయితే అనివార్య కారణాల వల్ల చాలా కాలం నిర్మాణంలో ఉన్న అయలాన్ చిత్రాన్ని ముందు దీపావళి సందర్భంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. అయితే గ్రాఫిక్స్ పూర్తి కాకపోవడంతో విడుదల తేదీని పొంగల్‌కు వాయిదా వేశారు. దీంతో ఇప్పుడు ఈ చిత్రం పొంగల్ రేసులో ఉంటుందా లేదా అనే చర్చ జరుగుతోంది. ఈ ప్రచారంపై చిత్ర నిర్మాతలు ఇంకా స్పందించలేదు. అదే సమయంలో చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని జనవరి 7న దుబాయిలో భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు సమాచారం. కాగా సోమవారం క్రీస్తు జన్మదినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా క్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాగా అయలాన్ చిత్ర కథానాయకుడు శివకార్తికేయన్ ఈ చిత్రంలో కీలక పాత్రధారి అయిన ఏలియన్ ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఫొటో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.


విజయ్ 68లో నీలాంబరి


నటి రమ్యకృష్ణ

తమిళ సినిమా: విజయ్ తాజాగా నటిస్తున్న చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. విజయ్ తండ్రి కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ క్రేజీ చిత్రాన్ని ఏజీఎస్ సంస్థ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కాగా ఈ చిత్రంలో భారీ తారాగణమే నటిస్తున్నారు. ఇప్పటికే నటుడు మైక్ మోహన్, ప్రశాంత్, ప్రభుదేవా, నటి స్నేహ, లైలా, మీనాక్షి చౌదరి, జయరాం, యోగిబాబు కిచ్చ సుదీప్ వంటి ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. జీవన్ శంకర్ రాజా సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చెన్నైలో ప్రారంభమై థాయిలాండ్ టర్కీ, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటోంది. తాజాగా హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. తదుపరి షెడ్యూల్ క్రిస్మస్ పండగ తర్వాత జనవరి మొదటి వారంలో ప్రారంభం కానుందని సమాచారం. కాగా తాజాగా ఈ చిత్రంలో మరో స్టార్ నటి నటించనున్నారు. పడయప్పా చిత్రంలో నీలాంబరిగా రజనీకాంత్‌తో పోటీపడి నటించిన రమ్యకృష్ణ ఈ చిత్రంలో ముఖ్య భూమిక పోషించనున్నారు. ఈ విషయం గురించి రమ్యకృష్ణనే తన ఎక్స్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇలయ దళపతి 68వ చిత్రంలో తాను భాగం పంచుకోవడం సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా నటుడు విజయ్‌కి దర్శకుడు వెంకట్ ప్రభుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో విజయ్ కథానాయకుడిగా రూపొందుతున్న ఈ చిత్రంపై సినీ పరిశ్రమలోనూ, ఆయన అభిమానుల్లోనూ భారీ అంచనాలు మరింత పెరిగాయి.

త్వరలో తెరపైకి 'సల్లియర్‌గళ్'

తమిళ సినిమా: ఐసీడబ్ల్యూ పతాకంపై కలైమామణి సేతు కరుణాస్, కరికాలన్ కలసి నిర్మించిన చిత్రం సల్లియర్‌గళ్. మెదక్ చిత్రం సేమ్ కిట్టు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నటి సత్య దేవి ప్రధాన పాత్ర పోషించగా, నటుడు కరుణాస్, కలవాని చిత్రం ఫేమ్ తిరుమురుగన్, మహేంద్రన్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. దీనికి వైరముత్తు పాటలను, కరుణాస్ కొడుకు, నటుడు కెన్ అతని మిత్రుడు ఈశ్వర్ కలిసి సంగీతాన్ని అందించారు. కాగా నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబ్ అవుతుంది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో నామ్ తమిళర్ పార్టీ నిర్వాహకుడు సీమాన్, నిర్మాత కలైపులి ఎస్. థాను, శివ కిలారి, పీఎల్.తేనప్పన్, దర్శకుడు పాన్ రామ్, వీ.గౌతమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నామ్ తమిళర్ పార్టీ నిర్వాహకుడు సీమాన్ మాట్లాడుతూ సల్లియర్‌గళ్ ఒక చిత్రం కాదనీ, చరిత్ర అనీ పేర్కొన్నారు. వేర్లు కోల్పోయిన వృక్షం, చరిత్రను మరిచిపోయిన జాతి జీవించలేదన్నారు. తమిళ జాతి చరిత్రను కాపాడుకుంటే భవిష్యత్తును కోల్పోమన్నారు. తిరిగిన దానికంటే చదివింది మేలన్నారనీ, అందుకే తమ నేత మెదక్కు ప్రభాకరన్ అన్నింటినీ భద్రపరిచారని పేర్కొన్నారు. అయితే యుద్ధ సమయంలో అవన్నీ బాధింపునకు గురయ్యారని చెప్పారు. ఆయనకు ఒక బలమైన కోరిక ఉండేదనీ, బ్రేవ్ హార్ట్స్ టెన్ కమాండర్స్ చిత్రాల తరహాలో మన విడుదలై పోరాటం చరిత్ర కూడా చిత్రంగా రావాలని ఆయన ఆశపడ్డారన్నారు. అలా ఆయన ఆనివేర్ అనే చిత్రాన్ని రూపొందించారని అయితే మన నాయకుడు చిత్ర పోస్టర్లను ముద్రించగానే ఇక్కడ పోలీసులు వాటిని చించేశారని ఇక్కడ రాజకీయ పరిస్థితి అలాంటి దని పేర్కొన్నారు. ఈ పరిస్థితి మారాలని దర్శకుడు చెప్పినట్టుగా ప్రభాకరన్ జీవిత చరిత్రను చిత్రంగా రూపొందించాలన్నారు. తమిళ అమరవీరుల చరిత్ర తెలిపే ఒక భాగమే ఈ సల్లియర్‌గళ్ చిత్రం అని సీమాన్ పేర్కొన్నారు.


సల్లియర్‌గళ్ చిత్ర యూనిట్

టాప్ హీరో, హీరోయిన్లకు చెక్



తమిళ సినిమా: కాలంతోపాటు సినిమాను రూపాంతరం చెందుతోంది అనడంలో ఎలాంటి సందేహం ఉండదు. జయాపజయాలను బట్టి చిత్ర నటీనటులు, సాంకేతిక వర్గం స్థాయి ఉంటుంది. ముఖ్యంగా ఒక చిత్రం హిట్ అయితే అందులో నటించిన హీరో హీరోయిన్లు ఒకసారిగా రెమ్యూనరేషన్ పెంచేస్తారన్నది తెలిసిన విషయమే. కాగా ప్రస్తుతం దీనికి చెక్ పెట్టే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పుడు సినిమాను కార్పొరేట్ సంస్థలే ఏలుతున్నాయని చెప్పవచ్చు. దీంతో పలు పాత చిత్ర నిర్మాణ సంస్థలు తెరమరుగు అవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కార్పొరేట్ సంస్థలు స్టార్ హీరో హీరోయిన్ల కు చెక్ పెడుతున్నట్లు సమాచారం. సాధారణంగా స్టార్ హీరోయిన్లు నటించిన కొన్ని చిత్రాలు బాక్సాఫీస్‌ను బద్దలు కొడుతాయి. దీంతో అలాంటి నటీనటులను బాక్సాఫీస్ గాడ్స్‌గా భావిస్తున్నారు. నిజానిజాల మాట అటు ఉంచితే ఇటీవల ఒక హీరో నటించిన చిత్రం వసూళ్లు రూ. 500 కోట్లు దాటినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో అలాంటి స్టార్స్‌కు క్రేజ్ పెరుగుతుంది. చిత్రాల బాక్సాఫీస్ కలెక్షన్స్ బట్టి హీరో హీరోయిన్లు తమ రెమ్యూనిరేషన్‌ను పెంచుకుంటూ పోతున్నారు. ఇందుకు కారణం కార్పొరేట్ సంస్థలే. సాటిలైట్, ఓటీటీ సంస్థలు ఇచ్చే డబ్బుతోనే నిర్మాతలు హీరో హీరోయిన్లకు రెమ్యునరేషన్‌లు పెంచేస్తున్నారు. ప్రస్తుతం లేడీస్ సూపర్ స్టార్‌గా వెలుగొందుతున్న నటి నయనతార కూడా రూ.10 కోట్లకు పైగా పారితోషికాన్ని డిమాండ్ చేస్తున్నారని సమాచారం. అంతేకాకుండా ఈమె తన చిత్రాలకు ప్రమోషన్ కార్యక్రమాల్లో కూడా పాల్గొనేది లేదనే పలు కండిషన్లు పెడుతున్నారు. అయినా కానీ ఆమె మార్కెట్ తగడం లేదు. ఇలాంటి వారికి తాజాగా కార్పొరేట్ సంస్థలు చెక్ పెట్టాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. 20 శాటిలైట్ హక్కులను, ఓటిటీ స్ట్రీమింగ్ హక్కులను ఇకపై అధిక రేట్ చెల్లించరాదని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. దీంతో స్టార్ హీరో హీరోయిన్ల పారితోషికం తగ్గే అవకాశం ఉన్నందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి

తిరువొత్తియూరు: తూత్తుకుడిలో విద్యుత్ వైరు మరమ్మతు చేస్తున్న సమయంలో విద్యుతాఘాతానికి గురై లైన్‌మన్ మృతి చెందాడు. తూత్తుకుడి అంబేద్కర్ నగర్‌కు చెందిన మురుగన్(42) విద్యుత్తు కార్యాలయంలో లైన్‌మన్‌గా పనిచేస్తూ ఉన్నాడు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా విద్యుత్తు కనెక్షన్లు అక్కడక్కడ తెగిపోయి ఉన్నాయి. వేర్వేరు ప్రాంతాల్లో వీధిలైట్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో మురుగన్ కొన్ని రోజులుగా ఆ ప్రాంతంలో మరమ్మతు కాబడిన వీధిలైట్లు సరి చేస్తూ ఉన్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఇతను కృష్ణరాజపురం 5వ వీధిలో ఉన్న విద్యుత్ స్తంభం పైకి ఎక్కి మరమ్మతు చేస్తున్నాడు. ఆ సమయంలో షాక్ కొట్టి మురుగన్ అదే చోట మృతి చెందాడు. దీనిపై సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అతని మృత దేహాన్ని కిందకు దింపి, శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మోసం కేసులో ఇద్దరి అరెస్టు

తిరువొత్తియూరు: అప్పు తీసిస్తామని చెప్పి రూ.86 లక్షలు మోసం చేసిన కేసులో మహిళతో సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై కొడుంగయూరు కామరాజ రోడ్డుకు చెందిన కృష్ణకుమార్(43) ప్రైవేటు ఎగుమతి సంస్థ నడుపుతున్నాడు. ఇతను చెన్నై కార్పొరేషన్ పోలీస్ కమిషనరేట్లో ఓ ఫిర్యాదు చేశాడు. అందులోని తన వృత్తిని అభివృద్ధి చేయడం కోసం విల్లివాక్కంకు చెందిన ముత్తువేల్ అనే లయన్ ముత్తువేల్‌ను సంప్రదించి రూ.25 కోట్లు అప్పు తీసి ఇవ్వమని తాను కోరాను. అందుకు మూడు దఫాలుగా అతనికి రూ.86 లక్షలు నగదు ఇచ్చాను. కానీ ముత్తు వేలు చెప్పిన ప్రకారం అతను తనకు అప్పు తీసి ఇవ్వలేదు. పైగా ఇచ్చిన నగదును తిరిగి ఇవ్వలేదు. ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టమని నందంబాక్కం పోలీసులకు చెన్నై కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నందంబాక్కం పోలీసు ఇన్‌స్పెక్టర్ ధనరాజు నేతృత్వంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. తర్వాత రూ.86 లక్షలు మోసం చేసిన విల్లివాక్కంకు చెందిన లయన్ ముత్తువేల్(45), అతనికి సహకారం అందించిన నంగనల్లూరు, నెహ్రూ కాలనీకి చెందిన ఏంజలీనా క్రిస్టియానిషా(43)ను పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరి వద్ద విచారణ చేస్తూ ఉన్నారు.

కొడుకు చనిపోవడంతో తల్లి ఆత్మహత్య

కొరుక్కుపేట: ఆవడిలోని కామరాజ్ నగర్‌కు చెందిన బలరామన్ భార్య మణిమేగలై(55). కుటుంబ కలహాలతో వీరి కుమారుడు మురళి రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. మణిమేగలై తన కొడుకును కోల్పోయిన తర్వాత చాలా ఆందోళన చెందింది. బంధువులు ఓదార్చినా.. కొడుకు మృతిని తట్టుకోలేకపోయింది. దీంతో ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు రోజుల క్రితం బలరామన్ తిరునల్లారు ఆలయానికి ఒంటరిగా వెళ్లాడు. మణిమేగలై మాత్రమే ఇంట్లో ఒంటరిగా ఉంది. ఈ స్థితిలో బలరామన్ ఇంటికి తిరిగి వచ్చేసరికి అప్పటికే తాను ఉంటున్న గది కిటికీకి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉండడాన్ని చూసి షాక్‌కు గురయ్యారు. దీనిపై ఆవడి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతున్నారు.

రేపు గంగమ్మ ఆలయంలో బహిరంగ వేలం

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఈ నెల 27వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మమత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు, రవికెల సేకరణ లీజు హక్కు, అమ్మవారి ఫొటోలు, కీ చైన్లు వగైరాలు విక్రయానికి కౌలు హక్కు కల్పించనున్న సందర్భంగా ఈ బహిరంగ వేలం పాట చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ లీజు హక్కు డిసెంబర్ 27 నుంచి 2024 డిసెంబర్ 26వ తేదీ వరకు ఏడాదిపాటు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు దేవస్థానం కార్యాలయం పనివేళల్లో సంప్రదించి వివరాలు పొందవచ్చని తెలిపారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడి అభయం




తిరుచ్చిపై భక్తులను దర్శనిమిస్తున్న శ్రీకృష్ణ సమేత రుక్మిణి సత్యభామ

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో బంగారు తిరుచ్చిపై రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం శ్రీకృష్ణ స్వామివారి జన్మనక్షత్రమైన రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేక సేవను చేపట్టి, స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలకరించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకార శోభితులైన స్వామి, అమ్మవార్లు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రుక్మిణి సత్యభామ సమేత తిరుచ్చిపై కొలువైన దేవేరులను దర్శించుకున్న భక్తులు, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రబలుతున్న డెంగీ

- రాష్ట్ర వ్యాప్తంగా దోమల నిర్మూలన చర్యలు ముమ్మరం



కొరుక్కుపేట: తమిళనాడు వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించింది. వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఫ్లూ కేసులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా డెంగీ వ్యాధిని వ్యాపింపజేసే ఏడిస్ ఈజిప్టి దోమలు విపరీతంగా ఉత్పత్తి అవుతూ వ్యాధిని వ్యాప్తి చేస్తున్నాయి. ప్రజా సంక్షేమ శాఖ లెక్కల ప్రకారం తమిళనాడులో 8,400 మందికి పైగా డెంగీ జ్వరం బారిన పడగా, 10 మంది మరణించారు. అందుకనుగుణంగా ప్రజా సంక్షేమ శాఖ రాష్ట్రవ్యాప్తంగా వ్యాధుల నివారణ, దోమల నిర్మూలన కార్యక్రమాలను చేపడుతోంది. ఈ పరిస్థితిలో, ప్రజారోగ్య శాఖ ద్వారా ఆ శాఖ సహ-డైరెక్టర్‌లకు కొన్ని సూచనలు పంపించారు. తమిళనాడులో డెంగీ వ్యాప్తి చెందకుండా అనేక ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ విధంగా దోమల నిర్మూలన కార్యక్రమాలను సమగ్రంగా చేపట్టాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో దోమల నివారణ చర్యలు అభివృద్ధి చెందితే, దాని ఉత్పత్తిని నిరోధించవచ్చు అని పేర్కొంది. నిరుపయోగంగా ఉన్న టైర్లు, ట్యూబులు, ట్యాంకులు తొలగించడంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఆసుపత్రుల్లో దోమల నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, ప్రభుత్వ భవనాల్లో వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

మామ హత్య కేసులో అల్లుడి అరెస్టు

తిరువొత్తియూరు: విల్లుపురం జిల్లాలో మామను హత్య చేసిన అల్లుడిని పోలీసులు అరెస్టు చేశారు. విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపములో ఉన్న వేలి వందాంగల్ గ్రామానికి చెందిన ఆరుముగం (50) తన చిన్న కుమార్తె కౌసల్యను బెంగళూరుకు చెందిన పండ్ల వ్యాపారి కేశవన్‌కు ఐదేళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశాడు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. బెంగళూరులో ఉంటున్న కేశవన్ మద్యం మత్తులో భార్య కౌసల్యతో తరచూ గొడవలు చేస్తున్నట్లు తెలిసింది. విరక్తి చెందిన కౌసల్య కోపగించుకుని తన తల్లి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కేశవన్ మద్యం మత్తులో విక్రవాండికి సమీపంలో ఉన్న మామ ఇంటికి వచ్చి భార్యను బిడ్డలను బెంగళూరుకు తీసుకెళ్తానని చెప్పాడు. పైగా వెంటనే బెంగళూరుకు బయల్దేరాలని భార్య, మామతో గొడవ చేశాడు. ఒక దశలో మామతో గొడవ చేసి ఇంటిలో ఉన్న కర్రతో ఆర్ముగంపై దాడి చేశాడు. తీవ్ర గాయమైన ఆయన అదే చోట మృతి చెందాడు. దీనిపై ఫిర్యాదు మేరకు కంజనూరు పోలీసులు కేసు నమోదు చేసి, కేశవన్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద విచారణ చేస్తూ ఉన్నారు.

ఆటోలో రూ.5 లక్షలు స్వాధీనం



రికవరీ చేసిన డబ్బును అప్పగించిన పోలీసులు

కొరుక్కుపేట: చెన్నై వలసరవాక్కం ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి విశ్వనాథన్(51). ఇతను తన సోదరి కుమారుడికి విదేశాల్లో ఉద్యోగం ఇప్పించేందుకు స్నేహితుడి వద్ద అప్పు తీసుకునేందుకు కోయంబేడుకు వచ్చాడు. స్నేహితుడి నుంచి డబ్బు అందుకున్న విశ్వనాథన్ తన భార్యతో కలిసి కోయంబేడు మార్కెట్‌కు వెళ్లి పండ్లు కొనుక్కున్నాడు. ఆ తర్వాత డబ్బు ఉన్న బ్యాగ్ కనిపించకపోవడంతో షాక్‌కు గురయ్యారు. ఈ విషయమై పోలీస్ కంట్రోల్ రూంకు ఇచ్చిన సమాచారం మేరకు కోయంబేడు పోలీసులు వెంటనే వచ్చి పరిశీలించారు. కోయంబేడు పోలీసుల ఫిర్యాదు మేరకు మేజర్ క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ నేతృత్వంలో పోలీసులు ఆ ప్రాంతంలోని 50కి పైగా నిఘా కెమెరాలను పరిశీలించారు. తర్వాత ఆటోలో విశ్వనాథన్ అతని భార్య ప్రయాణిస్తున్న దృశ్యాన్ని రికార్డ్ చేసి, ఆ ఆటో నంబర్‌తో కోయంబేడు మార్కెట్ సమీపంలో ప్రయాణికులను దించిన ఆటోను పోలీసులు గుర్తించగా, అందులో తప్పిపోయిన డబ్బు కనిపించింది. ఇదేమిటని ఆటోడ్రైవర్‌ని అడగ్గా ఆటోలో ఎక్కిన జంట బ్యాగ్ మరిచిపోయారని తెలిపారు. దీంతో ఇన్‌స్పెక్టర్ రాజేష్ విచారించి అతన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి అందులో ఉంచిన 5 లక్షల 9 వేల నగదును అందజేశారు. రూ.5 లక్షల 9 వేల రూపాయలను సురక్షితంగా రికవరీ చేసినందుకు పోలీసులకు ధన్యవాదాలు తెలియజేశారు.

సహాయకాల పంపిణీ



పళ్లిపట్టు: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆర్కేపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ఐవీ రోగులకు వైద్యులు పౌష్టికాహారం అందజేసి అవగాహన కల్పించారు. ఆల్ ది చిల్డ్రన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో మండల వైద్యాధికారి డాక్టర్ తమిళ్‌సెల్వన్ పాల్గొన్నారు.

కారు, నగదు, సెల్‌ఫోన్ అపహరణ

- ఏడుగురి అరెస్టు, నలుగురి కోసం గాలింపు

తిరువొత్తియూరు: యువకులపై కమ్మీలతో దాడి చేసి కారు, నగదు, సెల్‌ఫోన్‌లను అపహరించిన ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురు కోసం గాలిస్తూ ఉన్నారు. కేరళ ఆలప్పులకు చెందిన జబన్ జాకబ్(27) మెడికల్ షాపు ఉద్యోగి. ఇతని స్నేహితుడు డేనియల్ (28) వీరు తేనే జిల్లా కూడలూరులో ఉన్న ఒక స్థలం కొనాలని చూసి రావడానికి శనివారం రాత్రి కారులో వచ్చారు. వీరితో స్నేహితులు అజోయ్, జాన్సన్ తదితరులు ఉన్నారు. కూడలూరుకు వచ్చిన తర్వాత అజోయ్ ఫోన్ ద్వారా ఒకరిని సంప్రదించాడు. అతను వారిని అక్కడ వున్న పెట్రోల్ బంకు ముందుకు రమ్మని చెప్పాడు. కొద్ది సమయం తర్వాత కూడలూరుకు చెందిన మరుదు పాండియన్ అనే అతను బైక్‌లో వచ్చి అజోయి, జాన్సన్ అనే ఇద్దరిని మాత్రం కారులోంచి దింపి ఇక్కడే ఉండమని చెప్పి. జబన్ జాకబ్, డేనియల్ అనే ఇద్దరిని కారును తీసుకుని రమ్మని చెప్పాడు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఒక తోట వద్దకు బైకు వెళ్లింది. వెనకనే కారు వెళ్లింది. ఆ సమయంలో తోటలో దాగి ఉన్న కొందరు జబన్ జాకబ్, డేనియల్ ఇద్దరిని కారు నుంచి దింపి వారిపై ఇనుప కమ్మీలతో దాడి చేసి ఫోన్లు, వాచ్, కారులో ఉన్న రూ. 40,000 తో సహా డేనియల్ సెల్‌ఫోన్ అకౌంట్ నుంచి 30 వేల రూపాయలు వేరే ఒక అకౌంట్‌కు మార్పిడి చేసుకున్నారు. పోలీసులకు తెలిపితే హత్య చేస్తామని బెదిరించి, ద్విచక్ర వాహనంలో వచ్చిన మరుదుపాండి వారితో కారులో తప్పించుకొని పారిపోయాడు. దీని గురించి కూడలూరు నార్త్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కూడలూర్‌కు చెందిన మరుదు పాండి(37), గోవిందరాజు(46), సెల్వ(46), మహేశ్వరన్ (36), భారతిరాజా(35), మహేష్(41), పిచ్చైయ్య(65) అనే ఏడుగురిని ఆదివారం అరెస్టు చేశారు. పైగా పరారీలో ఉన్న నలుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వారపు సంతలో భోజనాలు



భోజనాలు వడ్డిస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

పాకాల: ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో నిర్వహిస్తున్న వారపు సంతలో రైతులు, వ్యాపారస్తులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఉచితంగా భోజనాలను అందజేశారు. సోమవారం స్థానిక నాయకుల చేతుల మీదుగా భోజనాలను సరఫరా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు, సన్న, చిన్నకారు రైతులు, వ్యాపారులు భోజనాలకు ఇబ్బంది పడకూడదని, అందరూ బాగుండాలనే ఉద్దేశంతో భోజనాలను సరఫరా చేస్తున్నారని వివరించారు. పాకాలతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగే వారపు సంతల్లో భోజనాలను సరఫరా చేస్తున్నారని వివరించారు. అన్ని సమయాల్లో తమకు అండగా ఉండే ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉంటామని, రాబోయే ఎన్నికల్లో వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చాటిచెప్పారు.

తిరుచ్చి విమానాశ్రయంలో కొత్త టెర్మినల్

- జనవరి 2న ప్రారంభించనున్న ప్రధాని

తిరువొత్తియూరు: తిరుచ్చి విమానాశ్రయంలో ఆధునిక సౌకర్యాలతో కట్టబడిన కొత్త టెర్మినల్‌ను జనవరి 2వ తేదీన ప్రధానమంత్రి మోడీ ప్రారంభించనున్నారు. తిరుచ్చి విమానాశ్రయంలో రూ.1,100 కోట్ల ఖర్చుతో ఆధునిక సౌకర్యాలతో కొత్త టెర్మినల్‌ను నిర్మించారు. 134 ఎకరాల 75 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కట్టబడి ఉన్న ఈ టెర్మినల్‌లో 4 ప్రవేశ ద్వారాలు, 12 మార్గాలను ఏర్పాటు చేశారు. అలాగే ప్రయాణికులు బయటకు వెళ్లుటకు 4 మార్గాలు ఉన్నాయి. స్వదేశీ ప్రయాణికులు లగేజీలను తనిఖీ చేయుటకు 3 ఎక్స్‌రే యంత్రాలు, విదేశీ ప్రయాణికులను తనిఖీ చేయుటకు 4 ఎక్స్‌రే యంత్రాలు ఏర్పాటు చేశారు. ప్రయాణికుల లగేజీలను విమానం నుంచి తీసుకురావడానికి, టెర్మినల్ నుంచి విమానం వద్దకు తీసుకెళ్లడానికి ఆరు కన్వేయర్ బెల్ట్‌లు అమర్చారు. ప్రయాణికుల ఇమ్మిగ్రేషన్ తనిఖీలకు 58 కౌంటర్లు నిర్మించారు. ప్రయాణికులు విమానంలో నుంచి దిగి నేరుగా విమానాశ్రయానికి వచ్చుటకు 10 మార్గాలు ఏర్పాటు చేశారు. విమానాశ్రయం నుంచి బస్సులలో ప్రయాణికులను తీసుకువెళ్లుటకు రెండు మార్గాలు ఉన్నాయి. ప్రస్తుతం నిర్మించబడిన ఈ విమానాశ్రయంలో ఒకే సమయంలో స్వదేశీ ప్రయాణికులు 1500 మంది, విదేశీ ప్రయాణికులు 4,000 మంది కూర్చుని ఉండేందుకు సౌకర్యం కలిగి ఉంది. 750 కార్లు నిలుపుటకు పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. పైగా ఆధునిక విధానంలో విమానాలను వాటి పరిధిలో నిలుపుట కోసం ఏర్పాటు చేశారు. ఈ పనులన్నీ 93% పూర్తయ్యాయి. ఈ క్రమంలో విమానాశ్రయం కొత్త టెర్మినల్‌ను జనవరి నెల 2 తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా భద్రత ఏర్పాట్లు తీవ్రంగా చేస్తున్నవారు. వ్యాపారులు, విమానాశ్రయం చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాల్లో సెంట్రల్ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఈ కార్యక్రమం జరిగే సమయం, అందులో పాల్గొనే వారి వివరాలు త్వరలో తెలుపబడుతాయని తెలిసింది.

నిప్పు అంటించుకుని మహిళ ఆత్మహత్య

తిరువొత్తియూరు: కుటుంబ సమస్యల కారణంగా కార్పొరేషన్‌కు చెందిన పార్కులో మహిళ ఒకరు పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. చెన్నై జాఫర్ ఖాన్ పేటకు చెందిన ఉష(55). మామూలుగా జాఫర్ ఖాన్ పేటలో ఉన్న కార్పొరేషన్‌కు సొంతమైన పార్కుకు వాకింగ్ చేయడానికి వస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పార్కులో వాకింగ్ చేస్తూ ఉన్నారు. పార్కులో మనుషులు లేని సమయంలో తను తీసుకువచ్చిన పెట్రోల్‌ను ఉష తన ఒంటిపై పోసుకొని నిప్పు పెట్టుకున్నారు. మంటలు తాళలేక ఆమె కేకలు వేసింది. ఇది చూసిన ప్రజలు మంటలు ఆర్పారు. అప్పటికే పూర్తిగా కాలిపోయిన ఉష కొద్ది సమయానికి మృతి చెందారు. ఎంజీఆర్ నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఉష మృతదేహాన్ని శవపరీక్ష కోసం రాయపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత ఆత్మహత్య గురించి పోలీసులు విచారణ చేయగా ఉషాకు ఆమె కుటుంబ సభ్యులకు మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని, ఆమె పలుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలిసింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఆమెను కాపాడారని, ఈ క్రమంలో ఆమె పార్కుకు వచ్చి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలియవచ్చింది.

వరద బాధిత విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

తిరువొత్తియూరు: పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి గురు కుమరన్ ఒక ప్రకటన విడుదల చేశారు. అందులోని వివరాలు... రాష్ట్రంలో దక్షిణ ప్రాంతంలోని కన్యాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి జిల్లాలలో పలు చోట్ల భారీ వర్షం కారణంగా వరదలు సంభవించాయి. ఈ క్రమంలో వరదల కారణంగా బాధింపబడిన ప్రాంతాలను పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి తనిఖీ చేశారు. అతని సలహా మేరకు ఈ జిల్లాల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల విద్యా విధానం బాధింపు లేకుండా పాఠ్యపుస్తకాలను, నోట్ పుస్తకాలను, సంచులను, అదనంగా రెండు జతల ఉచిత యూనిఫాం అందజేయాలని ఆదేశించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జిల్లాల నుంచి పొందవచ్చు అని ఈ ప్రకటనలో తెలిపారు.

తెలుగు బాప్టిస్టు సంఘంలో సంబరాలు



వేపేరి మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు సంఘంలో క్రిస్మస్ వేడుకలు

కొరుక్కుపేట: చెన్నై వేపేరిలో 145 సంవత్సరాల చరిత్ర కలిగిన మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు సంఘంలో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ ఎస్.రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించి క్రిస్మస్ ఆరాధన, వాక్య పరిచర్య చేశారు. ఆయన దైవ సందేశాన్ని ఇస్తూ మానవాళిని రక్షించడానికి యేసు క్రీస్తు మానవుడిగా పుట్టిన రోజును క్రిస్మస్ పండుగగా జరుపుకుంటారని ఉపదేశించారు. క్రిస్మస్ అంటేనే వెలుగుల పండుగ, మానవుని జీవితాల్లోకి వెలుగు ప్రకాశింపజేసే గొప్ప పండుగ అని, కుల మతాలు, భాషలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ జరుపుకొనే ఏకైక పండుగ క్రిస్మస్ అని అభిప్రాయపడ్డారు. యేసు క్రీస్తు అందరికి ప్రభువు...క్రీస్తు ప్రేమను అందరికీ పంచుతూ సంతోషంతో, సమాధానంతో ఉండాలని సూచించారు. దేవునికి ఇష్టమైన మార్గంలో నడుచుకోవాలని అప్పుడే దేవుని కరుణా కటాక్షం మెండుగా పొందుకోగలరని అన్నారు. సండే స్కూల్ పిల్లలు, మహిళలు క్రిస్మస్ పాటలతో అలరించారు. సంఘ అధ్యక్షుడు జి.రామయ్య, సెక్రటరీ పి.ప్రభుదాస్, కోశాధికారి ఎ.బాబు క్రిస్మస్ పండుగ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



వాక్య పరిచర్య చేస్తున్న రెవరెండ్ రాజేంద్రప్రసాద్



క్రిస్మస్ పాటలతో అలరిస్తున్న మహిళలు



క్రిస్మస్ ఆరాధనలో పాల్గొన్న క్రైస్తవులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



తిరుత్తణి మేరీమాత మందిరంలో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



ఆకట్టుకున్న శాంటాక్లాస్



స్వీట్లు పంచుతున్న కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి



క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవ విశ్వాసులతో రెవరెండ్ ప్రకాష్‌రాజ్



ఏసు జననానికి సంబంధించి ఏర్పాటు చేసిన నమూనా

తిరువళ్లూరు: క్రిస్మస్ వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోదరులు సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఏటా డిసంబర్ 25న క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే సోమవారం క్రిస్మస్ కావడంతో వారం రోజుల ముందే చర్చిలను విద్యుత్ దీపాలంకరణ చేయడంతో పండుగ వాతావరణం నెలకొంది. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి నుండి ప్రార్థనలు నిర్వహించారు. కొన్ని చర్చిల్లో వేకువ జామున 4.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. క్రీస్తు నామాన్ని స్తుతిస్తూ గీతాలాపన చేశారు. చర్చిల్లో క్రీస్తు వ్యాఖ్యలు, ఆయన చేసిన బోధనలు వివరిస్తూ ప్రసంగాలు ప్రారంభమయ్యాయి. అనంతరం చర్చిల్లో నిరుపేద క్రైస్తవ సోదరులకు దుస్తులను పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన చర్చిల్లో జనం రద్దీ పెరగడంతో పండుగ శోభ సంతరించుకుంది. నూతన దుస్తులను ధరించి ప్రార్థనలకు హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం కేక్‌కట్ చేసి ప్రార్థనల్లో పాల్గొన్న వారికి పంపిణీ చేశారు. తిరువళ్లూరులోని సలోసియర్ ఆలయం, ఈసీఐ, సీఎస్ఐ, పెంతెకొస్తు తదితర ఆలయాల్లోని మేరీమాత, ఏసుక్రీస్తు విగ్రహాల వద్ద క్యాండిల్‌ను వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా చికెన్, మటన్ దుకాణాల వద్ద రద్దీ ఎక్కువగా కనిపించింది. వస్త్ర దుకాణాలు, బేకరీ వద్ద సైతం కొనుగోలుదారుల హడావిడి కనిపించింది.

చర్చిలలో క్రిస్మస్ సందడి

తిరుత్తణి: క్రిస్మస్ సందర్భంగా తిరుత్తణి పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. భారీ సంఖ్యలో క్రైస్తవులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి చిత్తూరు రోడ్డు మార్గంలోని తనిగై పుదుమై మాత చర్చిలో క్రిస్మస్ సందర్భంగా దేవాలయం పూర్తిగా విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ప్రత్యేకంగా ఏసుక్రీస్తు జననానికి సంబంధించి ఏర్పాటు చేసిన నమూనా ఆకట్టుకుంది. అలాగే శాంటాక్లాస్, క్రిస్మస్ ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదివారం రాత్రి 11 గంటల నుంచి రాత్రంతా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇందులో వేలాదిగా క్రైస్తవులు తమ కుటుంబీకులతో నూతన దుస్తులు ధరించి పాల్గొని, ఏసు జననానికి సంబంధించి గీతాలాపన చేస్తూ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే మేరీ మాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చర్చిలో సందడి నెలకొంది. పాస్టర్ ప్రేమ్ అధ్యక్షతన ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఇదే విధంగా తిరుత్తణిలోని సీఎస్ఎస్ చర్చిలో రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భారీ సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. అలాగే పళ్లిపట్టు, ఆర్కేపేట పరిసర ప్రాంతాల్లో క్రిస్మస్ ప్రార్థనలు అంబరాన్నంటాయి.

ప్రేమతో జీవించాలి

కొరుక్కుపేట: చెన్నైలోని షెనాయ్‌నగర్‌లో ఉన్న కల్వరి బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ ఆరాధనలు సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ ఎస్ ప్రకాష్‌రాజ్ దైవ సందేశాన్ని అందించారు. క్రిస్మస్ అంటే సంతోషకరమైన పండుగ అని దానిని ఆనందోత్సాహాలతో జరుపుకోవడం దేవుడు ఇచ్చిన గొప్పవరం అని చెప్పారు. సమస్త మానవాళిని పాప విముక్తులు చేసి, దైవసన్నిధికి చేర్చేందుకే యేసు ప్రభువు మానవ రూపంలో జన్మించారని, ఆయన జన్మించిన శుభదినమే క్రిస్మస్ అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రేమతో జీవించాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా పేద మహిళలకు కొత్త చీరలను కానుకలుగా అందించారు.

క్రిస్మస్ వేడుకల్లో కేతిరెడ్డి

సాక్షి, చెన్నై: చెన్నై నగరంలోని కొరుక్కుపేటలో ఫాదర్ జోసెఫ్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు. సోమవారం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి, స్వీట్స్ పంచిపెట్టారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ తన బాల్యంలో మిషన్ స్కూల్లో విద్యాభ్యాసం చేసిన కారణంగా ఇరుగు పొరుగు వారిని ప్రేమించడం, ఆపదలో ఉన్న వారిని రక్షించడం, శత్రువులను కూడా ప్రేమించడం అలవాటు చేసుకున్నట్టు వివరించారు. యువకులు కులాలకు మతాలకు అతీతంగా ముందుకెళ్లాలని పిలుపు నిచ్చారు.




మనవాలనగర్‌లో..

అచ్యుతాపురం సెజ్‌లో 5 ఎంఎల్‌డీ సీఈటీపీ

- రూ.540 కోట్లతో పారిశ్రామిక వ్యర్థాల శుద్ధి ప్లాంటు
- డీబీఎఫ్‌వోటీ విధానంలో నిర్మాణం

సాక్షి, అమరావతి: విశాఖ – చెన్నై కారిడార్‌లో భాగంగా కీలకమైన అచ్యుతాపురం సెజ్‌లో పారిశ్రామిక వ్యర్థాల శుద్ధికి 5 ఎంఎల్‌డీ కామన్ ఇఫ్లుయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)ను ఏపీఐఐసీ ఏర్పాటు చేస్తోంది. సుమారు 34 ఎకరాల విస్తీర్ణంలో రూ.540 కోట్ల వ్యయంతో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌వోటీ) విధానంలో అభివృద్ధి చేస్తున్న ఈ యూనిట్‌కు ఆసక్తి గల సంస్థల నుంచి ఏపీఐఐసీ బిడ్లను ఆహ్వానించింది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం వద్ద 5,595.47 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఏపీ సెజ్‌లో ఫార్మా, రసాయనాల యూనిట్లు అనేకం ఉన్నాయి. వీటి నుంచి ప్రతి రోజూ 11.49 ఎంఎల్‌డీ పారిశ్రామిక వ్యర్థాలు ఉత్పత్తి అవుతాయని డీపీఆర్ తయారు చేసిన ఇండో జర్మన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ అంచనావేసింది. దీనికి అనుగుణంగా ప్రస్తుతం ఉన్న 1.5 ఎంఎల్‌డీ సామర్థ్యాన్ని 2 ఎంఎల్‌డీకి పెంచడంతో పాటు కొత్తగా 3 ఎంఎల్‌డీ సీఈటీపీని ఏర్పాటు చేయనున్నారు. మూడో దశలో ఏడీబీ రుణంతో మరో 5 ఎంఎల్‌డీ సీఈటీపీని ఏర్పాటు చేయనున్నారు. సీఈటీపీ ద్వారా శుద్ధి చేసిన నీటిలో కనీసం 50 శాతం పరిశ్రమలు తిరిగి వినియోగించుకుంటాయి. దీంతోపాటు 10 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి యూనిట్‌ను, ఘన వ్యర్థాలను నిర్వహించే యాజమాన్య వ్యవస్థ కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తారు. పర్యావరణహితంగా నిర్మిస్తున్న సీఈటీపీతో పారిశ్రామిక వ్యర్థాల నియంత్రణ వ్యయం తగ్గుతుందని సెజ్‌లోని యూనిట్ల యాజమాన్యాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



యూపీఐ పేమెంట్లే మోసగాళ్ల టార్గెట్

‘అనాటమీ ఆఫ్ ఫ్రాడ్స్-2023’ నివేదిక వెల్లడి

మధ్య తరగతే టార్గెట్

సైబర్ నేరస్తులు దేశంలో రోజుకు సగటున 23 వేల మోసాలకు పాల్పడుతున్నారు. దేశంలో సైబర్ నేరాల్లో యూపీఐ మోసాలే మొదటి స్థానంలో ఉన్నాయి. మధ్య, దిగువ మధ్యతరగతి వర్గాలవారే అత్యధికంగా యూపీఐ మోసాల బారిన పడుతున్నారు. వారిలో కూడా అత్యధికులు సీనియర్ సిటిజన్లు, మహిళలే ఉన్నారు. తక్కువ మొత్తాల మోసాల ద్వారా సైబర్ ముఠాలు అత్యధికంగా కొల్లగొడుతున్నాయి. మొత్తం యూపీఐ మోసాల్లో ఒక్కో మోసంలో రూ. 10 వేల లోపు చొప్పున కొల్లగొడుతున్నవే 50 శాతం ఉంటున్నాయి. ఒక్కో మోసంలో రూ.10 వేల నుంచి రూ. లక్ష వరకు కొల్లగొడుతున్నవి 48 శాతం ఉండగా.. రూ. లక్ష మించిన మోసాలు 2 శాతమే ఉన్నాయి.

సాక్షి, అమరావతి: దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాల్లో యూపీఐ మోసాలే అత్యధికంగా ఉంటున్నాయి. డిజిటలీకరణ పెరుగుతున్న కొద్దీ అధికమవుతున్న ఆర్థిక నేరాల్లో యూపీఐ మోసాలదే అగ్రస్థానం. ‘అనాటమీ ఆఫ్ ఫ్రాడ్స్–2023’ పేరిట కాన్పూర్ ఐఐటీ, డిజిటల్ బ్యూరో కన్సల్టెన్సీ ప్రక్సీస్ సంస్థ విడుదల చేసిన నివేదిక యూపీఐ మోసాల తీవ్రతను వెల్లడించింది. దేశంలో రోజుకు సగటున 23 వేల డిజిటల్ మోసాలు జరుగుతున్నాయని ఆ నివేదిక తెలిపింది. దేశంలో ఇంటర్నెట్ వినియోగదారులు పెరుగుతుండటాన్ని సైబర్ ముఠాలు అవకాశంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నాయని ఆ నివేదిక చెప్పింది. ప్రస్తుతం దేశంలో 90.50 కోట్ల మందిగా ఉన్న ఇంటర్నెట్ వినియోగదారులు 2027నాటికి 100.14 కోట్లకు చేరతారని అంచనా వేసింది. 2019లో దేశంలో డిజిటల్ చెల్లింపులు 36 శాతం ఉండగా 2023 ఏప్రిల్ నాటికి 57 శాతానికి పెరిగాయి. 2027నాటికి డిజిటల్ చెల్లింపులు 74 శాతానికి చేరుతాయని అంచనా. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలు ప్రధానంగా యూపీఐ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు తగిన అవగాహన కల్పించాలని పేర్కొంది. ఆ నివేదిక ప్రకారం..

అప్రమత్తతే రక్షా కవచం

సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అప్రమత్తతే రక్షా కవచం. వినియోగదారులు తగిన అవగాహన కలిగి ఉండాలని సీఐడీ ఎస్పీ (సైబర్ క్రైమ్ విభాగం) హర్షవర్ధన్ రాజు చెప్పారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు ఆయన చేసిన సూచనలు ఇవీ...

- ▲ డిజిటల్ చెల్లింపులు చేసే డివైజ్‌ల ‘పిన్’ నంబర్ల గోప్యత పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలి. పిన్ నంబర్లుగానీ ఓటీపీ నంబర్లుగానీ ఎవరికి తెలియజేయకూడదు. దీర్ఘకాలంగా ఒకే పాస్‌వర్డ్‌ను కొనసాగించకూడదు. పాస్‌వర్డ్‌ను నియమిత కాలంలో మారుస్తూ ఉండాలి.
- ▲ ఫేక్ యూపీఐ సోషల్ మీడియా హ్యాండిల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. సోషల్ మీడియాలో ప్రకటనలు ఇచ్చే అన్ని యూపీఐ హ్యాండిల్స్ విశ్వసనీయమైనవి కావనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. తమ వినియోగదారుల యూపీఐ వివరాలను తెలపాలని ఆర్‌బీఐ గుర్తింపు పొందిన బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కోరవు. ఏదైనా ఆర్థిక సంస్థగానీ యాప్‌గానీ యూపీఐ వివరాలను కోరితే ఆ సంస్థ కచ్చితంగా మోసపూరితమైనదని గుర్తించి వెంటనే బ్లాక్ చేయాలి.
- ▲ పబ్లిక్ వైఫై, సురక్షితం కాని నెట్‌వర్క్‌ను ఉపయోగించి యూపీఐ చెల్లింపులు చేయకూడదు.
- ▲ మొబైల్ ఫోన్లలో ట్రాన్సాక్షన్ అలెర్ట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. మీ బ్యాంకు చెల్లింపులకు సంబంధించిన సమాచారం వెంటనే మీకు ఎస్ఎంఎస్ ద్వారా తెలిసే సౌలభ్యం ఉండాలి. మీ అనుమతిలేకుండా ఏదైనా చెల్లింపు జరిగితే వెంటనే గుర్తించి బ్యాంకును సంప్రదించి తగిన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.
- ▲ సైబర్/యూపీఐ మోసానికి గురయ్యామని గుర్తిస్తే వెంటనే సంబంధిత బ్యాంకును సంప్రదించి ఆ అకౌంట్‌ను బ్లాక్ చేయించాలి. ఫిర్యాదు చేయాలి. సైబర్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేయాలి. సైబర్ క్రైమ్ పోర్టల్ (నంబర్ 1930)కు గానీ ఏపీ సైబర్ మిత్ర (వాట్సాప్ నంబర్ 9121211100)కుగానీ ఫిర్యాదు చేయాలి.

భద్రతపై బ్యాంకుల దృష్టి

సైబర్ మోసాలు పెరుగుతుండటంతో బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు సైబర్ భద్రతపై దృష్టిసారించాయి. సైబర్ భద్రత మౌలిక వసతులను పెంచుకునేందుకు నిధులు వెచ్చిస్తున్నాయి. దేశంలో 43 ఆర్థిక సంస్థలు సైబర్ భద్రత కోసం నిధుల వెచ్చింపును భారీగా పెంచగా.. 17 శాతం ఆర్థిక సంస్థలు స్వల్పంగా పెంచాయి. కాగా 35 శాతం సంస్థలు సైబర్ భద్రత బడ్జెట్‌ను యథావిధిగా కొనసాగిస్తున్నాయి. 2 శాతం సంస్థలు సైబర్ భద్రత బడ్జెట్‌ను స్వల్పంగా తగ్గించగా 3 శాతం సంస్థలు బడ్జెట్‌ను భారీగా తగ్గించాయి.

‘ప్రగతి’ పయనంలో మహిళా శక్తి

మెప్మా ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి మహిళా యూనిట్లు

- 142 మంది మహిళలకు పారిశ్రామికవేత్తలుగా శిక్షణ
- ఆరు ట్రేడ్లలో పరిశ్రమల స్థాపనకు చర్యలు
- పర్యావరణ హిత ఉత్పత్తుల తయారీలో నైపుణ్యం
- ఉచితంగా యంత్రాలు, ముడిసరుకు అందజేత
- 10 రోజుల్లో యూనిట్లు ప్రారంభం

సాక్షి, అమరావతి: పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లో ప్రతి మహిళ స్వయంశక్తితో ఎదిగేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మరో అడుగు ముందుకేసింది. ప్రభుత్వం అందించిన వివిధ పథకాల నిధులతో స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడంతో పాటు, వారు ఆర్థికంగా మరింత ఎదిగేందుకు ‘మహిళా పట్టణ ప్రగతి యూనిట్ల’ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. స్వయం ఉపాధిపై ఆసక్తి గల 142 మంది పట్టణ మహిళా సంఘాల సభ్యుల(ఎస్‌హెచ్‌జీ)కు ఆసక్తి ఉన్న రంగాలలో పూర్తిస్థాయిలో శిక్షణనిచ్చింది. ఆయా పరిశ్రమలు పర్యావరణ హితమైనవిగా ఉండేలా ముందే జాగ్రత్తలు తీసుకున్నారు. ఇందులో సూక్ష్మ పరిశ్రమల స్థాపన, వ్యాపార విధానాలు, ముడిసరుకు లభ్యత వంటి అంశాలపై తర్ఫీదునిచ్చారు. ఒక్కో యూనిట్‌కు సగటున రూ.2.50 లక్షల చొప్పున దాదాపు రూ.4 కోట్ల నిధులను మెప్మా ఇందుకోసం వెచ్చించింది. ఇప్పటికే యంత్రాల కొనుగోలు ప్రక్రియ పూర్తవగా, మరో 10 రోజుల్లో యూనిట్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టారు. యూనిట్లు ఏర్పాటు తర్వాత స్థానికంగా ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు కూడా మెప్మా ఎండీ విజయలక్ష్మి ముందస్తు చర్యలు తీసుకున్నారు. శిక్షణ పొందిన ట్రేడ్స్‌లో నిపుణులతో అవసరమైన సహకారం అందించనున్నారు.


శిక్షణ పొందుతున్న పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులు

ఆరు ట్రేడ్లలో 142 మందికి శిక్షణ పూర్తి

నాలుగున్నర ఏళ్లలో వివిధ పథకాల ద్వారా రాష్ట్రంలో 25 లక్షల మంది పట్టణ పొదుపు సంఘాల మహిళలతో జగనన్న మహిళా మార్టులు, ఆహా క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్లు ఏర్పాటు చేయించి మెప్మా విజయం సాధించింది. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించేందుకు ఈ-కామర్స్ సంస్థలతోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు అదే మహిళలతో పరిశ్రమలు నెలకొల్పి, పర్యావరణ హితమైన సరికొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు మహిళా ‘ప్రగతి యూనిట్లు’ ఏర్పాటుపై పూర్తిస్థాయి శిక్షణనిచ్చారు. అన్ని మునిసిపాలిటీల్లోని మహిళా సంఘాలు తీర్మానాలు చేసిన ప్రాజెక్టుల్లో కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ వర్క్, పేపర్ ప్లేట్ల తయారీ, క్లాత్ బ్యాగ్స్ తయారీ, స్క్రీన్ ప్రింటింగ్, ఆర్టిఫిషియల్ జ్యూవెలరీ, కర్పూరం, దీపం వత్తులు, సాంబ్రాణి తయారీ, కారం, మసాలా పొడులు, మిల్లెట్స్ ప్రాసెసింగ్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన 142 మందికి ప్రభుత్వమే యంత్రాలు, ముడిసరుకును ఉచితంగా ఇచ్చి మొత్తం 111 యూనిట్లను పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్నారు.

మెప్మాతో మెరుగైన జీవితం



టైలరింగ్‌లో అనుభవం ఉంది. ఇంట్లోనే కుట్టుపని ప్రారంభించా. వ్యాపారాన్ని విస్తరించాలని అనుకుంటున్నా. ఎలా చేయాలో తెలియదు. పట్టణ మహిళా సంఘంలో సభ్యురాలిని కావడంతో మెప్మాను సంప్రదించాను. వారు కంప్యూటర్‌పై ఎంబ్రాయిడరీ వర్క్‌లో శిక్షణ ఇచ్చారు. ఇది నాకెంతో ఉపయోగపడుతుంది. ముడిసరుకు సేకరణ, వ్యాపారం, మార్కెటింగ్ అంశాల్లో పూర్తి శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వమే ఉచితంగా యంత్రాలను అందించడం చాలా ఆనందంగా ఉంది.

– టి.తనూజ స్రవంతి, విశాఖపట్నం

నాపై నమ్మకం పెరిగింది



సొంతంగా పరిశ్రమ పెట్టి కనీసం నలుగురికి ఉపాధి కల్పించాలన్న కోరిక ఉంది. కానీ ఎలా చేయాలో తెలియదు. ఇంట్లోనే క్లాత్ బ్యాగ్‌లు కుడుతుంటాను. వాటిపై అవసరమైన బ్రాండింగ్ కోసం మరో చోటకు వెళ్లాల్సి వస్తోంది. వ్యాపారంపైనా అవగాహన లేదు. ఈ ఏడాది ఎస్‌హెచ్‌జీలో చేరాను. మెప్మా ‘మహిళా పట్టణ ప్రగతి యూనిట్ల’ ఉచిత శిక్షణలో స్క్రీన్ ప్రింటింగ్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, వ్యాపార మెళకువలు తెలుసుకున్నాను. నేను పూర్తిస్థాయిలో వ్యాపారం చేయగలనన్న నమ్మకం లభించింది.

– బి.రాజేశ్వరి, ఏలూరు

మహిళా ప్రగతి లక్ష్యంగా శిక్షణ



మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనేది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. అందుకు అనుగుణంగా మెప్మా ఆధ్వర్యంలో జగనన్న మహిళా మార్టులు, ఆహా క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్లు వంటివి ఏర్పాటు చేసి విజయం సాధించాం. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి మహిళా ప్రగతి యూనిట్లు ఏర్పాటు చేస్తున్నాం. మహిళలు కోరుకున్న రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చాం. ఇంటిని చక్కదిద్దుకుంటూనే పిల్లల బాగోగులు చూసుకుంటున్న మహిళలకు మెప్మా అండగా ఉంటుంది. పరిశ్రమలు స్థాపించి నిర్వహించగల సామర్థ్యం మహిళలకు ఉంది. మార్కెటింగ్ విషయంలో మెప్మా వారికి అండగా నిలబడుతుంది. పదిరోజుల్లో 111 యూనిట్లు ఏర్పాటు చేస్తున్నాం. యూనిట్లు ఏర్పాటు తర్వాత వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సహకారం అందిస్తాం.

– వి.విజయలక్ష్మి, ఎండీ, మెప్మా

సూక్ష్మ సేద్యం.. సిఫార్సుల్లేకుండా సాధ్యం

సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ

- అర్హతే కొలమానం.. అడిగిన వెంటనే పరికరాల అమరిక
- 2023-24లో 902.56 కోట్లతో 2.50 లక్షల ఎకరాల్లో విస్తరణ లక్ష్యం
- జనవరి నాటికి లక్ష్యాన్ని అధిగమించేలా అడుగులు


అనంతపురం జిల్లాలో అమర్చిన బిందు, తుంపర పరికరాలు

సాక్షి, అమరావతి: బిందు, తుంపర సేద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సాగునీటి సౌకర్యం లేనిచోట్ల మైక్రో ఇరిగేషన్ సౌకర్యం కల్పించి ప్రతి నీటి బొట్టును రైతులు వినియోగించేకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నాలుగేళ్లలో 5.32 లక్షల ఎకరాల్లో సూక్ష్మ సేద్యాన్ని విస్తరించగా.. ఈ ఏడాది మరో 2.50 లక్షల ఎకరాల్లో విస్తరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటికే 1.27 లక్షల ఎకరాల్లో బిందు, తుంపర పరికరాలు అమర్చారు. మిగిలిన లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

అర్హతే కొలమానంగా.. అడిగిన ప్రతి రైతుకూ పరికరాలు

రాష్ట్రంలో ఇప్పటివరకు 12 లక్షల మంది రైతులు 34.70 లక్షల ఎకరాల్లో బిందు, 12.98 లక్షల ఎకరాల్లో తుంపర సేద్యం చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ.969.40 కోట్ల బకాయిలను చెల్లించి సూక్ష్మసేద్యం విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2019–20లో రూ.720 కోట్లు వెచ్చించి 3.05 లక్షల ఎకరాల్లో విస్తరించగా.. 1,03,453 మంది లబ్ధి పొందారు. కరోనా వల్ల రెండేళ్లపాటు దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిలిచిపోయింది. 2022–23 నుంచి మళ్లీ ప్రారంభించి.. ఆ ఏడాది రూ.636 కోట్ల ఖర్చుతో 2.27 లక్షల ఎకరాల్లో సూక్ష్మసేద్య పరికరాలను అమర్చారు. తద్వారా 82,289 మంది లబ్ధి పొందారు. 2023–24లో రూ.902.56 కోట్ల అంచనాతో మరో 2.50 లక్షల ఎకరాల్లో విస్తరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. మరింత ఎక్కువమందికి లబ్ధి చేకూర్చాలన్న లక్ష్యంతో ఎకరాలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 5–10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం, ప్రకాశం మినహా కోస్తా జిల్లాలలో 5–12.5 ఎకరాల్లోపు రైతులకు 50 శాతం సబ్సిడీతో యూనిట్లు మంజూరు చేయాలని నిర్ణయించారు. సిఫార్సులతో పని లేకుండా ఆర్బీకేలో నమోదు చేస్తే చాలు అర్హతే కొలమానంగా అడిగిన ప్రతి రైతుకు పరికరాలు అందిస్తున్నారు. రైతులు తమ వాటా చెల్లించిన 2–3 వారాల్లోపే నేరుగా వారి వ్యవసాయ క్షేత్రాలకు తీసుకెళ్లి మరీ పరికరాలు అమరుస్తున్నారు.

ఆర్బీకేల్లో 2.02 లక్షల మంది రైతులు రిజిస్ట్రేషన్

2023–24లో ఇప్పటి వరకు ఆర్బీకేల ద్వారా 5,79,517 ఎకరాలు బిందు తుంపర పరికరాల కోసం 2.02 లక్షల మంది రైతులు తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇప్పటివరకు 2.85 లక్షల ఎకరాలను ఏపీ సూక్ష్మ సాగునీటి పథకం సిబ్బంది, కంపెనీల ప్రతినిధుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసింది. 2.75 లక్షల ఎకరాల్లో పరికరాల అమరికకు కంపెనీలు బీఓక్యూను జనరేట్ చేయగా.. 1.56 లక్షల ఎకరాల్లో పరికరాల అమరికకు పరిపాలనామోదం ఇచ్చారు. ఇప్పటికే 1.27 లక్షల ఎకరాల్లో పరికరాలను బిగించారు.

సీఎంకు రుణపడి ఉంటాం

నేను 4.14 ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నా. తుంపర సేద్య పరికరాల కోసం ఆర్బీకేలో దరఖాస్తు చేశా. ఎలాంటి సిఫార్సు చేయలేదు. నాకు కావాల్సిన పరికరాలు మా పొలానికి తీసుకొచ్చి అమర్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– టి.పాపయ్య, ఎర్రవారిపాలెం, తిరుపతి జిల్లా

దిగుబడులు పెరుగుతాయి

ఐదెకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నా. పైపులు, స్ప్రింక్లర్లు కోసం దరఖాస్తు చేశా. 15 రోజుల్లో తీసుకొచ్చి అమర్చారు. వీటిద్వారా నీటిని పొదుపుగా వాడుకునే అవకాశం ఏర్పడటంతో కాయ నాణ్యత పెరిగింది. దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉంది.

– ముక్కమూరి బాలకృష్ణ, కలువాయి, నెల్లూరు జిల్లా

అవసరం ఉన్న వారికే ప్రాధాన్యత

సూక్ష్మ సేద్యం ప్రాజెక్టు శరవేగంగా జరుగుతోంది. పారదర్శకంగా అర్హుల ఎంపిక, పరికరాల అమరిక జరుగుతోంది. జిల్లాల వారీగా టార్గెట్లు నిర్దేశించినప్పటికీ అవసరం ఉన్న వారికి అర్హత ఉంటే చాలు ప్రాధాన్యత ఇస్తున్నాం. జనవరి నాటికి లక్ష్యాన్ని అధిగమించేలా ముందుకెళ్తున్నాం.

– డాక్టర్ సీబీ హరినాథరెడ్డి, పీడీ, ఏపీ సూక్ష్మసాగునీటి పథకం

రైతుబజార్లపై ‘కుళ్లు’ కథ

- రాష్ట్రంలో రైతుబజార్లు బాగున్నా.. చెత్త రాతలు రాసిన ఈనాడు
- టీడీపీ ఐదేళ్లలో ఏర్పాటు చేసింది 11 రైతు బజార్లే
- ఈ నాలుగున్నరేళ్లలో రూ.40 కోట్లతో కొత్తగా 54 రైతుబజార్లు
- 4.50 కోట్లతో ఆధునికీకరణ
- ప్రతీ రైతుబజార్లో ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం
- ఏటా పెరుగుతున్న రైతులు.. వినియోగదారుల సంఖ్య

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కూరగాయ రైతులు, వినియోగదారులకు నష్టం కలిగించేలా ఈనాడు రామోజీరావు మరో అభూతకల్పనల కథను అచ్చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పన, వినియోగదారులకు నాణ్యమైన తాజా కూరగాయలు, ఇతర నిత్యావసరాలను మార్కెట్ ధరలకంటే తక్కువకు అందించేందుకు ఏర్పాటు చేసిన రైతు బజార్ల లక్ష్యాన్ని దెబ్బతీసేలా ‘రైతు బజార్లలోనూ బాదుడే బాదుడు..’ అంటూ ఓ చెత్త కథనాన్ని అల్లారు. వైఎస్ జగన్ ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా రైతుబజార్లను బలోపేతం చేసింది. వాటిని ఆధునీకరించింది. కొత్త రైతు బజార్లనూ నిర్మించింది. పైగా చంద్రబాబు హయాంలోలాగా దళారీలు లేకుండా, కేవలం రైతులే కూరగాయలు అమ్మేలా, వినియోగదారులకు తక్కువ ధరకు లభించేలా చర్యలు తీసుకుంది. పైగా, రైతుబజార్లు ఆర్థిక అవసరాల కోసం మార్కెట్ కమిటీల మీద ఆధారపడకుండా, ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రైతు బజార్ల వ్యవస్థలో ఇలాంటి మార్పులను రామోజీ ఎప్పుడూ చూసి ఉండరు. చంద్రబాబు హయాంలో ఈ వ్యవస్థ ఎంత దైన్యస్థితికి చేరిందో అందరికీ తెలిసిందే. ఒక్క రైతుబజారూ బాగుపడలేదు. బాబు హయాంలో రైతుబజార్లు దళారీల అడ్డాగా మారిపోయాయి. దళారులు వినియోగదారులను నిత్యం దోపిడీ చేసేవారు. కనీస వసతులు లేక రైతులు, వినియోగదారుల అవస్థలు వర్ణనాతీతం. నేడు ఈ అవలక్షణాలన్నింటి నుంచి బయటపడి, వినియోగదారులకు మంచి సేవలందిస్తున్నాయన్నదే రామోజీ బాధ. ఈరోజు ఆధునికంగా రూపుదిద్దుకున్న రైతు బజార్లపై చెత్త రాతలు రాసి ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. మళ్లీ రైతుబజార్లకు రైతులు రాకూడదని, దళారీలు, వ్యాపారులే వీటిలో వ్యాపారం చేసుకోవాలని, వినియోగదారులను దోపిడీ చేయాలన్నదే రామోజీ లక్ష్యం. అందుకే ఈ అడ్డగోలు కథనం. ఈ కథనంలో వాస్తవాలేమిటో చూద్దాం..

బాబు హయాంలో రైతుబజార్ల దీనావస్థ

చంద్రబాబు అధికారం చేపట్టే నాటికి రాష్ట్రంలో 87 రైతుబజార్లుండేవి. పెరుగుతున్న జనాభాకనుగుణంగా కొత్త రైతుబజార్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కొత్త వాటి ప్రతిపాదనలను చంద్రబాబు ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. బాబు ఐదేళ్లలో మొక్కుబడిగా మార్కెట్‌యార్డు స్థలాల్లో 11 రైతుబజార్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. టీడీపీ హయాంలో ఉన్న రైతు బజార్లలో మూడొంతులు శిథిలావస్థకు చేరుకోవడంతో వినియోగదారులు, రైతులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిత్యం అవస్థలు పడేవారు. అయినా ఆ ప్రభుత్వం కన్నెత్తి చూడలేదు. రైతుబజార్లను ఆధునీకరించాలన్న ఆలోచనే చేయలేదు



కొత్తగా 54 రైతుబజార్లు కన్పించడం లేదా?

వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుబజార్ల విస్తరణ, ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. 2019 నుంచి 2023 వరకు రూ.40 కోట్లతో 54 రైతుబజార్లు కొత్తగా ఏర్పాటు చేసింది. వీటిలో ఇప్పటికే 22 రైతుబజార్ల నిర్మాణాలు పూర్తి కాగా, 17 వినియోగంలోకి వచ్చాయి. మరో 5 ఫిబ్రవరికల్లా అందుబాటులోకి రానున్నాయి. మిగిలిన 32 రైతుబజార్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. టెండర్ దశలో 11 ఉండగా, బేస్‌మెంట్ లెవల్‌లో 8, రూఫ్ లెవల్‌లో 8, రూఫ్‌లెవల్ విత్ సీలింగ్ దశలో మరో ఐదు ఉన్నాయి. వీటిని కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగానే అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నారు.

ఏటా పెరుగుతున్న రైతులు, వినియోగదారులు

ఈ ప్రభుత్వం వచ్చాక నిర్మించిన రైతుబజార్లతో కలిపి రాష్ట్రంలో 115 రైతుబజార్లున్నాయి. వీటి ద్వారా 10 వేల మంది రైతులు ప్రత్యక్షంగా, మరో 15 వేల మంది పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నారు. రోజూ 150 నుంచి 200 టన్నుల కూరగాయలను గిట్టుబాటు ధరకు విక్రయిస్తున్నారు. సగటున రోజుకు 6 లక్షల మంది వినియోగదారులు వీటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఒక్కో రైతు బజార్‌లో రోజూ రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వ్యాపారం జరుగుతోంది. బహిరంగ మార్కెట్లతో పోల్చుకుంటే 10 నుంచి 15 శాతం తక్కువ ధరలకే తాజా కూరగాయలు, నిత్యావసరాలు అందుబాటులో ఉండడంతో రైతుబజార్లకు ప్రజాదరణ రోజురోజుకు పెరుగుతోంది.

ప్రతి రైతుబజారులో అత్యాధునిక సౌకర్యాలు

ప్రస్తుతం ఉన్న రైతుబజార్ల ఆధునీకరణకు గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ‘నాడు–నేడు’ కార్యక్రమం ద్వారా రూ. 4.50 కోట్లతో ప్రతి రైతుబజారులో శిథిలమైన షెడ్ల పునరుద్ధరణ, రక్షిత తాగునీరు అందించే ఆర్వో ప్లాంట్లు, రన్నింగ్ వాటర్ సదుపాయంతో మరుగుదొడ్లు, సోలార్ రూఫ్ ప్యానల్స్, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు వంటి అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇలా విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, వైఎస్సార్ జిల్లాల్లో శిథిలమైన రైతుబజార్లన్నీ ఆధునీకరిస్తున్నారు.

ధరలు పెరిగినా, తగ్గినా మార్కెట్‌లో జోక్యం

సీఎం యాప్ ద్వారా రోజూ బహిరంగ మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులను సమీక్షిస్తూ ధరలు పతనమైనా, పెరిగినా మార్కెట్‌లో జోక్యం చేసుకుంటూ రైతులు, వినియోగదారులకు మేలు జరిగేలా జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ధరలు పెరిగిన ప్రతిసారీ రైతులు, వ్యాపారుల నుంచి మార్కెటింగ్ శాఖ ద్వారా వస్తువులు కొని, వినియోగదారులకు తక్కువ ధరలకు అందుబాటులోకి తెచ్చింది. రైతులకు ఏమాత్రం నష్టం రాకుండా గిట్టుబాటు ధరకే కొంటోంది. టమాటా, ఉల్లిపాయలతోపాటు బత్తాయి, పైనాపిల్ వంటి ఉద్యాన ఉత్పత్తులను సైతం మద్దతు ధరకు కొని, రైతుబజార్లలో సబ్సిడీ రేట్లకే విక్రయించింది. ఇలా రూ.64.04 కోట్ల విలువైన 9,025 టన్నుల ఉల్లి, 1.28 కోట్ల విలువైన 1,425 టన్నుల టమాటా, రూ.5 కోట్ల విలువైన 4,109 టన్నుల బత్తాయి, రూ.కోటికి పైగా విలువైన పైనాపిల్‌ను రైతుబజార్లలో సబ్సిడీ ధరకే అందించింది.

75 రైతుబజార్లు స్వయం సమృద్ధి

ఇప్పటివరకు రైతుబజార్లు నిర్వహణ, సిబ్బంది జీతభత్యాల కోసం పూర్తిగా మార్కెటింగ్ కమిటీలపై ఆధారపడేవి. కేంద్రం మార్కెట్ సెస్‌ను రద్దు చేయడంతో, రైతుబజార్ల నిర్వహణ, జీతభత్యాలకు ఇబ్బంది లేకుండా ప్రతి రైతుబజారు స్వయం సమృద్ధి సాధించాలన్న సంకల్పంతో వైఎస్ జగన్ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. రైతుబజార్ల స్టాల్స్ అద్దెలను సవరించడం, పార్కింగ్, సేంద్రీయ ఉత్పత్తులు, ఫిష్ ఆంధ్ర స్టాల్స్ ఏర్పాటు, ప్రకటన బోర్డుల ద్వారా ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకొంది. దీంతో 75 రైతుబజార్లు ఆర్థిక పరిపుష్టి సాధించాయి. ఇప్పుడివి ఆర్థిక అవసరాల కోసం మార్కెట్ కమిటీలపై ఆధార పడాల్సిన అవసరం లేదు.

కోవిడ్ సమయంలో కూడా

కోవిడ్ సమయంలో రైతులు నష్టపోకూడదని, వినియోగదారులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ఒక రైతుబజార్‌ను 3, 4 భాగాలుగా విభజించి, ప్రజలకు మరింత చేరువలో ఏర్పాటు చేసింది. మొబైల్ రైతుబజార్లను సైతం నెలకొల్పింది. వీటి వల్ల కూరగాయలు అందుబాటులో ఉండటంతోపాటు రైతులు, వినియోగదారులను వైరస్ వ్యాప్తి నుంచి కాపాడింది. విజయవాడ అజిత్‌సింగ్ నగర్ రైతుబజారులో కూరగాయల వ్యర్థాలను ఎరువుగా మార్చే యంత్రం ఇంకా వినియోగంలోకే రాలేదు. అయినా ఈనాడు పనిగట్టుకొని అది మూలన పడిందని రాసింది. దాదాపు అన్ని రైతుబజార్లలో మరుగుదొడ్లు నిక్షేపంగా పనిచేస్తున్నాయి. నిర్మాణం పూర్తయిన బాపట్ల, ఆరిలోవ రైతుబజార్లను ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. అయినా కళ్లుండీ కబోదిలా ఈనాడు అడ్డగోలుగా కథనం అచ్చేసింది.

కళ





అయేషా

వందలాది పిల్లల అమ్మ

'ఆరంభ శూరత్వం' చాలామందిలో కనిపిస్తుంది. అయితే చెన్నైకి చెందిన అయేషా మేడమ్‌లో అది మచ్చుకైనా కనిపించదు. మూడు దశాబ్దాల క్రితం నాటకరంగంలోకి అడుగు పెట్టిన అయేషా పిల్లల్లో సృజనాత్మక కళల వికాసానికి 'ది లిటిల్ థియేటర్' ప్రారంభించింది. కాలంతో పాటు నడుస్తూ కొత్త ఆలోచనలు జత చేస్తూ థియేటర్‌ను ఎప్పటికప్పుడు క్రియాశీలంగా, నిత్యనూతనంగా నిర్వహిస్తోంది.



మూడు దశాబ్దాల క్రితం 'క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి పనిచేయాలని ఉంది' అని తన మనసులో మాటను తండ్రి దగ్గర బయట పెట్టింది అయేషా. ఆయన ప్రోత్సాహకరంగా మాట్లాడారు. అలా తండ్రి-కూతురు ఆలోచనల్లో నుంచి వచ్చిందే ది లిటిల్ థియేటర్ ట్రస్ట్. ఆరంభంలో ఉన్న ఉత్సాహం ఆ తరువాత చాలామందిలో కరుగుతూ పోతుంది. కాని మూడు దశాబ్దాలు దాటినా 'ది లిటిల్ థియేటర్' ఉత్సాహం. సృజన శక్తి రవ్వంత కూడా తగ్గలేదు.

'ఇంకా కొత్తగా ఏం చేయవచ్చు' అని ఆలోచిస్తూ వెళుతోంది ది లిటిల్ థియేటర్.

కళలు, ఆరోగ్యాన్ని మేళవించి 2015లో చెన్నైలోని ప్రభుత్వ పిల్లల ఆసుపత్రిలో 'హాస్పిటల్ క్లౌన్స్'ను పరిచయం చేసింది లిటిల్ థియేటర్. కీమో థెరపీ చేయించుకునే పిల్లలకు 'క్రియేటివ్ థెరపీ' అందిస్తోంది.

'లిటిల్ థియేటర్' ద్వారా ఏడాది పొడవునా సృజనాత్మక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. రెండు నుంచి నాలుగు సంవత్సరాల పిల్లల కోసం ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. క్యాంప్ ఫైర్ కథల కార్యక్రమం ప్రతి నెల జరుగుతుంది. కోవిడ్ కల్లోల సమయంలో 'లిటిల్ థియేటర్' ఆన్‌లైన్‌లోకి వచ్చింది. మల్టీ-కెమెరా సెటప్‌తో షోలను ఎడిట్ చేసి అప్‌లోడ్ చేసేవారు. యూట్యూబ్ చానల్ ద్వారా ఎంతోమందికి చేరువ అయింది.

వన్స్ అపాన్ ఏ టైమ్ తన ఇద్దరు పిల్లల గురించి ఆలోచిస్తూ 'పిల్లలకు క్లాసు, హోంవర్క్ తప్ప మరో వ్యాపకం లేకుండా ఉంది' అని నిట్టూర్చింది అయేషా. విదేశాల్లో ఉన్నత చదువు చదివిన అయేషా అక్కడ పిల్లల సృజనాత్మక వికాసానికి ఎన్నో వేదికలు ఉన్న విషయాన్ని గుర్తు చేసుకుంది. ఇక్కడ వాటి కొరత ఉంది అని గ్రహించి 'ది లిటిల్ థియేటర్'కు శ్రీకారం చుట్టింది.

క్రియేటివ్ థెరపీ

హాస్పిటల్ వాతావరణంలో గాంభీర్యం, విషాదం, నిర్వేదం మిళితమై కనిపిస్తుంటాయి. ఈ వాతావరణాన్ని మార్చడానికి ఆస్పత్రిలో చేరిన పిల్లల్లో హుషారు తెప్పించడానికి, వారి పెదవులపై నవ్వులు మెరిపించడానికి చెన్నైలోని ప్రభుత్వ పిల్లల ఆస్పత్రిలో ది లిటిల్ థియేటర్ 'క్రియేటివ్ థెరపీ' నిర్వహిస్తోంది. కథల కార్యక్రమం నుంచి తోలుబొమ్మలాట వరకు రకరకాల సృజనాత్మక కళలలో పేషెంట్లుగా ఉన్న పిల్లలను కలుపుకుంటూ వారిని కొత్త ప్రపంచంలోకి తీసుకువెళతారు. 'క్రియేటివ్ థెరపీ' కోసం హాస్పిటల్‌లో ఒక స్టూడియో ఏర్పాటు చేశారు. ఈ ఏసీ స్టూడియోలో పెర్‌ఫార్మెన్స్ లైట్లు, సౌండ్ సిస్టమ్స్, డిజిటల్ టీవీ స్క్రీన్, వర్క్‌షాప్‌కు సంబంధించి రకరకాల వస్తువులు ఉంటాయి. హాస్పిటల్‌లోని పిల్లల దిగులును దూరం చేయడంలో క్రియేటివ్ థెరపీ సత్ఫలితాలు ఇచ్చింది. హాస్పిటల్‌లోని పిల్లల కోసం షెల్ఫ్‌ల నిండా బట్టలు, బొమ్మలు, కలరింగ్ బుక్స్... మొదలైనవి ఏర్పాటు చేశారు. ఇతర హాస్పిటల్స్ కూడా పిల్లల కోసం 'ఆర్ట్ థెరపీ'ని మొదలుపెట్టాయి. అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ రకరకాల పూల మొక్కలు, ప్లే పార్క్, పిట్టగూళ్లతో పేషెంట్ల కోసం 'హ్యాపీ ప్లేస్'ను ప్రారంభించింది.

తనకు ఆరేళ్ల వయసు ఉన్నప్పుడు తల్లితో 'నాకు వందలాది పిల్లలు పుడతారు' అని చెప్పింది చిన్నారి అయేషా. కూతురు మాట విని తల్లి పెద్దగా నవ్వింది. ఆ జ్ఞాపకాన్ని గుర్తు చేసుకుంటూ 'నా మాట నిజమైంది. ఇప్పుడు నాకు వందలాది పిల్లలు. ది లిటిల్ థియేటర్‌కు దగ్గరైన వాళ్లందరూ నా పిల్లలే' అంటుంది అయేష.

స్కూల్ ముగిసిన తరువాత పిల్లల కోసం నాటకానికి సంబంధించిన ప్రాథమిక విషయాలను పరిచయం చేసే కార్యక్రమాల నుంచి కుండల తయారీ వర్క్‌షాప్‌ల వరకు ఎన్నో నిర్వహించింది ది లిటిల్ థియేటర్. 'ది లిటిల్ థియేటర్' ట్రస్టు ప్రతి సంవత్సరం వందలాది మంది నిరుపేద పిల్లలకు సహాయ పడుతుంది.

ప్రస్తుతం అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన బాధ్యతలు చూస్తున్న అయేషా థియేటర్‌కు సంబంధించి సృజనాత్మక కార్యకలాపాలను మాత్రం యువతరానికే అప్పగించింది. 'ప్రతిభావంతులైన యువతరానికి సృజనాత్మక బాధ్యతలు అప్పగిస్తే కంటెంట్‌లో కొత్తదనం కనిపిస్తుంది. సంస్థ మరింత ముందు వెళుతుంది' అంటుంది అయేషా.

'నాటకరంగంలోకి అడుగు పెట్టి ఎన్నో సంవత్సరాలు అవుతుంది కదా, నేర్చుకున్నది ఏమిటి?' అనే ప్రశ్నకు జవాబు ఆమె మాటల్లోనే...

'నాటకరంగంలోకి అడుగుపెట్టి మూడు దశాబ్దాలు దాటింది. అయినప్పటికీ నేర్చుకోవాల్సింది ఇంకా ఎంతో ఉంది అనిపిస్తుంది. నాటకరంగానికి సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ కోర్సులలో చేరుతుంటాను. నేను నేర్చుకున్నదాన్ని లిటిల్ థియేటర్‌కు తీసుకువస్తుంటాను' అంటోంది అయేషా.

మా అదృష్టం

'చదువే కాదు మా పిల్లలకు కళలు కూడా కావాలి' అంటున్న తల్లిదండ్రుల పరిచయం నిజంగా మా అదృష్టం. 'చదువు తప్ప మా పిల్లలకు ఏమీ అవసరం లేదు' అని వారు అనుకొని ఉంటే ది లిటిల్ థియేటర్ ఇంత దూరం వచ్చేది కాదు. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచేది కాదు. డబ్బున్న కుటుంబం, డబ్బు లేని కుటుంబం అని తేడా లేకుండా పిల్లలందరూ కళలతో మమేకం కావాలి. మనిషి సంపూర్ణ మానవుడిగా మారడానికి కళలు ఉపయోగపడతాయి.

– అయేషా,
ఫౌండర్, ది లిటిల్ థియేటర్

ముగ్గు-ముచ్చట





శ్వేత సంబరాజు
బోడుప్పల్, హైదరాబాద్

17 చుక్కలు, 5 వరుసలు
అటు ఇటు వదిలి 5 వరకు



ఎం.సుగుణ
వైఎస్ఆర్ కడప

9 చుక్కలు
11 వరసలు
సరిచుక్క







కోమటిరెడ్డి శ్రీలత
కాపువాడ, కరీంనగర్

17 చుక్కలు, సందు చుక్క,
9 వచ్చేవరకు

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

31న కొర్నెపాడులో డా. ఖాదర్ సదస్సు

రైతుకో కిలో కొర్ర విత్తనాలు, ఔషధ మొక్కల పంపిణీ



గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గరలోని కొర్నెపాడులో గల రైతునేస్తం ఫౌండేషన్ శిక్షణా కేంద్రం ఆవరణలో డిసెంబర్ 31 (ఆదివారం)న ఉ.10 గం. నుంచి సా. 4 గం. వరకు చిరుధాన్యాలతో ఆరోగ్య ప్రయోజనాలు, చిరుధాన్యాల సాగు, ప్రకృతి వ్యవసాయం, ఔషధ మొక్కల సాగు– వినియోగంపై అవగాహన సదస్సు జరుగుతుంది. పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఆహార-ఆరోగ్య నిపుణులు డాక్టర్ ఖాదర్ వలి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఔషధ మొక్కల బోర్డు సీఈవో జె.ఎ. చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథులుగా హాజరవుతారు. సదస్సుకు హాజరయ్యే రైతులకు కేజీ చొప్పున కొర్ర విత్తనాలు, ఔషధ మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తామని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. వై. వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రవేశం ఉచితం. మధ్యాహ్నం ఉచిత భోజన సదుపాయం ఉంది. ఇతర వివరాలకు 70939 73999, 97053 83666.

29న బయోచార్ క్షేత్ర సందర్శన, చర్చాగోష్ఠి

సేంద్రియ వ్యవసాయంలో నేల సారాన్ని పెంపొందించేందుకు వాడే కట్టె బొగ్గును బయోచార్ అంటారు. బయోచార్‌ను పశువుల ఎరువు లేదా కంపోస్టుతో కలిపి పంటలకు వేసుకుంటే మంచి దిగుబడులు రావటమే కాకుండా పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది. బయోచార్‌ను రైతులు తయారు చేసుకునే, వాడుకునే పద్ధతులపై ఈ నెల 29న అనంతపురం జిల్లా గోరంట్లకు సమీపంలోని పూల చెట్ల పల్లిలోని టుడుటు ఫామ్స్‌లో క్షేత్ర సందర్శన, రైతులు, నిపుణులతో చర్చాగోష్ఠి జరగనుంది. విద్యాధిక ప్రకృతి వ్యవసాయదారుడు తేజాస్ బయోచార్‌ను ఉపయోగించి పంటలు పండిచటమే కాకుండా.. ఔత్సాహికులకు ఆఫ్‌లైన్/ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 29 (శుక్రవారం) ఉదయం నుంచి సాయంత్రం వరకు క్షేత్ర సందర్శన, చర్చాగోష్ఠి కార్యక్రమాన్ని ఆయన ఏర్పాటు చేశారు. ప్రముఖ బయోచార్ నిపుణులు డా. నక్కా సాయిభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు. ఆసక్తిగల రైతులు, ఔత్సాహిక వ్యవసాయ పట్టభద్రులు ముందుగా పేర్లు నమోదు చేయించుకొని ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. ఇతర వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం 95022 93343 నంబరులో వాట్సప్ ద్వారా సంప్రదించవచ్చు.







సాగుబడి

మూల కార్తె: డిసెంబర్ 28 వరకు
పూ.షా. కార్తె: 29 నుంచి

- పశ్చిమ కృష్ణా డెల్టా మాగాణుల్లో రైతులకు లాభదాయకంగా మారిన రబీ జొన్న సాగు
- ఖరీఫ్ వరి తర్వాత జొన్న సాగును ప్రోత్సహిస్తున్న ఐఐఎంఆర్
- గత ఏడాది 50 వేల హెక్టార్లకు పైగా సాగు.. ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం

మాగాణిలో రబీ జొన్న మేలు





సీడ్ డిబ్లర్.. వరి కోసిన తర్వాత దుక్కి చెయ్యకుండా దీనితో బెజ్జాలు వేసి, వాటిల్లో జొన్న విత్తనాలు వేస్తారు..

వాతావరణంలో మార్పు కారణంగా సరిగ్గా వర్షాలు పడకపోవడం, అధిక ఉష్ణోగ్రత, సాగునీటి కొరత వంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోగలిగే శక్తి గల పంటలు చిరుధాన్యాలు. ఈ పంటలను ఏడాది పొడుగునా ఎలాంటి కాలపరిమితి లేకుండా నిస్సారమైన భూముల్లో సైతం సాగు చేయవచ్చు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యం, ఉపాధి, పర్యావరణ ప్రయోజనాలు సమృద్ధిగా లభిస్తాయి. వ్యవసాయ భద్రతనిస్తాయి. మాగాణుల్లో ఖరీఫ్‌లో వరి సాగు తర్వాత జొన్న పంట సాగు బాగోగులను పరిశీలిద్దాం.

మన దేశ ప్రజలు వరి, గోధుమల తర్వాత జొన్నలను ప్రధాన ఆహారంగా ఎక్కువగా తింటున్నారు. సాధారణంగా జొన్న పంటలను మెట్ట భూముల్లో వర్షాధారంగా రైతులు సాగు చేస్తున్నారు. అయితే, ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పశ్చిమ కృష్ణా డెల్టాలోని మాగాణి భూముల్లో కూడా ఖరీఫ్ వరి తర్వాత రబీ పంటగా మొక్కజొన్న, మినుముతో పాటు జొన్నను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. క్రమంగా తెల్లజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతోంది. వరి కోసిన తర్వాత మళ్లీ దుక్కి చేయకుండా.. ట్రాక్టర్‌కు జోడించిన సీడ్ డ్రిల్‌తో లేదా సీడ్ డిబ్లర్‌తో బెజ్జాలు చేసి, ఆ బెజ్జాల్లో జొన్న విత్తనాలు వేస్తూ.. జీరో టిల్లేజ్ పద్ధతిలో తక్కువ ఖర్చుతో రైతులు సాగు చేస్తూ అధికాదాయం పొందుతున్నారు.

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐసిఎఆర్- ఐఐఎంఆర్)కు చెందిన ప్రధాన శాస్త్రవేత్త డా. బొంతగొర్ల సుబ్బారాయుడు తదితర ఐఐఎంఆర్ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలతో గత రెండు దశాబ్దాలుగా ఈ విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. పుణే, చెన్నై తదితర ప్రాంతాల రైతులు వచ్చి తెల్లజొన్నలు కొనుగోలు చేస్తుండటంతో వ్యాపారులు మినుము బదులు తెల్లజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2004లో వెయ్యి హెక్టార్లలో వరి మాగాణుల్లో దాళ్వా పంటగా జొన్నను సాగు చేస్తుండగా, 2022 నాటికి ఈ విస్తీర్ణం 50 వేల హెక్టార్లకు పెరిగిందని ఆయన 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. ఈ విస్తీర్ణం పెరగడానికి ముఖ్యంగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏపీ వ్యవసాయ శాఖ, నాబార్డ్, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీలు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు తోడ్పాటునందిస్తున్నాయన్నారు. 2023 అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా చిరుధాన్యాల వినియోగం దేశవిదేశాల్లో పెరిగింది. ఒక అంచనా ప్రకారం చిరుధాన్యాల లభ్యత మార్కెట్ డిమాండ్‌కు 40% తక్కువగా ఉంది. దీంతో బోరు నీటి సదుపాయం ఉన్న పశ్చిమ కృష్ణా డెల్టా మాగాణుల్లో రెండో పంటగా జొన్న సాగు విస్తీర్ణం ఈ ఏడాది ఇంకా పెరిగే అవకాశం ఉందని డా. సుబ్బారాయుడు వివరించారు.

పశ్చిమ కృష్ణా డెల్టాలో సాధారణంగా నవంబర్-డిసెంబర్‌లో రబీ జొన్న విత్తుతారు. అయితే, ఈ ఏడాది తుపాను కారణంగా జనవరిలోనూ తెల్లజొన్న విత్తే అవకాశం కనిపిస్తోంది. సంకరజాతి తెల్ల జొన్న 100-110 రోజుల పంట. ప్రైవేటు కంపెనీల విత్తనాలతో పాటు ఐఐఎంఆర్ రూపొందించిన సిఎస్‌హెచ్ 16, 25, 30 హైబ్రీడ్లను ఎక్కువ వేస్తున్నారు. వరుసల మధ్య 18 అంగుళాలు, మొక్కల మధ్య 9 అంగుళాల దూరంలో సీడ్ డ్రిల్ ద్వారా ఎకరానికి 6 కిలోల విత్తనం వాడుతున్నారు. మాగాణుల్లో రబీలో బోరు నీటి సదుపాయం ఉన్న రైతులు మొక్కజొన్న వేస్తే కనీసం 4 నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. మినుముకు పల్లాకు తెగులు, బంగారు తీగ సమస్యగా మారాయి. తెల్లజొన్నకు 2 లేక 3 నీటి తడులు సరిపోతాయి. కాబట్టి, మినుము కన్నా అధికాదాయాన్నిచ్చే తెల్లజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారని డా.సుబ్బారాయుడు వివరిస్తున్నారు.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్

వరి, మినుము కన్నా రబీ జొన్న లాభమే ఎక్కువ!

పశ్చిమ కృష్ణా డెల్టా మాగాణుల్లో ఖరీఫ్‌లో వరి, రబీలో మినుము లేదా జొన్న సాగులో 2020-2022 మధ్య 200 మంది రైతులకు ఏ పంట ఎంత లాభదాయకంగా ఉందన్న కోణంలో ఐఐఎంఆర్ ఆధ్వర్యంలో ఇటీవలే అధ్యయనం చేసినట్లు ఐఐఎంఆర్ ప్రధాన శాస్త్రవేత్త డా.సుబ్బారాయుడు తెలిపారు. దీని ప్రకారం.. ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్న రైతులకు హెక్టారుకు రూ. 46,080 ఖర్చు అవుతుండగా, రూ.78,720 నికరాదాయం వస్తోంది (రూపాయి ఖర్చుకు రూ.1.70 ఆదాయం వస్తోంది). ఇక రబీకి వచ్చే సరికి.. వరి తర్వాత మాగాణి భూముల్లో మినుము సాగు చేసిన రైతులకు హెక్టారుకు రూ. 42,480 ఖర్చు అవుతుండగా, రూ.63,720 నికరాదాయం వస్తోంది. అయితే, రబీలో తెల్లజొన్న సాగు చేసే రైతులకు హెక్టారుకు కనీసం 6 టన్నుల (ఎకరానికి సగటున 25 క్వింటాళ్లకు పైగా) దిగుబడి వస్తోంది. తద్వారా రూ. 1,75,494 ఆదాయం సమకూరుతుండగా, రూ.53,180 ఖర్చులు పోను రూ.1,22,314 నికరాదాయం వస్తోంది (రూపాయి పెట్టుబడి పెడితే రూ.2.30లు ఆదాయం వస్తోంది). ఈ విధంగా మాగాణి భూముల్లో వరి తర్వాత రెండో పంటగా తెల్లజొన్న సాగు డెల్టా రైతులకు లాభదాయకంగా మారిందని ఈ తాజా అధ్యయనంలో వెల్లడైంది.

ప్రాసెసింగ్ చేసి అమ్మితే మరింత లాభం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మాగాణుల్లో రబీ జొన్న సాగు 50 వేల హెక్టార్లకు పెరగడంతో ఏటా 3 లక్షల టన్నుల తెల్లజొన్నలు ఉత్పత్తి అవుతున్నాయి. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా జొన్న ఉత్పత్తులకు గిరాకీ పెరగడంతో ఈ ఏడాది మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. దీంతో ఈ రబీ సీజన్‌లో పశ్చిమ కృష్ణా డెల్టాలో తెల్లజొన్న సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. పండించిన జొన్నలను చాలా మంది చిన్న, సన్నకారు రైతులు నేరుగా అమ్మేసుకుంటున్నారు. వీరు సహకార సంఘాలుగా లేదా రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి తాము పండించిన జొన్నలు, ఇతర చిరుధాన్యాలను ఉమ్మడిగా ప్రాసెసింగ్ చేసి విలువను జోడించి విక్రయించుకోగలిగితే నికరాదాయాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంది. బాపట్లలోని ఫార్మసీ కళాశాల ఆవరణలో నాబార్డు సహకారంతో ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్‌లో చిరుధాన్యాల ప్రాసెసింగ్‌కు ఉపయోగపడే 5 యంత్రాలను రైతుల కోసం అందుబాటులో ఉంచాం. చిరుధాన్యాల ప్రాసెసింగ్‌పై ఆసక్తి గల రైతులు, వ్యాపారులు బాపట్ల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.గోపాలకృష్ణ (99123 42094)ను సంప్రదించవచ్చు.



– డా. బొంతగొర్ల సుబ్బారాయుడు
(99896 74550), ప్రధాన శాస్త్రవేత్త,
భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ
(ఐసిఎఆర్- ఐఐఎంఆర్),
రాజేంద్రనగర్, హైదరాబాద్.



మెయిన్ 'డ్రా'కు హుమేరా అర్హత

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ హుమేరా బహార్మస్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. నవీ ముంబైలో జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం జరిగిన రెండు క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో హుమేరా గెలిచి మెయిన్ 'డ్రా'లోకి అడుగు పెట్టింది. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో 'బై' పొందిన హుమేరా రెండో రౌండ్‌లో 6-1, 6-3తో అలెగ్జాండ్రా అజార్కో (రష్యా)పై, మూడో రౌండ్‌లో 3-6, 6-2, 6-4తో జెన్నిఫర్ లుఖమ్ (భారత్)పై విజయం సాధించింది.

నేటి నుంచి ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీ



ఈ ఏడాదిని ఘనంగా ముగించేందుకు భారత చెస్ క్రీడాకారులు సిద్ధమయ్యారు. నేటి నుంచి ఐదు రోజులపాటు ఉజ్బెకిస్తాన్‌లో ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ జరగనుంది. భారత్ నుంచి ఓపెన్ విభాగంలో 18 మంది, మహిళల విభాగంలో 11 మంది బరిలోకి దిగుతున్నారు. మహిళల ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలిల నుంచి పతకాలు ఆశించవచ్చు.

నలుగురికి తొలిసారి చోటు

ఆస్ట్రేలియా మహిళల జట్టుతో వన్డే, టి20 సిరీస్‌కు భారత జట్ల ప్రకటన



సైకా ఇషాక్, శ్రేయాంక పాటిల్



టిటాస్ సాధు



మన్నత్

ముంబై: ఈనెల 28 నుంచి ముంబైలో ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరిగే మూడు వన్డేలు, మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొనే భారత జట్లను ప్రకటించారు. ఎడంచేతి వాటం స్పిన్నర్లు సైకా ఇషాక్ (బెంగాల్), మన్నత్ కశ్యప్ (పంజాబ్), ఆఫ్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ (కర్ణాటక), మీడియం పేస్ బౌలర్ టిటాస్ సాధు (బెంగాల్)లకు తొలిసారి భారత వన్డే జట్టులో చోటు లభించింది. ఇంగ్లండ్‌తో ఇటీవల జరిగిన టి20 సిరీస్‌లో తొలిసారి జాతీయ జట్టులోకి ఎంపికైన 21 ఏళ్ల శ్రేయాంక, 28 ఏళ్ల సైకా ఇషాక్ మూడు మ్యాచ్‌ల్లో ఐదేసి వికెట్ల చొప్పున పడగొట్టి ఆకట్టుకున్నారు. మన్నత్, టిటాస్ సాధు ఈ ఏడాది అండర్-19 ప్రపంచకప్ టైటిల్ సాధించిన భారత జట్టులో సభ్యులుగా ఉన్నారు. ఆస్ట్రేలియాతో మూడు వన్డేలు డిసెంబర్ 28, 30, జనవరి 2న వాంఖెడె స్టేడియంలో... మూడు టి20 మ్యాచ్‌లు జనవరి 5, 7, 9 తేదీల్లో నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో జరుగుతాయి. ఈ రెండు సిరీస్‌లలో భారత జట్లకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన వ్యవహరిస్తారు. వన్డే సిరీస్ కోసం ఎంపిక చేసిన 16 మంది బృందంలో రెండు మార్పులతో టి20 జట్టును ఎంపిక చేశారు. వన్డే జట్టులో ఉన్న స్నేహ్ రాణా, హర్లీన్ డియోల్ స్థానాల్లో టి20 జట్టులో కనిక అహూజా, మిన్ను మణి వచ్చారు.

భారత మహిళల వన్డే జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, యస్తిక, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, శ్రేయాంక పాటిల్, మన్నత్ కశ్యప్, సైకా ఇషాక్, రేణుక సింగ్, టిటాస్ సాధు, పూజ వస్త్రకర్, స్నేహ్ రాణా, హర్లీన్ డియోల్.

సఫారీ 'టెస్టు' సవాల్

నేటి నుంచి భారత్, దక్షిణాఫ్రికా తొలి టెస్టు	సిరీస్ లక్ష్యంగా బరిలోకి టీమిండియా	సొంతగడ్డపై పటిష్టంగా బవుమా బృందం	మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

దక్షిణాఫ్రికా గడ్డపై ఎనిమిదిసార్లు పర్యటన... 23 టెస్టుల్లో బరిలోకి...4 టెస్టుల్లో విజయాలు ... 12 పరాజయాలు... సమంగా ముగిసిన మరో 7 మ్యాచ్‌లు... అయితే 31 ఏళ్లలో ఒక్క సిరీస్ కూడా భారత్ సొంతం కాలేదు... గతంలో ఎన్నడూ గెలవని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, వెస్టిండీస్ వేదికలపై కూడా ఈ మూడు దశాబ్దాల వ్యవధిలో తొలిసారి సిరీస్ విజయాలు సాధించి టీమిండియా లెక్క సరి చేసింది... కానీ ఇప్పటికి కొరకరాని కొయ్యలా మిగిలింది సఫారీ టూర్ మాత్రమే... ఇక్కడ మాత్రం మనకు ఇప్పటి వరకు సిరీస్ దక్క లేదు. ఈ రికార్డును చెరిపేసేందుకు రోహిత్ శర్మ నేతృత్వంలో టీమిండియా మరోసారి దక్షిణాఫ్రికా గడ్డపై అడుగు పెట్టింది. ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లతో సత్తా చాటి భారత్ ఈసారి ఆ లోటును తీరుస్తుందా లేక స్వదేశంలో బలమైన సఫారీ సేన తమ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటుందా అనేది ఆసక్తికరం.



రోహిత్

సెంచూరియన్: టి20, వన్డేల తర్వాత భారత్, దక్షిణాఫ్రికా మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు రంగం సిద్ధమైంది. ఇక్కడి సూపర్ స్పోర్ట్ పార్క్‌లో ఇరు జట్ల మధ్య నేటినుంచి తొలి టెస్టు జరుగుతుంది. కొంత విరామం తర్వాత రెండు టీమ్‌లూ టెస్టు మ్యాచ్ బరిలోకి దిగుతున్నాయి. భారత జట్టు ఆఖరిసారిగా గత జూలైలో వెస్టిండీస్ గడ్డపై సిరీస్ ఆడగా... దక్షిణాఫ్రికా స్వదేశంలో చివరిసారిగా గత మార్చిలో విండీస్‌తోనే తలపడింది. బలాబలాలను బట్టి చూస్తే ఇరు జట్లూ సమ ఉజ్జీలుగానే కనిపిస్తున్నాయి. రెండు టీమ్‌ల నుంచి కూడా టి20, వన్డే సిరీస్‌ల నుంచి విశ్రాంతి తీసుకున్న పలువురు అగ్రశ్రేణి ఆటగాళ్లు కొత్త ఉత్సాహంతో ఇప్పుడు టెస్టు సిరీస్‌కు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో హోరాహోరీ సమరానికి అవకాశం ఉంది.



మార్క్‌రమ్, బవుమా, రబడ

ప్రసిధ్ కృష్ణకు అవకాశం...

పుష్కర కాలం... భారత టెస్టు క్రికెట్ గొప్ప విజయాల్లో భాగంగా ఉన్న పుజారా, రహానే ఇద్దరూ తుది జట్టులో లేకుండా జట్టు విదేశీ గడ్డపై టెస్టు ఆడి 12 ఏళ్లు అయింది! 2012 జనవరిలో అడిలైడ్‌లో ఆసీస్‌తో మ్యాచ్ తర్వాత వీరిద్దరూ లేకుండా విదేశాల్లో టెస్టు ఆడని భారత జట్టు ఇప్పుడు కొత్తగా సిద్ధమైంది. వరల్డ్ కప్ ఫామ్‌ను బట్టి చూస్తే కెప్టెన్ రోహిత్, కోహ్లిల బ్యాటింగ్ భారత్‌కు కీలకం కానుంది. రాహుల్‌కు రెండు సిరీస్‌ల అనుభవం ఉండగా, గిల్ తొలిసారి దక్షిణాఫ్రికా గడ్డపై ఆడబోతున్నాడు. వీరితో పోలిస్తే శ్రేయస్, యశస్వి ఇంకా కొత్త ఆటగాళ్ల కిందే లెక్క. ఈ స్థితిలో రోహిత్, కోహ్లిల ప్రదర్శనపై జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. కఠినమైన ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొని భారత టాప్-6 ఎన్ని పరుగులు సాధిస్తుందనేది చూడాలి. ఆల్‌రౌండర్‌గా జడేజా రాణించాల్సి ఉంది. పిచ్‌ను దృష్టిలో ఉంచుకొని చూస్తే అశ్విన్‌కంటే శార్దుల్‌కే చాన్స్ దక్కవచ్చు. బుమ్రా, సిరాజ్ ప్రధానంగా పేస్ బౌలింగ్ భారం మోస్తారు. వరల్డ్‌కప్‌లో అదరగొట్టిన షమీ లేకపోవడం జట్టుకు పెద్ద లోటే. అతని స్థానంలో మూడో పేసర్‌గా ప్రసిధ్, ముకేశ్‌లకు ఒకరికి చాన్స్ ఉంటుంది.

పేస్ పదును...

టి20, వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా బౌలింగ్‌ను చూస్తే ఆ జట్టును తక్కువగా అంచనా వేయడానికి లేదు. గాయాల నుంచి కోలుకున్న ప్రధాన పేసర్లు రబడ, ఎన్‌గిడి సమరోత్సాహంతో ఉన్నారు. వీరికి తోడుగా కొత్త స్టార్ కొయెట్జీ కూడా చెలరేగేందుకు సిద్ధంగా ఉన్నాడు. సొంతగడ్డపై ఈ త్రయం బౌలింగ్ భారత్‌కు పరీక్ష పెట్టవచ్చు. భిన్నమైన శైలి గల జాన్సెన్ కూడా జత కలిస్తే జట్టు బౌలింగ్ మరింత పదునెక్కుతుంది. కెరీర్‌కు ఘనమైన ముగింపు ఇవ్వాలని భావిస్తున్న సీనియర్ ఎల్గర్‌తో పాటు మార్క్‌రమ్, బవుమా బ్యాటింగ్‌లో కీలకం. కొత్త ఆటగాళ్లు జోర్జి, బెడింగామ్ కూడా ప్రభావం చూపగలరు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, కోహ్లి, రాహుల్, శ్రేయస్, జడేజా, శార్దుల్, బుమ్రా, ప్రసిధ్, సిరాజ్. **దక్షిణాఫ్రికా:** బవుమా (కెప్టెన్), ఎల్గర్, మార్క్‌రమ్, జోర్జి, బెడింగామ్, వెరీన్, జాన్సెన్, మహరాజ్, కొయెట్జీ, రబడ, ఎన్‌గిడి.

పిచ్, వాతావరణం

పేస్‌కు బాగా అనుకూలమైన పిచ్. తొలి రెండు రోజులు మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించవచ్చు. ఈ వేదికపై దక్షిణాఫ్రికా 28 టెస్టు మ్యాచ్‌లలో 22 గెలిచి, 3 మాత్రమే ఓడింది.

గత సిరీస్‌ల ఫలితాలు...

1992 (4 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 1-0తో సిరీస్ సొంతం

1996 (3 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 2-0తో సిరీస్ కైవసం

2001 (2 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 1-0తో సిరీస్ హస్తగతం

2006 (3 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 2-1తో సిరీస్ సొంతం

2010 (3 టెస్టులు)
ఫలితం: 1-1తో సిరీస్ 'డ్రా'

2013 (2 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 1-0తో సిరీస్ కైవసం

2018 (3 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 2-1తో సిరీస్ సొంతం

2021 (3 టెస్టులు)
ఫలితం: దక్షిణాఫ్రికా 2-1తో సిరీస్ కైవసం

"నా దృష్టిలో ఈ సిరీస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. గతంలో ఏ భారత జట్టూ సాధించని ఘనతను అందుకునేందుకు ఇదో మంచి అవకాశం. గతంలో రెండుసార్లు సిరీస్ గెలిచేందుకు చేరువగా వచ్చినా సాధ్యం కాలేదు. ఈసారి కూడా ఎంతో ఆత్మవిశ్వాసంతో ఇక్కడ అడుగు పెట్టాం. వరల్డ్ కప్ ఫైనల్ ఓటమిని ఈ టెస్టు సిరీస్‌కు ముడి పెట్టలేం. అయితే ఇంత కష్టపడుతున్నాం కాబట్టి ఏదో ఒకటి దక్కాలి. షమీ లేకపోవడం లోటే కానీ కొత్త బౌలర్‌కు ఇది మంచి అవకాశం. మ్యాచ్‌కు ముందే మూడో పేసర్‌పై నిర్ణయం తీసుకుంటాం. కీపర్‌గా రాహుల్ రాణిస్తాడనే నమ్ముతున్నాం. అతను ఈసారి మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేస్తాడు. నాకు ఆడేందుకు అవకాశం ఉన్న అన్ని చోట్లా క్రికెట్ ఆడుతూనే ఉంటాం. అందరికీ ఆడాలనే ఉంటుంది. (మీరు ఏం అడుగుతారో నాకు తెలుసు). నా టి20 భవిష్యత్తు గురించి త్వరలోనే మీకు సమాధానం లభిస్తుంది.

-రోహిత్ శర్మ, భారత కెప్టెన్



స్టీలర్స్‌కు ఐదో విజయం

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో హరియాణా స్టీలర్స్ జోరు కొనసాగుతోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 42-29తో తమిళ్ తలైవాస్ జట్టుపై ఘనవిజయం సాధించింది. ఈ లీగ్‌లో స్టీలర్స్‌కిది ఐదో విజయం కావడం విశేషం. స్టీలర్స్ తరఫున శివమ్ ఎనిమిది పాయింట్లు సాధించగా... జైదీప్ దహియా, రాహుల్ ఏడు పాయింట్ల చొప్పున స్కోరు చేశారు. తలైవాస్ తరఫున సాహిల్ గులియా పది పాయింట్లు, హిమాన్షు సింగ్ తొమ్మిది పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 38-29తో బెంగాల్ వారియర్స్ జట్టుపై గెలిచింది. నేడు జరిగే మ్యాచ్‌లో పుణేరి పల్టన్‌తో పట్నా పైరేట్స్ తలపడుతుంది.

పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	6	5	1	0	26
హరియాణా స్టీలర్స్	7	5	2	0	26
జైపూర్ పింక్ పాంథర్స్	7	4	2	1	25
గుజరాత్ జెయింట్స్	7	4	3	0	23
బెంగాల్ వారియర్స్	8	3	3	2	22
యు ముంబా	6	4	2	0	21
బెంగళూరు బుల్స్	8	3	5	0	19
పట్నా పైరేట్స్	6	3	3	0	17
దబంగ్ ఢిల్లీ	6	3	3	0	15
యూపీ యోధాస్	7	2	4	1	15
తమిళ్ తలైవాస్	7	2	5	0	11
తెలుగు టైటాన్స్	7	1	6	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

ధ్రువ్‌కు రెండు ఐఎం నార్మ్‌లు



సాక్షి, హైదరాబాద్: వరుసగా రెండు అంతర్జాతీయ చెస్ టోర్నీల్లో రాణించిన హైదరాబాద్ కుర్రాడు తోట ధ్రువ్ రెండు అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) నార్మ్‌లు సంపాదించాడు. బుడాపెస్ట్ ఓపెన్ టోర్నీలో ధ్రువ్ ఏడు పాయింట్లతో విజేతగా నిలిచి తొలి ఐఎం నార్మ్ సాధించాడు. అనంతరం స్పెయిన్‌లో జరిగిన సిట్‌గెస్ చెస్ ఫెస్టివల్‌లో 14 ఏళ్ల ధ్రువ్ ఏడు పాయింట్లు స్కోరు చేసి రెండో నార్మ్ దక్కించుకున్నాడు.

సినిమా



కుమార్తె రాహాతో రణ్‌బీర్, ఆలియా

ఆ ఆనందం వారి కళ్లల్లో కనిపిస్తోంది

హీరో రణ్‌బీర్ కపూర్, హీరోయిన్ ఆలియా భట్ తమ ముద్దుల కుమార్తె రాహాని తొలిసారి ప్రపంచానికి పరిచయం చేశారు. ఈ ప్రేమ పక్షులు 2022 ఏప్రిల్ 14న వివాహం చేసుకున్నారు. అదే ఏడాది నవంబర్‌లో వీరికి రాహా జన్మించింది. అయితే ఇప్పటివరకు రాహా ముఖాన్ని అభిమానులకు పరిచయం చేయలేదు. తాజాగా క్రిస్మస్ సందర్భంగా ఈ జంట కుమార్తెతో కలిసి ఫొటోలకు పోజులిచ్చారు. రాహా అచ్చం రణ్‌బీర్ కపూర్ తండ్రి రిషీ కపూర్‌లా ఉందంటూ అభిమానులు పోస్టులు పెడుతున్నారు. ప్రస్తుతం రాహా వీడియోలు, ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

- హీరో అడివి శేష్

''బబుల్‌గమ్' ట్రైలర్ చూస్తే అందమైన సినిమా అనిపిస్తోంది. ఈ మూవీ ద్వారా రోషన్ హీరోగా పరిచయమవుతున్నాడు. పిల్లలు పరిచయమవుతుంటే తల్లిదండ్రుల కళ్లల్లో ఓ ఆనందం ఉంటుంది... అది సుమ, రాజీవ్ కనకాలగారి కళ్లల్లో కనిపిస్తోంది'' అని హీరో అడివి శేష్ అన్నారు. రోషన్ కనకాల, మానసా చౌదరి జంటగా రవికాంత్ పేరేపు దర్శకత్వం వహించిన చిత్రం 'బబుల్‌గమ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న రిలీజ్ కానుంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ బుకింగ్ ఈవెంట్‌కి హీరోలు అడివి శేష్, విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ, డైరెక్టర్ నందినీ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''బబుల్‌గమ్' ట్రైలర్‌లో రోషన్ నటన చూస్తే కొత్తవాడిలా అనిపించట్లేదు'' అన్నారు. ''బబుల్‌గమ్' ప్రేక్షకుల మనసుల్లో అంటుకుపోవాలని కోరుకుంటున్నాను'' అన్నారు సిద్ధు జొన్నలగడ్డ. ''ఈ చిత్రంలో మనందరిలో ఉండే భావోద్వేగాలు ఉంటాయి. అందరూ ఎంజాయ్ చేస్తారు'' అన్నారు రోషన్ కనకాల. ''బబుల్‌గమ్'ని థియేటర్స్‌లోనే చూడాలి'' అన్నారు రవికాంత్ పేరేపు. ''రోషన్‌ని ఏడాది క్రితం కలిసినప్పుడు అమాయకంగా కనిపించాడు. కానీ, ఈ చిత్రం టీజర్, ట్రైలర్‌లో తన విశ్వరూపం కనిపించింది'' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్.




అడివి శేష్, రోషన్, విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ

పోటీ వద్దనే 'గేమ్ చేంజర్' వాయిదా

- 'దిల్' రాజు

''ఈ సంక్రాంతికి 'గుంటూరు కారం, సైంధవ్, నా సామి రంగ, ఈగల్, హనుమాన్' వంటి సినిమాలు విడుదల కానున్నాయి. ఐదుగురు నిర్మాతలనూ పిలిచి మాట్లాడాం. రెండు సినిమాల రిలీజ్‌ను వాయిదా వేసుకోవాలని సూచించాం. సంక్రాంతి పోటీలో ఉండకూడదని నా సినిమా 'గేమ్ చేంజర్'ను వేసవికి వాయిదా వేశాం. ఎవరైనా రిలీజ్ వాయిదా వేసుకుంటే.. సోలో రిలీజ్ చేసేలా ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున చర్యలు తీసుకుంటాం'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జనవరి 21న 'లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ' సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్‌ను నిర్వహించనుంది. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న 'దిల్' రాజు సంక్రాంతి సినిమాల గురించి మాట్లాడారు. లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ గురు రామాచారి మాట్లాడుతూ– ''దివంగత గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగారి ఆశీస్సులతో 1999లో ప్రారంభమైన ఈ అకాడమీ 25 వసంతాలు పూర్తి చేసుకుంటోంది. ఈ సిల్వర్ జూబ్లీ ఉత్సవానికి సారథ్యం వహించాలని డైరెక్టర్ రాఘవేంద్ర రావు, నిర్మాత 'దిల్' రాజుగార్లను కోరగానే ఒప్పుకున్నారు'' అన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''నా తొలి సినిమా 'దిల్' నుంచి రామాచారిగారితో పరిచయం ఉంది. ఆ టైమ్‌లో 'లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ' గురించి చెప్పారాయన. ఈ అకాడమీలో ఉచితంగా సంగీతం నేర్పిస్తున్నారు. అద్దె భవనంలో ఉన్న అకాడమీకి ప్రభుత్వం తరఫున సాయం వచ్చేలా చేయాలనే ఆలోచన ఉంది'' అన్నారు.



'దిల్'రాజు, రామాచారి



రకుల్, జాకీ



నీలాంటి వాళ్లు అరుదు!

- రకుల్

''నీలా దయ గల గుణం, అమాయకత్వం ఉన్న వ్యక్తులు అరుదుగా ఉంటారు. నువ్వు చెప్పే జోక్స్ సిల్లీగా ఉన్నప్పటికీ ఫన్నీగా ఉంటాయి. నీలోని ఈ లక్షణాలను ఎప్పటికీ కాపాడుకోవాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే ఇవన్నీ ఉన్న అబ్బాయిలు అరుదుగా ఉంటారు'' అంటూ ప్రేమికుడు జాకీ భగ్నానీ పుట్టినరోజు (డిసెంబర్ 25) సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా రకుల్ ప్రీత్ సింగ్ షేర్ చేశారు. ''నీతో ప్రయాణాలు, కలిసి నవ్వుకోవడం, తినడం.. అన్నీ నాకు ఆనందాన్నిస్తాయి. హ్యాపీ బర్త్ డే మై హార్ట్. ఈ పుట్టినరోజు మాత్రమే కాదు.. ప్రతి రోజూ నువ్వు కోరుకున్నవన్నీ నీకు దక్కాలి'' అంటూ జాకీతో ఉన్న ఫొటోలను షేర్ చేశారు రకుల్. కాగా రెండేళ్ల క్రితం ఈ ఇద్దరూ తాము రిలేషన్‌లో ఉన్న విషయాన్ని ప్రకటించారు. ఇక బాలీవుడ్ నిర్మాత వాసు భగ్నానీ తనయుడు అయిన జాకీ భగ్నానీ నటుడిగా, నిర్మాతగా కొనసాగుతున్నారు.

జాతరలో ఫైట్



ఎన్టీఆర్

ఒకవైపు గంగమ్మ జాతర జోరుగా జరుగుతోంది. గంగమ్మ భక్తుడు దేవర భక్తి శ్రద్ధలతో జాతరలో పాల్గొంటున్నాడు. అయితే జాతరలో విలన్లతో ఫైట్ చేయాల్సి వచ్చింది. అంతే.. రఫ్ఫాడించాడు. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న 'దేవర' చిత్రంలోని జాతర ఇది. ఎన్టీఆర్ పాత్ర పేరు దేవర. ఈ చిత్రంలో గంగమ్మ జాతర నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ఉన్నాయని తెలిసింది. ఈ జాతర బ్యాక్‌డ్రాప్‌లోనే భారీ ఫైట్ ఉంటుందట. ఈ జాతర, ఫైట్ సినిమాకే హైలైట్‌గా నిలిచేంత భారీగా ఉంటాయని భోగట్టా. ఈ చిత్రంలో ఉన్న పోరాట సన్నివేశాలన్నీ భారీగా ఉంటాయని తెలిసింది. వాటిలో ముఖ్యంగా నీటి లోపల తీసిన యాక్షన్ సీన్, జాతర బ్యాక్‌డ్రాప్ ఫైట్ భారీ స్థాయిలో ఉంటాయట. ఈ చిత్రం ద్వారా జాన్వీ కపూర్ తెలుగు తెరకు కథానాయికగా పరిచయం కానున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న 'దేవర' తొలి భాగం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల కానుంది.

జీవితాంతం గుర్తుండిపోతుంది

- కాకర్ల కృష్ణ



ప్రముఖ నిర్మాత కాకర్ల కృష్ణ స్వర్ణోత్సవం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. సూపర్ స్టార్ కృష్ణ, అంజలీదేవి, చంద్రకళ ప్రధాన పాత్రల్లో కె. సత్యం దర్శకత్వంలో కాకర్ల కృష్ణ నిర్మించిన చిత్రం 'ఇంటింటి కథ' (1974). ఈ సినిమా విడుదలై 50 ఏళ్లయిన సందర్భంగా నిర్మాత కాకర్ల కృష్ణ స్వర్ణోత్సవం జరిగింది. కాకర్ల కృష్ణ మనవడు త్రికాంత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన ఈ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత, నటుడు మురళీ మోహన్ మాట్లాడుతూ– ''వీబీ రాజేంద్ర ప్రసాద్‌గారి జగపతి సంస్థలో ప్రొడక్షన్ మేనేజర్‌గా ప్రయాణం ప్రారంభించిన కృష్ణ ఆ తర్వాత 'ఇంటింటి కథ' సినిమాతో నిర్మాతగా మారారు'' అన్నారు. కాకర్ల కృష్ణ మాట్లాడుతూ– ''ఇంత మంది ఆత్మీయుల సమక్షంలో నా స్వర్ణోత్సవం జరగటం సంతోషంగా ఉంది. ఇది నా జీవితాంతం తీపి జ్ఞాపకంగా ఉంటుంది'' అన్నారు. ''కృష్ణ స్వర్ణోత్సవం జరగడం సముచితంగా, సంతోషంగా ఉంది'' అన్నారు రచయిత పరుచూరి గోపాలకృష్ణ. నిర్మాతలు కె. దామోదర ప్రసాద్, జి. ఆదిశేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

ఆ కన్నుల చూపుల్లోన...



విరాన్ ముత్తంశెట్టి, బాబీ

హీరో అల్లు అర్జున్ కజిన్ విరాన్ ముత్తంశెట్టి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ముఖ్య గమనిక'. ఇందులో లావణ్య హీరోయిన్. సినిమాటోగ్రాఫర్ వేణు మురళీధర్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ రాజశేఖర్, సాయికృష్ణ నిర్మించారు. కిరణ్ వెన్న సంగీతం అందించారు. ఈ చిత్రంలోని 'ఆ కన్నుల చూపుల్లోన..' అంటూ సాగే పాటని డైరెక్టర్ కేఎస్ రవీంద్ర (బాబీ) రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''బన్నీగారిని (అల్లు అర్జున్) ఎప్పుడు కలవడానికి వెళ్లినా విరాన్ కనిపించేవాడు. అంత పెద్ద ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ పెట్టుకుని వాళ్ల సహాయం తీసుకోకుండా వారి ఆశీస్సులు తీసుకుని సొంత గుర్తింపు కోసం స్వతంత్రంగా ప్రయత్నించడం సంతోషం'' అన్నారు. ''నేను పుట్టింది, పెరిగింది ఇండస్ట్రీలోనే. బాబీ అన్నలాంటి మంచి మనిషి ఇండస్ట్రీలో లేరు. ఎన్ని జన్మలు ఎత్తినా మీరు చేసిన సహకారం మర్చిపోను'' అన్నారు విరాన్. ''తప్పు చేయాలన్న ఆలోచన వచ్చి ఆ ఆలోచనని సరిదిద్దుకునే లోపే కొన్ని అనర్థాలు జరుగుతాయి.. ఆ నేపథ్యంలో తీసిన సినిమా ఇది'' అన్నారు వేణు మురళీధర్. ''మా బ్యానర్‌లో నిర్మించిన తొలి చిత్రం 'ముఖ్య గమనిక'. త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు రాజశేఖర్.

పల్లెటూరి ప్రేమ



అనురాగ్, అవికా

అనురాగ్, అవికా గోర్ జంటగా సత్య ద్వారంపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'ఉమాపతి'. కె. కోటేశ్వర రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సత్య ద్వారంపూడి, కె. కోటేశ్వర రావు మాట్లాడుతూ– ''ప్రేమ కథలు ఎప్పుడు వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తుంటారు. ప్రస్తుత తరుణంలో గ్రామీణ ప్రేమకథలు రావడం అరుదుగా మారింది. ఆ లోటు తీర్చేందుకు పల్లెటూరి ప్రేమకథతో మా సినిమా వస్తోంది. కుటుంబ సమేతంగా చూడదగ్గ ఈ చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రాఘవేంద్ర, సంగీతం: శక్తికాంత్ కార్తీక్, నేపథ్య సంగీతం: జీవన్ బాబు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 242	నిఫ్టీ ▲ 94
71,107	21,349

విదేశీ సూచీలు (తొలి నాలుగు శుక్రవారం ముగింపు)			
నాస్డాక్	14,993	▲	29
డోజోన్స్	37,386	▼	18
ఎఫ్టీఎస్ఈ 100	7,698	▲	3
డాక్స్	16,706	▲	19
షాంఘై	2,919	▲	4
నికాయ్	33,254	▲	85

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.85	83.87
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.49	107.06
€	యూరో	ఎస్‌బీఐ	90.53	92.90
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.84	59.17
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.55	57.53
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.02	63.51
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.74	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.55	12.62

ఐపీవోలకు కంపెనీల క్యూ..

2024లోనూ మరిన్ని ఇష్యూలు
- స్టాక్ నిపుణుల అంచనాలు
- 2023లో రూ. 52,000 కోట్ల నిధుల సమీకరణ



ఇటీవల సెకండరీ మార్కెట్లు ఆకాశమే హద్దుగా చెలరేగుతూ సరికొత్త గరిష్టాలను తాకుతున్నాయి. పెట్టుబడుల ప్రోత్సాహంతో ప్రైమరీ మార్కెట్ సైతం కళకళలాడుతోంది. ఈ ప్రభావంతో కొత్త ఏడాది (2024)లోనూ పలు కంపెనీలు నిధుల సమీకరణకు క్యూ కట్టనున్నట్లు స్టాక్ విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో పబ్లిక్ ఇష్యూల వెల్లువ కొనసాగనున్నట్లు అంచనా వేశారు.

న్యూఢిల్లీ: ప్రస్తుత ఏడాది (2023)లో ఇప్పటి వరకూ పబ్లిక్ ఇష్యూల ద్వారా కంపెనీలు రూ. 52,000 కోట్లు సమకూర్చుకున్నాయి. ప్రధాన ఎక్స్చేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ ద్వారా దేశీ కార్పొరేట్లు సమీకరించిన నిధులివి. నిజానికి ఓవైపు వడ్డీ రేట్లు, మరోపక్క భౌగోళిక, రాజకీయ రిస్కులు పెరిగినప్పటికీ.. ఐపీవోలు దూకుడు చూపుతున్నాయి. పలు కంపెనీలు స్టాక్ ఎక్స్చేంజీలలో లిస్టింగ్ కోసం వెల్లువలా సెబీ తలుపు తడుతున్నాయి. దీంతో వచ్చే ఏడాదిలోనూ ప్రైమరీ మార్కెట్ బుల్లిష్ ధోరణిలోనే కొనసాగనున్నట్లు పలువురు స్టాక్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. గతేడాది (2022)లో ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీని మినహాయిస్తే పబ్లిక్ ఇష్యూల ద్వారా కంపెనీలు రూ. 20,557 కోట్లు సమీకరించాయి. అంటే దీంతో పోలిస్తే ఈ ఏడాది 36 శాతం అధికంగా పెట్టుబడులు అందుకున్నాయి. ప్రధానంగా మధ్య, చిన్న తరహా కంపెనీలు హవా చూపాయి. మార్కెట్ సెంటిమెంటు బలంగా ఉండటం ఇందుకు దోహదపడుతోంది. అయితే ప్రపంచ సవాళ్ల నేపథ్యంలో ఏడాది మొదట్లో మార్కెట్లు డీలా పడిన సంగతి తెలిసిందే.

కారణాలున్నాయ్..


ప్రైమరీ మార్కెట్లు జోరందుకోవడానికి లిస్టింగ్ లాభాలు, అందుబాటు ధరల్లో డీల్స్ కారణమవుతున్నట్లు పంటోమత్ క్యాపిటల్ అడ్వయిజర్స్ ఎండీ మహావీర్ లూనావత్ పేర్కొన్నారు. ఆయా రంగాల్లోని లిస్టెడ్ కంపెనీలు అధిక విలువల్లో ట్రేడవుతుండటం ఇందుకు జత కలిసినట్లు అభిప్రాయపడ్డారు. పటిష్ట నియంత్రణా వ్యవస్థలు సైతం ఇందుకు అండగా నిలుస్తున్నట్లు తెలియజేశారు. 2023లో కనిపిస్తున్న ప్రోత్సాహకర పరిస్థితులు 2024లోనూ కొనసాగనున్నట్లు ఆనంద్ రాఠీ అడ్వయిజర్స్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ ఈసీఎం వి.ప్రశాంత్ రావు అంచనా వేశారు. ఇది బంగారు కాలంగా నిలిచే వీలున్నట్లు పేర్కొన్నారు. తరలి వస్తున్న దేశ, విదేశీ పెట్టుబడులు, దేశీ మార్కెట్ల వృద్ధికిగల భారీ అవకాశాల కారణంగా వచ్చే ఏడాదిలోనూ ఐపీవో మార్కెట్ మరింత జోరు చూపనున్నట్లు జేఎం ఫైనాన్షియల్ ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్ హెడ్ నేహా అగర్వాల్ అభిప్రాయపడ్డారు. సార్వత్రిక ఎన్నికల పూర్తి తదితర అనిశ్చితులు తొలగితే మరిన్ని పెట్టుబడులు తరలివస్తాయని పేర్కొన్నారు.

మరో రూ. 26,000 కోట్లు

నిధుల సమీకరణకు ఇప్పటికే క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి 24 కంపెనీలు అనుమతులు పొందాయి. ఇవి ఐపీవోలు చేపట్టడం ద్వారా రూ. 26,000 కోట్లు సమీకరించేందుకు వీలుంది. ఈ బాటలో మరో 32 కంపెనీలు లిస్టింగ్‌కు వీలుగా సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. వీటి నిధుల సమీకరణ అంచనా రూ. 35,000 కోట్లుగా ప్రైమ్ డేటాబేస్ పేర్కొంది. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం 2023లో ఐపీవోల ద్వారా 58 కంపెనీలు రూ. 52,637 కోట్లు సమకూర్చుకున్నాయి. వీటిలో రూ. 3,200 కోట్లు అందుకున్న నెక్సస్ సెలక్ట్ ట్రస్ట్ రీట్ ఉంది. గతేడాది ఎల్ఐసీ (రూ. 20,557 కోట్లు) సహా.. 40 కంపెనీలు ఉమ్మడిగా రూ. 59,302 కోట్లు సమీకరించాయి. అయితే అంతకుముందు 2021లో 63 కంపెనీలు ప్రైమరీ మార్కెట్ ద్వారా ఏకంగా రూ. 1.2 లక్షల కోట్లను అందుకున్నాయి. వెరసి రెండు దశాబ్దాలలోనే అత్యధిక నిధుల సమీకరణగా 2021 నిలిచింది! అధిక లిక్విడిటీ, ఇన్వెస్టర్ల ఆసక్తి, మార్కెట్ల జోరు నేపథ్యంలో గత మూడేళ్లలో 150 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలను చేపట్టాయి.

త్వరలో రిలయన్స్-డిస్నీ స్టార్ ఇండియా విలీనం

ఒప్పందం ఖరారు
- ఫిబ్రవరికల్లా ప్రక్రియ పూర్తయ్యే అవకాశం



న్యూఢిల్లీ: దేశీయంగా మీడియా రంగంలో కన్సాలిడేషన్‌కు తెరతీస్తూ డిస్నీ-స్టార్ ఇండియాను విలీనం చేసుకునే దిశగా రిలయన్స్ ఇండస్ట్రీస్ మెగా ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు సంబంధించిన నాన్-బైండింగ్ టర్మ్ షీటుపై సంతకాల కోసం లండన్‌లో జరిగిన భేటీలో డిస్నీ ప్రతినిధి కెవిన్ మేయర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీకి అత్యంత సన్నిహితుడైన మనోజ్ మోదీ తదితరులు పాల్గొన్నారు. ఒప్పందం కుదరడంతో వ్యాపార విలువ మదింపు తదితర ప్రక్రియలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం 45-60 రోజుల గడువు విధించుకున్నారు. అవసరమైతే దీన్ని పొడిగించే అవకాశం ఉంది. జనవరి ఆఖరు నాటికి ఈ డీల్‌ను పూర్తి చేయాలని రిలయన్స్ ఆసక్తిగా ఉన్నప్పటికీ ఫిబ్రవరి ఆఖరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ డీల్ పూర్తిగా స్టాక్, నగదు రూపంలో ఉండగలదని వివరించాయి. ఇరు సంస్థలు టర్మ్ షీటుపై చాలాకాలంగా కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. ప్రతిపాదన ప్రకారం రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో భాగమైన వయాకామ్18, స్టార్ ఇండియా కార్యకలాపాలను విలీనం చేస్తారు. విలీన సంస్థలో రిలయన్స్‌కు 51 శాతం, డిస్నీకి 49 శాతం వాటాలు ఉండనున్నాయి. ఇందులో స్టార్ ఇండియాకు చెందిన 77 చానల్స్, వయాకామ్18కి చెందిన 38 చానల్స్ కలిపి మొత్తం 115 చానల్స్ ఉంటాయి. వీటితో పాటు డిస్నీ ప్లస్ హాట్‌స్టార్, జియో సినిమా అనే రెండు స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు కూడా భాగమవుతాయి. జీ ఎంటర్‌టైన్‌మెంట్, కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ (గతంలో సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా) విలీన ప్రక్రియ జరుగుతుండగా కొత్తగా రిలయన్స్, డిస్నీ-స్టార్ డీల్ కూడా కుదిరితే దేశీయంగా మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాల్లో కన్సాలిడేషన్ జరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

అర్జెంటీనా లిథియం నిల్వలపై భారత్ దృష్టి

5 బ్లాక్‌ల కొనుగోలు కోసం తుదిదశలో చర్చలు



న్యూఢిల్లీ: లిథియం దిగుమతుల కోసం ప్రస్తుతం చైనాపైనే ఎక్కువగా ఆధారపడుతున్న భారత్.. ఇతరత్రా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా అర్జెంటీనాలో అయిదు లిథియం బ్లాకులను కొనుగోలు చేయడంపై దృష్టి పెట్టింది. భారత అవసరాల కోసం విదేశాల్లో ఖనిజ నిక్షేపాలను అభివృద్ధి చేసే జాయింట్ వెంచర్ కంపెనీ ఖనిజ్ బిదేశ్ ఇండియా లిమిటెడ్ (కాబిల్), అర్జెంటీనాకు చెందిన క్యాటామార్కా మినరా వై ఎనర్జెటికా సొసైడాడ్ డెల్ ఎస్టాడో (క్యామ్‌యెన్) ఇందుకు సంబంధించిన ఒప్పందంపై కసరత్తు చేస్తున్నాయి. చర్చలు తుదిదశలో ఉన్నాయని, త్వరలోనే ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చే అయిదేళ్లలో లిథియం నిక్షేపాల అన్వేషణ, గనుల అభివృద్ధిపై భారత్ సుమారు రూ. 200 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించాయి. భారత్ ఇప్పటికే ఆస్ట్రేలియాలో రెండు లిథియం, మూడు కోబాల్ట్ గనులను అభివృద్ధి చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే క్రమంలో లిథియంకు సంబంధించి అర్జెంటీనాతో ఒప్పందం రెండోది కానుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు మొదలైన వాటి బ్యాటరీల్లో లిథియంను విరివిగా ఉపయోగిస్తారు. భారత్ గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 25,000 కోట్ల విలువ చేసే లిథియంను చైనా, హాంకాంగ్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా 98 మిలియన్ టన్నుల లిథియం నిక్షేపాలు ఉండగా ఇందులో 20 శాతం నిక్షేపాలు అర్జెంటీనాలో ఉన్నాయి.

యూనికార్న్‌గా ఇన్‌క్రెడ్

60 మిలియన్ డాలర్ల సమీకరణ



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఇన్‌క్రెడ్ తాజాగా యూనికార్న్ (1 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్) హోదా దక్కించుకుంది. ప్రస్తుత, కొత్త ఇన్వెస్టర్ల నుంచి 60 మిలియన్ డాలర్లు సమీకరించడంతో ఇది సాధ్యపడింది. తాజా పెట్టుబడుల రాకతో సంస్థ విలువ 1.04 బిలియన్ డాలర్లకు చేరిందని ఇన్‌క్రెడ్ పేర్కొంది. తద్వారా ఈ ఏడాది యూనికార్న్ హోదా దక్కించుకున్న రెండో సంస్థగా నిల్చిందని పేర్కొంది. రాబోయే రోజుల్లో వ్యాపారాన్ని మరింతగా విస్తరించడానికి ఈ నిధులను వినియోగించనున్నట్లు ఇన్‌క్రెడ్ సీఈవో భూపీందర్ సింగ్ తెలిపారు. ఎంఈఎంజీకి చెందిన రంజన్ పాయ్, ఆర్‌పీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ రవి పిళ్లై, డాయిష్ బ్యాంక్ గ్లోబల్ కో-హెడ్ రామ్ నాయక్ తదితరులు ఇన్వెస్ట్ చేసిన వారిలో ఉన్నారు. ఇన్‌క్రెడ్ సంస్థ కన్జూమర్ రుణాలు, విద్యా రుణాలు మొదలైన వ్యాపార విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-12-2023	
విశాఖ	620-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	615-00
విజయవాడ	615-00
రిటైల్ ధర (డజను)	72.00
25-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	599-00
వరంగల్	601-00
రిటైల్ ధర	6.60

ఫస్ట్‌క్రైలో సాఫ్ట్‌బ్యాంక్ వాటాల విక్రయం

310 మిలియన్ డాలర్ల విలువ చేసే షేర్ల అమ్మకం



న్యూఢిల్లీ: త్వరలో ఐపీవోకి రానున్న రిటైల్ సంస్థ ఫస్ట్‌క్రైలో జపాన్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ 310 మిలియన్ డాలర్ల విలువ చేసే షేర్లను విక్రయించింది. రెండు విడతల్లో షేర్లను విక్రయించగా, కొందరు అత్యంత సంపన్న ఇన్వెస్టర్లు కొనుగోలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ డీల్స్‌తో ఫస్ట్‌క్రై వేల్యుయేషన్‌ను 3.5-3.75 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టినట్లు పేర్కొన్నాయి. 900 మిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ఫస్ట్‌క్రైలో సాఫ్ట్‌బ్యాంక్ గతంలో 400 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. తాజా విక్రయానంతరం కంపెనీలో సాఫ్ట్‌బ్యాంక్‌కు ఇంకా 800-900 మిలియన్ డాలర్ల విలువ చేసే వాటాలు ఉన్నాయి. వీటిని తర్వాత విక్రయించే యోచనలో ఉంది. మొత్తం మీద ఫస్ట్‌క్రైలో పెట్టుబడుల ద్వారా 1.3 బిలియన్ డాలర్లు ఆర్జించడంపై సాఫ్ట్‌బ్యాంక్ దృష్టి పెట్టినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

సీసీఎంబీ, హైదరాబాద్‌లో 24 టెక్నికల్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ).. టెక్నికల్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 24
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్-18, టెక్నికల్ ఆఫీసర్-05, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్/మెడికల్ ఆఫీసర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ, బీఈ, బీటెక్, బీఫార్మసీ, ఎంబీబీఎస్, ఎంబీఏ, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** టెక్నికల్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు, టెక్నికల్ ఆఫీసర్‌కు 30 ఏళ్లు, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్/ఎంవోల ఖాళీలకు 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** టెక్నికల్ అసిస్టెంట్/టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు ట్రేడ్ టెస్ట్, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు. సీనియర్ టెక్నికల్ ఆఫీసర్/ఎంవోకు ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**20.01.2024
» **వెబ్‌సైట్:** www.ccmb.res.in

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 484 పోస్టులు

ముంబైలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్.. దేశవ్యాప్తంగా ఉన్న సీబీఐ శాఖల్లో సఫాయి కర్మచారి కమ్ సబ్ స్టాఫ్/సబ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 484
» **జోన్ల వారీగా ఖాళీలు:** అహ్మదాబాద్-76, భోపాల్-38, ఢిల్లీ-76, కోల్‌కతా-02, లక్నో-78, ఎంఎంజెడ్‌వో-పుణె-118, పాట్నా-96.
» **అర్హత:**ఎస్ఎస్‌సీ/పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:**31.03.2023 నాటికి 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **పే స్కేల్:** నెలకు రూ.14,500 నుంచి రూ.28,145 వరకూ ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష(70 మార్కులు), లోకల్ లాంగ్వేజ్ టెస్ట్(30 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**09.01.2024
» **వెబ్‌సైట్:** https://centralbankofindia.co.in

ఐఐఎంటీ తిరుచిరాపల్లిలో పీహెచ్‌డీ ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ తిరుచిరాపల్లి (ఐఐఎంటీ).. 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
» **స్పెషలైజేషన్లు:** ఎకనామిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ అండ్ అనలిటిక్స్, మార్కెటింగ్, ఆపరేషన్ మేనేజ్‌మెంట్ అండ్ డెసిషన్స్ సైన్సెస్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజీ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్.
» **అర్హత:** ఏదైనా విభాగంలో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ లేదా సీఏ/ ఐసీడబ్ల్యూఏ/ సీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 31.01.2024.
» **వెబ్‌సైట్:** iimtrichy.ac.in

ఐఐఎం ఇండోర్‌లో డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఇండోర్ 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టోరల్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(డీపీఎం) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
» **స్పెషలైజేషన్లు:** కమ్యూనికేషన్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్.
» **అర్హత:** ఏదైనా విభాగంలో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ లేదా సీఏ, ఐసీడబ్ల్యూఏ, సీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.02.2024.
» **వెబ్‌సైట్:** www.iimidr.ac.in.

నిఫ్ట్.. ఫ్యాషన్ కెరీర్‌కు బెస్ట్!

» నిఫ్ట్ అడ్మిషన్స్ టెస్ట్ 2024 నోటిఫికేషన్ విడుదల
» ఫ్యాషన్, డిజైన్‌లో పలు బ్యాచిలర్, పీజీ ప్రోగ్రామ్స్
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ
» కోర్సులు పూర్తి చేసుకుంటే ఉజ్వల కెరీర్స్

నిఫ్ట్.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఈ విద్యాసంస్థ నిఫ్ట్ అడ్మిషన్స్ టెస్ట్-2024కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రవేశ ప్రక్రియలో ఉత్తీర్ణత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న నిఫ్ట్ క్యాంపస్‌ల్లో.. ఫ్యాషన్, డిజైనింగ్‌కు సంబంధించి పలు బ్యాచిలర్, పీజీ కోర్సుల్లో అడుగు పెట్టొచ్చు! నిఫ్ట్ కోర్సులు పూర్తి చేసుకుంటే.. ఫ్యాషన్ రంగంలో ఉజ్వల కెరీర్ అవకాశాలు లభిస్తాయి. ఈ నేపథ్యంలో.. నిఫ్ట్ అడ్మిషన్ ప్రక్రియ, కోర్సులు, సీట్లు, ఎంపిక ప్రక్రియలో విజయానికి మార్గాలపై ప్రత్యేక కథనం..



ఫ్యాషన్ టెక్నాలజీకి సంబంధించి ఆధునిక నైపుణ్యాలు అందించే ఉద్దేశంతో కేంద్ర టెక్స్‌టైల్ శాఖ దేశవ్యాప్తంగా నిఫ్ట్ క్యాంపస్‌లను ఏర్పాటు చేసింది. నిఫ్ట్‌కు ప్రస్తుతం జాతీయ స్థాయిలో 18 క్యాంపస్‌ల్లో పది కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఇంటర్మీడియెట్ అర్హతతో ప్రవేశం లభించే బ్యాచిలర్ స్థాయి కోర్సులు ఏడు, అదే విధంగా బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో ప్రవేశం కల్పించే పీజీ కోర్సులు మూడు. నిఫ్ట్ క్యాంపస్‌ల్లో ప్రవేశాల కోసం ప్రతి ఏటా నిఫ్ట్-అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తారు. తాజాగా 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకుగాను ఎంపిక ప్రక్రియ మొదలైంది.

బ్యాచిలర్ కోర్సులివే

- బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్, లెదర్ డిజైన్, యాక్సెసరీ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, నిట్‌వేర్ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్; బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ- అపెరల్ ప్రొడక్షన్.
- ఈ కోర్సులకు ఇంటర్మీడియెట్ ఏ గ్రూప్ విద్యార్థులైనా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరితోపాటు ఏఐసీటీఈ లేదా స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గుర్తింపు పొందిన మూడు లేదా నాలుగేళ్ల వ్యవధిలోని డిప్లొమా కోర్సుల ఉత్తీర్ణులు కూడా దరఖాస్తుకు అర్హులే.
- నిఫ్ట్ అందిస్తున్న ప్రోగ్రామ్‌లలో ప్రత్యేకమైనది బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (బీఎఫ్.టెక్). ఇది ఫ్యాషన్ విభాగంలో టెక్నికల్ నైపుణ్యాలను అందించే ప్రత్యేక కోర్సు. ఇందులో ప్రవేశానికి దరఖాస్తు చేయాలనుకుంటే.. ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. ఈ కోర్సుకు మూడు/నాలుగేళ్ల వ్యవధిలోని డిప్లొమా కోర్సుల ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్‌లు

పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో.. మాస్టర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. మాస్టర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సులకు బ్యాచిలర్ డిగ్రీ లేదా నిఫ్ట్/నిడ్ నుంచి డిప్లొమా లేదా అండర్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు. అదేవిధంగా మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశానికి నిఫ్ట్ అందించే బీ.ఎఫ్‌టెక్ ఉత్తీర్ణులు లేదా ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి బీటెక్/బీఈ ఉత్తీర్ణులు అర్హులు.

వయసు

2024 ఆగస్ట్ 1 నాటికి 24 సంవత్సరాలలోపు ఉండాలి. పీజీ ప్రోగ్రామ్‌లకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

నిఫ్ట్-అడ్మిషన్ ప్రక్రియను ఆయా కోర్సులను బట్టి మూడు దశల్లో నిర్వహిస్తారు. యూజీ, పీజీ కోర్సులకు తొలి దశలో జనరల్ ఎబిలిటీ టెస్ట్(జీఏటీ) ఉంటుంది. ఆ తర్వాత క్రియేటివ్ ఎబిలిటీ టెస్ట్ (సీఏటీ), సిట్యుయేషన్ టెస్ట్ ఉంటాయి. పీజీ కోర్సులకు పర్సనల్ ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్‌లు నిర్వహిస్తారు.

తొలిదశ జీఏటీ

- తొలి దశలో నిర్వహించే జీఏటీ (జనరల్ ఎబిలిటీ టెస్ట్)ని బ్యాచిలర్, పీజీ కోర్సుల అభ్యర్థులు ఇద్దరికీ నిర్వహిస్తారు. పరీక్ష ప్రశ్నల క్లిష్టత స్థాయి మాస్టర్ కోర్సుల్లో కొంత ఎక్కువగా ఉంటుంది. బీడిజైన్ జీఏటీ పేపర్‌లో 100 ప్రశ్నలు ఉంటాయి, పరీక్ష సమయం రెండు గంటలు. ఎండిజైన్ జీఏఈ పేపర్‌లో 120 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు.
- జీఏటీలో.. క్వాంటిటేటివ్ ఎబిలిటీ; కమ్యూనికేషన్ ఎబిలిటీ; ఇంగ్లిష్ కాంప్రహెన్షన్; అనలిటికల్ ఎబిలిటీ; జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులకు కమ్యూనికేషన్ ఎబిలిటీ, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ రెండు విభాగాలు కలిపి 40 ప్రశ్నలు అడుగుతారు.

ఫ్యాషన్ టెక్నాలజీ.. పరీక్ష ఇలా

బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సులకు తొలి దశ ప్రవేశ పరీక్ష జీఏటీ ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఈ పరీక్షలో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ అండ్ ఇంగ్లిష్ కాంప్రహెన్షన్, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. వీటితో పాటు ఒక కేస్ స్టడీ కూడా ఉంటుంది. మొత్తంగా ఈ పరీక్షలో 150 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు.

రెండో దశ సీఏటీ

మొదటి దశలో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో.. క్రియేటివ్ ఎబిలిటీ టెస్ట్ (సీఏటీ) నిర్వహిస్తారు. అభ్యర్థుల్లోని పరిశీలనాత్మక నైపుణ్యం, సృజనాత్మకత, డిజైన్ సామర్థ్యాలను పరీక్షించే విధంగా ఈ పరీక్ష ఉంటుంది.

సిట్యుయేషన్ టెస్ట్

రెండు దశల్లో చూపిన ప్రతిభను ప్రామాణికంగా తీసుకుని యూజీ కోర్సులకు సిట్యుయేషన్ టెస్ట్ నిర్వహిస్తారు. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ అభ్యర్థులకు నిర్దిష్ట మెటీరియల్ అందించి ఏదైనా ఆకృతిని రూపొందించమని లేదా ఏదైనా ఒక సందర్భాన్ని పేర్కొని దానికి తగినట్లుగా ఊహా చిత్రం గీయమని అడుగుతారు. అభ్యర్థుల సృజనాత్మక ప్రతిభను పరిశీలించే విధంగా పరీక్ష ఉంటుంది.

గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ

జీఏటీ, సీఏటీలలో విజయం సాధించిన పీజీ అభ్యర్థులకు చివరగా గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.భావ వ్యక్తీకరణ సామర్థ్యం, విషయ పరిజ్ఞానం, ఆలోచన సామర్థ్యాలను పరీక్షించే విధంగా గ్రూప్ డిస్కషన్స్ ఉంటాయి. పర్సనల్ ఇంటర్వ్యూ పూర్తిగా ఫ్యాషన్ కెరీర్ పట్ల అభ్యర్థికున్న ఆసక్తి, దానికి సరితూగే తత్వాలను గ్రహించే విధంగా ఉంటుంది.

తుది జాబితా.. వెయిటేజీ విధానం

- నిఫ్ట్ ప్రవేశ ప్రక్రియలోని మూడు దశల్లోనూ ప్రతిభ చూపిన వారితో మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఆయా టెస్ట్‌లలో పొందిన మార్కులకు నిర్దిష్ట వెయిటేజీ కల్పిస్తూ ఈ జాబితాను తయారుచేస్తారు.
- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులకు సీఏటీకి 50 శాతం, జీఏటీకి 30 శాతం, సిట్యుయేషన్ టెస్ట్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది.
- బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులకు జీఏటీ సెక్షన్-ఎకు 70 శాతం; జీఏటీ సెక్షన్-బికు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.
- మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సుకు సీఏటీకి 40 శాతం, జీఏటీకి 30 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ కల్పిస్తారు.
- మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సులకు జీఏటీకి 70 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ ఉంటుంది.

టాప్ స్కోర్ సాధించాలంటే

- **క్వాంటిటేటివ్ ఎబిలిటీ:** మ్యాథమెటిక్స్, అర్థమెటిక్స్ అంశాలపై పట్టు సాధించాలి. వర్క్ అండ్ టాస్క్, శాతాలు, నిష్పత్తులు, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్‌కు సంబంధించిన అంశాలు ప్రాక్టీస్ చేయాలి.
- **కమ్యూనికేషన్ ఎబిలిటీ, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్:** ఇంగ్లిష్ భాషలో ప్రాథమిక నైపుణ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని బేసిక్ గ్రామర్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- **అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ:** విశ్లేషణ సామర్థ్యాన్ని, తార్కిక నైపుణ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. నిర్దిష్టంగా ఒక అంశంలో ఇమిడి ఉన్న ప్రధాన అంశాలు, వాటికి సంబంధించి అప్లికేషన్ అప్రోచ్‌తో ప్రాక్టీస్ చేయాలి.
- **జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్:** ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలు హైస్కూల్ స్థాయి సోషల్ సబ్జెక్ట్ నుంచి ఉంటాయి. అదే విధంగా ముఖ్యమైన తేదీలు-సందర్భాలు వంటివి కూడా అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు తాజాగా జరిగిన ముఖ్యమైన సంఘటనలు కూడా తెలుసుకోవాలి.
- కేస్ స్టడీ: బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్‌కోర్సు అభ్యర్థులకు నిర్వహించే కేస్ స్టడీ.. ఒక వాస్తవ సమస్యను ఇచ్చి దానికి పరిష్కారం అడిగేలా ఉంటుంది. అభ్యర్థులకు అన్వయ దృక్పథం, సమస్యను గుర్తించే లక్షణం అవసరం.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జనవరి 3
- **ఆన్‌లైన్ ఎంట్రన్స్ టెస్ట్ తేదీ:** 2024, ఫిబ్రవరి 5
- **ఫలితాల వెల్లడి:** 2024 మార్చిలో
- **సిట్యుయేషన్ టెస్ట్/పర్సనల్ ఇంటర్వ్యూ:** 2024 ఏప్రిల్‌లో
- **వివరాలకు వెబ్‌సైట్:** https://www.nift.ac.in/admission

2024లో ఇస్రో ప్రయోగాల
పరంపర

జనవరి 1 నుంచే ప్రారంభం..
2023లో 51 ఉపగ్రహాలు నింగిలోకి



పీఎస్ఎల్వీ సీ58 రాకెట్ ద్వారా ప్రయోగించబోయే ఎక్స్‌పోశాట్ ఉపగ్రహం...

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): కొత్త ఏడాది ఆరంభంతోనే భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రయోగాల పరంపర ప్రారంభం కానుంది. 2024 జనవరి 1న ఉదయం 7.30 గంటలకు సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ సీ58 రాకెట్ ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా 480 కిలోల బరువు కలిగిన ఎక్స్‌పోశాట్ అనే ఖగోళ పరిశోధనా ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. దీంతో పాటు కేరళ యూనివర్సిటీ విద్యార్థులు తయారు చేసిన ఒక కేజీ బరువు కలిగిన వియ్‌శాట్ అనే బుల్లి ఉపగ్రహాన్ని కూడా ప్రయోగించనున్నారు. భూమికి అత్యంత తక్కువ దూరంలోని లియో ఆర్బిట్‌లోకి ఈ రెండు ఉపగ్రహాలను పంపేందుకు అంతా సిద్ధం చేశారు. ఈ ప్రయోగం తరువాత చంద్రయాన్-4, గగన్‌యాన్-1 ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. ఇవి కాకుండా 2024లో 12 ప్రయోగాలకు తగ్గకుండా చేపట్టాలని ఇస్రో లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2023లో ఇస్రో అత్యధికంగా 8 రాకెట్ ప్రయోగాలు చేపట్టి 51 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపింది. పీఎస్ఎల్వీ రాకెట్ల సిరీస్‌లో మూడు రాకెట్ల ద్వారా పది ఉపగ్రహాలు, ఎస్ఎస్ఎల్వీ డీ2 రాకెట్ ద్వారా మూడు ఉపగ్రహాలు, జీఎస్ఎల్వీ ఎఫ్12 రాకెట్ ద్వారా ఒక ఉపగ్రహం, ఎల్వీఎం 3 సిరీస్‌లో మూడు రాకెట్ ప్రయోగాల ద్వారా 37 ఉపగ్రహాలను ప్రయోగించారు. ఇవి కాకుండా గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించి ఆర్ఎల్వీటీడీని ప్రయోగాత్మకంగా నిర్వహించి విజయం సాధించారు. 2023 ఇస్రోకి చరిత్రలో నిలిచిపోయిన సంవత్సరంగా చెప్పవచ్చును. ఎందుకంటే ఈ ఏడాది ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్-3 ప్రయోగంలో భాగంగా చంద్రుడి దక్షిణధృవంపై ల్యాండర్, రోవర్‌ను విజయవంతంగా దించి చరిత్రలో మరువలేని విజయాన్ని సొంతం చేసుకున్నారు. అదే విధంగా సూర్యుడిపై పరిశోధనలకు గాను ఆదిత్య ఎల్1 అనే ఉపగ్రహాన్ని పంపించగా అది విజయవంతంగా పనిచేస్తోంది. ఆదిత్య ఎల్1 ఉపగ్రహం 2024 జనవరి 5న లాంగ్రేజియన్ పాయింట్ 1 వద్దకు చేరుకుంటుందని ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు.



తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్కే కృపాసాగర్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్ రెడ్డి, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వీఆర్కే కృపాసాగర్, జస్టిస్ సురేష్‌రెడ్డి, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్, చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్టోరియా గౌరీ, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేఎస్ హేమలేఖ సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు. అదే విధంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌రెడ్డి తిరుచానూరుకు వెళ్లి శ్రీపద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు. కాగా, తిరుమలలో ఆదివారం అర్ధరాత్రి వరకు వైకుంఠ ద్వారంలో శ్రీవారిని 63,519 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీలో రూ.5.05 కోట్ల కానుకలు సమర్పించారు.

ప్రేమించి మోసం చేశాడు

- క్రికెటర్ కరియప్పపై పోలీసులకు ఓ యువతి ఫిర్యాదు
- ఆమె డ్రగ్స్, మద్యానికి బానిసైంది
- పైగా బెదిరిస్తోంది.. క్రికెటర్ కూడా ఫిర్యాదు



మీడియాతో మాట్లాడుతున్న యువతి

బనశంకరి: కర్ణాటక రంజీ, ఐపీఎల్ క్రికెటర్ కేసీ కరియప్ప తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి.. శారీరకంగా వాడుకుని మోసం చేశాడని ఓ యువతి సోమవారం బెంగళూరు ఆర్‌టీ నగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 'నేను మోడలింగ్ చేస్తుంటాను. ఈ క్రమంలో నేను, కేసీ కరియప్ప ఇన్‌స్టాగామ్‌లో పరిచయమయ్యాం. మా ఇద్దరిదీ ఒకే ఊరు, ఒకే కులం కావడంతో స్నేహంగా ఉండేవాళ్లం. నన్ను తన ఇంట్లోవారికి పరిచయం చేశాడు. అతడు ప్రేమించిన అమ్మాయి కంటే కూడా నేనంటేనే ఇష్టమని నన్ను నమ్మించాడు. అంతేకాకుండా శారీరకంగా లొంగదీసుకున్నాడు. దీంతో నేను గర్భం దాల్చడంతో గర్భస్రావం చేసుకోవాలని నాపై ఒత్తిడి తెచ్చాడు. ఐపీఎల్ సీజన్ ముగిశాక పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. నాతో మాత్రలు మింగించాడు. దీంతో నాకు అబార్షన్ అయ్యింది. ఈ క్రమంలో ఒకసారి అతడి ప్రేయసికి ఫోన్ చేయగా మోసగాడని అర్థమైంది. చివరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించడంతో తొందరపడొద్దు.. త్వరలోనే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఈ నెల 22న అతడి ఇంటికి వెళ్లగా తనను ఐపీఎల్‌లో ఎవరూ కొనకపోవడంతో బాధగా ఉందని.. తర్వాత కలుస్తానని నన్ను వెనక్కి పంపించేశాడు. ఒకసారి నాపై కత్తితో దాడి చేయబోయాడు. కరియప్ప ఆరోపించినట్లు నేను ఏ డ్రగ్స్ తీసుకోలేదు.. దీన్ని నిరూపించడానికి రక్తపరీక్షలకు కూడా సిద్ధంగా ఉన్నా.

నన్ను బెదిరిస్తోంది: కరియప్ప



క్రికెటర్ కరియప్ప

మరోవైపు ప్రియురాలిపై కరియప్ప బెంగళూరు బాగలుకుంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన వ్యక్తిగత, క్రీడా జీవితాన్ని నాశనం చేస్తానని బెదిరిస్తోందని పేర్కొన్నాడు. ఆమె డ్రగ్స్, మద్యానికి బానిస కావడం వల్లే సంబంధాన్ని తెంచుకున్నానని తెలిపాడు. దీంతో తనను, తన కుటుంబాన్ని బజారుకీడుస్తానని బెదిరిస్తోందని ఆరోపించాడు. పోలీసులు రెండు ఫిర్యాదులపైనా విచారణ చేపట్టారు. కాగా, యువతికి ఇదివరకే పెళ్లయింది.. తన భర్త నుంచి విడాకులు కూడా తీసుకుంది. మరోవైపు కరియప్ప ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ ఎలెవన్, కోల్‌కతా నైట్‌రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల తరఫున ఆడాడు.

■ తెలంగాణ

250 గజాల స్థలం.. వడ్డీలేని రుణం

- సింగరేణి డే రోజున వేతనంతో కూడిన సెలవు
- కార్మికులకు మంత్రి పొంగులేటి హామీ

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. కార్మికుల సొంతింటి కల సాకారం చేసేందుకు ఒక్కొక్కరికి 250 గజాల స్థలం ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణానికి రూ.20 లక్షల వడ్డీలేని రుణం అందజేస్తామని ప్రకటించారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, సత్తుపల్లి ఏరియాల్లోని బొగ్గు గనుల వద్ద జరిగిన సభల్లో మాట్లాడారు. సింగరేణి డే రోజున కార్మికులకు సెలవు దినంగా ప్రకటిస్తామని, మహిళా ఉద్యోగులకు అండర్ గ్రౌండ్‌లో కాకుండా సర్ఫేస్ విధులు కేటాయించేలా అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. కొత్తగూడెం ఏరియాలో రాంపూర్ భూగర్భ గని, వీకే- 7తో పాటు మరో ఓసీ ఏర్పాటుకు కృషి చేస్తామని, గత ప్రభుత్వ నిర్వాకంతో తగ్గిన కార్మికుల సంఖ్యను గణనీయంగా పెంచుతామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి అందరి నాయకుడని, కార్మికుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు.

■ తెలంగాణ

'గ్రూప్-2' నిర్వహణపై సందిగ్ధం!

జనవరి 6, 7 తేదీల్లో పరీక్షలు ఉంటాయని 2 నెలల కిందటే ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ

తాజాగా కమిషన్ చైర్మన్, సభ్యుల రాజీనామాతో ప్రశ్నార్థకంగా మారిన నిర్వహణ

రెండుసార్లు వాయిదాపడ్డ పరీక్షలు ఈసారైనా జరుగుతాయో లేదోనని అభ్యర్థుల్లో ఆందోళన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రూప్-2 అర్హత పరీక్షలపై అభ్యర్థుల్లో ఆందోళన తీవ్రమవుతోంది. ఇప్పటికే రెండుసార్లు వాయిదాపడ్డ ఈ పరీక్షలు ఈసారైనా జరుగుతాయో లేదోనని అభ్యర్థులు కలవరపడుతున్నారు. గ్రూప్-2 అర్హత పరీక్షలను 2024 జనవరి 6, 7 తేదీల్లో నిర్వహిస్తామంటూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) రెండు నెలల క్రితమే ప్రకటించింది. వాస్తవానికి ఈ ఏడాది నవంబర్ 2-3 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తేదీలు ప్రకటించినప్పటికీ పరీక్షల సన్నద్ధతకు మరింత సమయం ఇవ్వాలంటూ అభ్యర్థుల నుంచి ఒత్తిడి రావడం తోపాటు ఎన్నికల షెడ్యూల్ వెలువడటం, పోలీసులు ఎన్నికల విధుల్లో ఉండటంతో 2024 జనవరిలో పరీక్షలు నిర్వహిస్తామని కమిషన్ ప్రకటించింది. ఈ లెక్కన మరో 10 రోజుల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీకి మరో సమస్య ఎదురైంది. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డితోపాటు ఐదుగురు సభ్యులు గవర్నర్‌ను కలసి రాజీనామాలు సమర్పించాలనుకున్నా ఆమె సమయం ఇవ్వకపోవడంతో గవర్నర్ కార్యాలయానికి రాజీనామా లేఖలు పంపారు. అయితే రాజీనామాలు పంపి వారం దాటినా గవర్నర్ కార్యాలయం నుంచి వాటిని ఆమోదిస్తున్నట్లుగానీ.. తిరస్కరిస్తున్నట్లుగానీ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని సమాచారం. వారి రాజీనామాలను గవర్నర్ ఆమోదిస్తే తప్ప కొత్తగా చైర్మన్‌ను, సభ్యులను నియమించే అవకాశం లేదని అంటున్నారు. కానీ కొత్త ప్రభుత్వం వారి రాజీనామాలతో సంబంధం లేకుండా అప్పటికే ఖాళీగా ఉన్న మరో ఐదుగురు సభ్యులను నియమించే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కొత్త చైర్మన్, సభ్యులు వచ్చాకే పరీక్షలు?

ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఉన్నప్పటికీ నిబంధనల ప్రకారం పాలనా వ్యవహారాలకే పరిమితం కావాల్సిన పరిస్థితి ఉంది. పరీక్షల నిర్వహణ, నియామకాలకు సంబంధించిన అంశాల్లో చైర్మన్, సభ్యుల నిర్ణయమే కీలకపాత్ర పోషించనుంది. దీంతో జనవరిలో జరగాల్సిన గ్రూప్-2 పరీక్షల నిర్వహణ కష్టమేనని సమాచారం. ఈ నేపథ్యంలో కొత్త కమిషన్ ఏర్పాటై మరోమారు తేదీలు ప్రకటించే వరకు అభ్యర్థులు పరీక్షల సన్నద్ధతను కొనసాగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

గతేడాది డిసెంబర్‌లో వెలువడిన నోటిఫికేషన్...

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో 783 గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి గతేడాది డిసెంబర్‌లో టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తుల స్వీకరణకు నెలపాటు అవకాశం కల్పించింది. దీంతో 5.5 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గ్రూప్-2 అర్హత పరీక్షలను ఈ ఏడాది ఆగస్టు 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు కమిషన్ తొలుత ప్రకటించింది. అయితే ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో పలు పరీక్షలను కమిషన్ రీషెడ్యూల్ చేసింది. దీంతో గ్రూప్-2 పరీక్షలు నవంబర్‌కు వాయిదా పడగా... అభ్యర్థుల ఒత్తిడి, ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో రెండోసారి జనవరికి వాయిదా పడ్డాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943